www.andhrajyothy.com
విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 275

శనివారం | 20-1-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 7.28 తదుపరి ఏకాదశి; నక్షత్రం: కృత్తిక తె. 3.10 తదుపరి రోహిణి; వర్జ్యం: మ. 3.00-4.37; దుర్ముహూర్తం: ఉ. 6.53-8.22; అమృతఘడియలు: రా. 12.44-2.21; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.00

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అల్లదిగో..
బాల రాముడు



పద్మపీఠంపై చిరునవ్వులు చిందిస్తూ..


చేతిలో బంగారు ధనస్సు, బాణం

ప్రాణప్రతిష్ఠకు సిద్ధమైన దివ్య మంగళ రూపం

అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించే బాలరాముడు

అయోధ్య, జనవరి 19: అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠకు మూడు రోజుల ముందే బాల రాముడి విగ్రహం తొలి చిత్రం శుక్రవారం వెలుగు చూసింది. కృష్ణశిలపై చెక్కిన రాముడి విగ్రహం ముగ్ధమనోహరంగా అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ విగ్రహంలో శ్రీరాముడు పద్మపీఠంపై చిరునవ్వులు చిందిస్తూ, చేతిలో బంగారు

మిగతా 2వ పేజీలో...



భద్రతా వలయంలో
అయోధ్య

12 వేల సిబ్బంది మోహరింపు

నగరంలో 10 వేల సీసీ కెమెరాలు

ఏఐ టెక్నాలజీతో ప్రత్యేక నిఘా

జగన్ కేసుల్లో ఎందుకీ జాప్యం?



జగన్ అక్రమాస్తుల కేసులపై విచారణ ఇన్నిసార్లు వాయిదా పడేందుకు కారణమేంటి? అసలు ఇంత కాలయాపన ఎందుకు జరుగుతోంది? ఇన్నేళ్లలో కనీసం ఒక్క డిశ్చార్జి పిటిషన్‌ను పరిష్కరించారా? - సుప్రీంకోర్టు

విచారణలో ఆలస్యం ఎందుకు?.. ఒక్క డిశ్చార్జి పిటిషనైనా పరిష్కరించారా?

ఇంత కాలయాపన అయితే ఎలా?.. సుప్రీంకోర్టు వరుస ప్రశ్నలు

తమకు సంబంధం లేదన్న కేంద్రం, సీబీఐ.. ఇంకెవరికి ఉంటుందని సుప్రీం ప్రశ్న

ఎంపీ రఘురామ కృష్ణరాజు పిటిషన్‌పై విచారణ

బెయిల్ రద్దు, విచారణ ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని వినతి

పిటిషన్ కొట్టేయాలన్న జగన్ న్యాయవాది.. సొలిసిటర్ జనరల్‌దీ అదే మాట

తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం.. విచారణ ఏప్రిల్‌కు వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ముఖ్యమంత్రి పదవిలో ఉండి విచారణను తప్పించుకుంటూ సుదీర్ఘకాలం బెయిల్‌పై కొనసాగడంపై కూడా దృష్టి సారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని, ఆయనతోపాటు ఇతరులపై నమోదైన కేసుల విచారణను తెలుగు రాష్ట్రాల నుంచి బదిలీ చేయాలని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. జగన్ బెయిల్ రద్దు, విచారణను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయడంపై సీబీఐకి సుప్రీం గతంలోనే నోటీసులు జారీ చేసింది. జగన్ బెయిల్ రద్దు పిటిషన్ పై రఘురామరాజు పిటిషన్‌ను కొట్టివేయాలని

మిగతా 12వ పేజీలో...

జగన్.. ఇంటికే

పులివెందుల కూడా ఈసారి టీడీపీదే: చంద్రబాబు



కడప జిల్లా కమలాపురం సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు

జగన్.. ఓ రాజకీయ వ్యాపారి

ఆయన పాలనలో దొంగ వ్యాపారాలకు రెడ్ కార్పెట్

శిశుపాలుడిని ఆనాడు వంద తప్పుల వరకే భరించారు

ఈ తుగ్లక్ వెయ్యి తప్పులు చేసినా ఇంకా భరిస్తారా?

స్వర్ణయుగం కావాలో, రాతియుగం కావాలో తేల్చుకోవాలి

ప్రజలకు రుణపడి ఉన్నా.. వారి కోసం ఏ త్యాగాలకైనా సిద్ధం

టీడీపీ, జనసేన కలిసింది అధికారం కోసం కాదు.. రాష్ట్రం కోసం

కుటుంబ వికాసానికి ఆర్థిక అసమానతలు తగ్గించే ఉద్యమం

పేదరికం నుంచి బయటకు తెచ్చే వరకూ పేదలతోనే: టీడీపీ అధినేత

వెంకటగిరి, కమలాపురంలలో 'రా.. కదలిరా' బహిరంగ సభలు

వెంకటగిరి/కడప, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన పార్టీలు కలిసింది అధికారం కోసం కాదని, రాష్ట్రం కోసమేనని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలోనూ, వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలోనూ 'రా కదలిరా..' బహిరంగ సభల్లో ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తాను చూడని అధికారం లేదని, 14ఏళ్ల సుదీర్ఘకాలం తనను ముఖ్యమంత్రిగా కొనసాగించిన ప్రజలకు రుణపడి ఉన్నానని చెప్పారు. జగన్ సాగిస్తున్న విధ్వంసక తుగ్లక్ పాలన నుంచి కాపాడేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని చంద్రబాబు ప్రకటించారు. జగన్ ఫ్యాక్షనిస్టు, నేరస్థుడు, మానసిక రోగి అని తెలిసినా 'ఒక్క చాన్స్' అనేసరికి ప్రజలు కరిగిపోయి ఓట్లేసి గెలిపించారని, తీరా ఇప్పుడు అందరం ఆహుతవుతున్నామని అన్నారు. 'కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టి' అని సుమతీ శతకంలో పేర్కొన్నట్టు జగన్ సీఎంగా కూర్చున్న సింహాసనాన్నే పాడు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ వ్యాపారి

మిగతా 11వ పేజీలో...



పవన్‌ను కలిసిన వైసీపీ ఎంపీ బాలశౌరి



● గిరీషా, ఐఏఎస్

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్. తిరుపతి అసెంబ్లీ పరిధికి ఆయనే రిటర్నింగ్ అధికారి. ఆయన లాగిన్ ఐడీ ద్వారానే ఓటర్ ఐడీలను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు.



● హరినారాయణ్, ఐఏఎస్

అప్పట్లో చిత్తూరు జిల్లా కలెక్టర్. తన జిల్లా పరిధిలోని తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో జరిగిన అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపకుండా నిర్లక్ష్యం వహించారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు.



● వెంకటఅప్పల నాయుడు, ఐపీఎస్

అప్పట్లో తిరుపతి అర్బన్ ఎస్పీగా ఉన్నారు. ఉప ఎన్నికలో అక్రమాలపై విపక్ష నేతలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినా... ఎలాంటి చర్యలూ తీసుకోకుండా కేసులు మూసేశారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ నుంచి ఐఏఎస్‌ల దాకా..

ఇరుక్కుపోయారు!

అరాచకాలను చూస్తూ కళ్లు మూసుకున్న ఫలితం

దొంగ ఓటరు ఐడీల కేసులో ఈసీ పకడ్బందీ చర్యలు

రిటర్నింగ్ అధికారి గిరీషా సస్పెన్షన్, కేసు నమోదు

విపక్షాల ఫిర్యాదును 'క్లోజ్' చేసిన ఇద్దరు సీఐలపై ఎఫ్ఐఆర్

నాటి కలెక్టర్, ఎస్పీలపైనా చర్యలకు రంగం సిద్ధం

తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్ల తొలగింపు

దర్యాప్తు నెల్లూరు జిల్లాకు బదిలీ

ఇంకెందరు బలవుతారో తెలియని పరిస్థితి

సాయం చేయలేమని చేతులెత్తేసిన ఉన్నతాధికారులు



(అమరావతి/తిరుపతి - ఆంధ్రజ్యోతి)

రిగ్గింగ్ గురించి విన్నాం! ఒకే వ్యక్తి మళ్లీ మళ్లీ క్యూలోకి వెళ్లి ఓటు వేసే 'సైక్లింగ్' గురించీ విన్నాం! కానీ... తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగింది కనీవినీ ఎరుగని అక్రమం! ఏకంగా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి.. వేలకొద్దీ ఓటరు ఐడీ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, వాటిపై ఫొటోలు మార్చేసి, ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించి మరీ దొంగ ఓట్లు వేయించారు! ఆ ఎన్నికలో వైసీపీ అభ్యర్థి గెలిచారు. 'నకిలీ ఓటరు ఐడీ' సూత్రధారులు సేఫ్‌గా ఉన్నారు. కానీ.. అధికారులు

అది తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక! గెలుపు కోసం అధికార పార్టీ ఒక అరాచకానికి తెర లేపింది! అధికారులు 'కళ్లు' మూసుకున్నారు! ఖాకీలు చేతులు కట్టుకున్నారు! ఓటుకు తూట్లు పడుతున్నా మొత్తం యంత్రాంగం మొద్దు నిద్దురపోయింది. దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తోంది! డేటా ఎంట్రీ ఆపరేటర్ల నుంచి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల దాకా అనేక మంది ఈ కేసులో ఇరుక్కుపోయారు. ఇప్పటికే ఒక ఐఏఎస్ అధికారి సస్పెండ్ అయ్యారు. తాజాగా ఇద్దరు సీఐలపై కేసు నమోదైంది. మరింత మందిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది.

కొత్తగా ఓటర్ల నమోదు, మార్పు చేర్పుల కోసం మాత్రమే... ఈఆర్వో లాగిన్‌తో ఐడీలు డౌన్‌లోడ్ చేయాలి. కానీ... తిరుపతి ఉప ఎన్నికల సమయంలో ఎలాంటి దరఖాస్తులు అందకున్నా ఏకంగా 34వేల ఓటరు ఐడీ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు. వాటిపై ఫొటోలు మార్చేసి... దొంగ కార్డులను సృష్టించారు.

నకిలీ ఓటరు ఐడీల స్కామ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ నుంచి ఐఏఎస్‌ల వరకు... బాధ్యులందరిపైనా చర్యలు తీసుకునేందుకు ఈసీ సిద్ధమవుతోంది. నిఘా వర్గాల నుంచి కూడా సమాచారం సేకరిస్తోంది. ఇందులో పాత్ర ఉన్న ఏ ఒక్క అధికారినీ వదిలే అవకాశం కనిపించడం లేదు. ఈ నెల 9, 10వ తేదీల్లో విజయవాడలో జరిగిన సమావేశంలోనే దీనిపై ఈసీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

మిగతా 12వ పేజీలో...

ఎస్సీ వర్గీకరణపై
కమిటీ



రాజీవ్ గౌబా

ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం

కేంద్ర కేబినెట్ కార్యదర్శి సారథ్యం


హోం, న్యాయ, గిరిజన, సామాజిక న్యాయ శాఖల కార్యదర్శులు సభ్యులు

23న తొలిసారిగా భేటీ కానున్న కమిటీ 11

మాదిగ తదితర వర్గాలకు న్యాయం జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం

వర్గీకరణకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల నుంచి కేంద్రానికి ఇప్పటికే విజ్ఞప్తులు

కమిటీ వేస్తామని గత ఏడాది ప్రధాని మోదీ హామీ





బటన్ నొక్కి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం జగన్. (ఇన్‌సెట్) పార్లమెంటు, అంబేడ్కర్ ఆకారంలో డ్రోన్ల విన్యాసం

స్టాట్యూ ఆఫ్ లిబర్టీలా ఏపీలో అంబేడ్కర్ విగ్రహం: జగన్

బెజవాడలో 125 అడుగుల విగ్రహావిష్కరణ

అంబేడ్కర్ సభలో సొంత భజన

పార్టీ ప్రచారంలా విగ్రహావిష్కరణ కార్యక్రమం

జెండాలు, బ్యానర్లతో రాజకీయ రంగు 12

ప్రభుత్వ సొమ్ముతో జగన్ గొప్పలు

భారీగా బెజవాడకు జనం తరలింపు

ఆర్టీసీ బస్సులు పంపడంతో ప్రజలకు పాట్లు

విజయవాడలో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్



విశాఖలో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూమిలో లేఅవుట్ (ఫైల్)

'రామానాయుడు' భూములను ఇతర అవసరాలకు వాడొద్దు

భూ వినియోగ మార్పిడిపై సుప్రీం స్టే

కోర్టులో జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

ఏపీ ప్రభుత్వం సహా ఎనిమిది మందికి నోటీసులు

2003లో స్టూడియోకు 34 ఎకరాల కేటాయింపు

జగన్ సర్కారు వచ్చాక వైసీపీ పెద్దల కన్ను

ఖాళీ భూముల వినియోగ మార్పిడికి ప్లాన్

సుప్రీంలో వెలగపూడి స్పెషల్ లీవ్ పిటిషన్

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. స్టూడియోకు సంబంధించిన భూమి వినియోగ మార్పిడిపై స్టే విధించింది. స్టూడియో ఏర్పాటుకు 2003లో ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న అవసరాలకు మినహా ఇతరత్రా కార్యకలాపాలకు భూమిని వినియోగించరాదని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు మునిసిపల్, రెవెన్యూ, పర్యాటక శాఖల ముఖ్య కార్యదర్శులు, విశాఖ కలెక్టర్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీల కమిషనర్లతో సహా మొత్తం ఎనిమిది మందికి

మిగతా 12వ పేజీలో...

రేపు పగ్గాలు చేపట్టనున్న షర్మిల

నేడు ఇడుపులపాయలో తండ్రికి నివాళి

విజయవాడలో బాధ్యతల స్వీకరణ

ఆమె సమక్షంలో పార్టీలో చేరనున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే 11

దేశీయ హెపటైటిస్-ఏ
టీకా వచ్చేసింది

'హవిష్యూర్'ను విడుదల చేసిన ఐఐఎల్ 11

విస్తృతమైన క్లినికల్ ట్రయల్స్ తర్వాత అందుబాటులోకి

కాలేయ ఇన్‌ఫెక్షన్లకు చెక్

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.. మాజీ రాష్ట్రపతి ఆధ్వర్యంలో అధ్యయనమేంటి?

ఆ కమిటీని రద్దు చేయాలి 2

స్వేచ్ఛాయుత నిర్వహణ ముఖ్యం: కాంగ్రెస్

కోవింద్ కమిటీకి మల్లికార్జున ఖర్గే లేఖ

అడవి బిడ్డలు అడవికే
పరిమితమా?

బీజేపీ వారిని చదువుకు దూరం చేస్తోంది

భారత్ జోడో న్యాయ్‌యాత్రలో రాహుల్




వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని యాంకి గ్రామానికి చెందిన కళాకారుడు సున్నపు అశోక్ ఐస్‌క్రీమ్ పుల్లలతో అయోధ్య రామ మందిర నమూనాను తయారు చేసి అబ్బురపరిచాడు. 2వేల పుల్లలను ఉపయోగించి రోజుకు గంట చొప్పున 20 రోజులు శ్రమించి ఆలయ నమూనాను తయారు చేసినట్లు అతడు చెప్పాడు.

- దౌల్తాబాద్




నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన స్వర్ణకారుడు కపిలవాయి గోపి చారి కేవలం 2.73 గ్రాముల బంగారంతో అయోధ్య రామ మందిర నమూనాను తయారు చేశాడు. 1.5 సెంటీమీటర్ల ఎత్తు, 1.75 సెంటీమీటర్ల వెడల్పు, 2.75 సెంటీమీటర్ల పొడవుతో 108 స్తంభాలు, 20 గోపురాలు వచ్చే విధంగా ఆలయ నమూనాను రూపుదిద్ది అందరినీ అబ్బురపరిచాడు.

- అమ్రాబాద్



ఆ రథం తయారీ మధురానుభూతి

ముంబై, జనవరి 19: బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీ 1990లో చేపట్టిన రథయాత్రకు రథాన్ని తయారు చేయడం.. తనకు ఇప్పటికీ నూతనోత్సాహాన్ని ఇస్తుందని ముంబైకి చెందిన ప్రకాశ్ నలవాడే అన్నారు. అడ్వాణీ రథయాత్రకు రథాన్ని సిద్ధం చేసింది ఈయనే. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రథయాత్రకు కొన్ని రోజుల ముందు బీజేపీ నేత ప్రమోద్ మహాజన్ నన్ను సంప్రదించారు. ఆర్ట్ డైరెక్టర్ శాంతి దేవ్ ఈ రథాన్ని డిజైన్ చేశారు. ఆ ప్రకారం నేను దాన్ని రూపొందించాను. దీన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నాను" అని ప్రకాశ్ చెప్పారు.



ఏకశిలపై 24 శిఖరాలతో....
అయోధ్య సూక్ష్మమందిరం

మండపేట, జనవరి 19: అయోధ్యలో ఈనెల 22న రామమందిరంలో బాలరాముడి ప్రతిష్ఠ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు ఏకశిలపై 24 శిఖరాలతో అయోధ్య రామాలయం నమూనాను తయారు చేశారు. నిలువు 60 మి.మీ., వెడల్పు 50 మి.మీ. ఉన్న 98.304గ్రాముల శిల.. మందిరం తయారుచేసిన తర్వాత 79.544 గ్రాములు ఉంది. మందిరం నిలువు 18 మి.మీ., వెడల్పు 18మి.మీ., పొడవు 32 మి.మీతో అగ్గి పుల్ల కంటే చిన్నదిగా ఉంది. మందిరం ఎదుట సూక్ష్మరామపాదాలు ఏర్పాటుచేశారు. అలంకరణ కోసం 3మిల్లీ గ్రాముల బంగారం ఉపయోగించారు. 9 రోజుల్లో 70 గంటలుశ్రమించి సూక్ష్మచిత్రాన్ని చెక్కినట్లు తెలిపారు.

అల్లదిగో.. బాల రాముడు!

(మొదటి పేజీ తరువాయి)



చేతిలో బంగారు ధనస్సుతో ఉన్న బాల రాముడి విగ్రహం. ఈ ఫొటో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.



శుక్రవారం సాయంత్రం దీప కాంతులతో వెలిగిపోతున్న అయోధ్య రామాలయం

విల్లు, బాణం పట్టుకొని ఉన్న ఐదేళ్ల బాలుడి రూపంలో దర్శనమిస్తున్నారు. ఆలయంలో ప్రతిష్ఠించాల్సిన విగ్రహాన్ని గురువారం వేకువజామున గర్భగుడిలోకి ప్రవేశపెట్టారు. మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన 51 అంగుళాల విగ్రహాన్ని పవిత్ర జలాలతో అభిషేకించి ఆసనంపైకి చేర్చారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్న నేపథ్యంలో ట్రస్టు అధికారులు ముందుగా తెల్లటి వస్త్రం కప్పి ఉన్న విగ్రహాన్ని గర్భగుడిలో ఉంచుతున్న ఫొటోలను గురువారం విడుదల చేశారు. విగ్రహం కళ్లు పసుపు వస్త్రంతో కప్పి ఉన్న మరో ఫొటో శుక్రవారం ఉదయం బయటకు వచ్చింది. అయితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాముడి చేతిలో బంగారు విల్లు, బాణం ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా, ప్రాణప్రతిష్ఠలో వినియోగించడానికి మహారాష్ట్రలోని అమరావతి నుంచి అయోధ్యకు 500 కిలోల కుంకుమను కానుకగా పంపారు. కర్ణాటకలోని హంపి ప్రాంతంలో ఉన్న హనుమంతుడి జన్మస్థలం కిష్కింధ నుంచి ప్రత్యేక రథం అయోధ్యకు చేరుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను సందర్శిస్తూ, అయోధ్యకు చేరేముందు ఈ రథాన్ని నేపాల్‌లోని సీతా మాత జన్మస్థలమైన జనక్‌పూర్‌కు తీసుకెళ్లారు. భక్తుల సందర్శనార్థం ఈ రథాన్ని సరయూ నది ఒడ్డున నిలిపి ఉంచారు.

దారులన్నీ అయోధ్యకే

అందరి గమ్యం ఒకటే.. దారులన్నీ అయోధ్యకే.. ఎముకలు కొరికే చలి కూడా వారిని అడ్డుకోలేకపోతోంది. 22న జరిగే బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను కనులారా వీక్షించి తరలించడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వెల్లువలా తరలి వస్తున్నారు. వందలాది కిలోమీటర్ల దూరాన్ని కొందరు కాలి నడకన అధిగమిస్తుండగా, మరికొందరు సైకిళ్లపైనా, ఇంకొందరు స్కేటింగ్ చేసుకుంటూ అయోధ్య దిశగా ముందుకు సాగుతున్నారు. రాముడిపై ఉన్న అచంచల విశ్వాసంతో ఈ చరిత్రాత్మక ఘట్టంలో తాము కూడా భాగం కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. బిహార్‌లోని మాధేపురా జిల్లాకు చెందిన నితీశ్ కుమార్(21) సైకిల్‌పై 615 కిలోమీటర్లు ప్రయాణించి అయోధ్యకు చేరుకున్నారు. గిన్నిస్ బుక్‌లో లాంగెస్ట్ డ్యాన్స్ మారథాన్ (124 గంటలు) రికార్డును సొంతం చేసుకున్న సోనీ చౌరాసియా ఆహ్వానితుల్లో ఒకరు. ఆమె వారాణసీ నుంచి స్కేటింగ్ చేస్తూ అయోధ్యకు వెళ్తున్నారు. హిందూ ముస్లింల ఐక్యత సందేశాన్ని వ్యాప్తి చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన షబ్నమ్ షేక్ అయోధ్యకు కాలినడకన వస్తున్నారు. మహాత్మా గాంధీ వేషధారణలో కర్ణాటకలోని కరాకిట్టి ప్రాంతానికి చెందిన ముత్తా తిర్లాపుర 2000 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి అయోధ్యకు చేరుకున్నారు.

రామయ్యకు కానుకల వెల్లువ

అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన ముహూర్తం ముంచుకొస్తున్న వేళ రామయ్యకు కానుకలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 22న జరగబోయే వేడుకకు కనౌజ్ నుంచి వివిధ రకాల అత్తరులు, అమరావతి నుంచి 500 కిలోల కుంకుమ, ఢిల్లీ నుంచి రామాలయాల్లో సేకరించిన ధాన్యం అయోధ్యకు చేరుకున్నాయి. ఇవేకాకుండా 108 అడుగుల అగరుబత్తీ, 2,100 కిలోల గంట, 1,100 కిలోల భారీ దీపం, బంగారు పాదుకలు, పది అడుగుల తాళం, ఏకకాలంలో 8దేశాల సమయాన్ని సూచించే గడియారం ట్రస్టుకు అందాయి. సీతమ్మ జన్మస్థలం నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి వెండి పాదరక్షలు, ఆభరణాలు, వస్త్రాలతో పాటు 3వేలకు పైగా బహుమతులు కాన్వాయ్‌గా వచ్చాయి. శ్రీలంక ప్రతినిధి బృందం అశోకవాటిక నుంచి ప్రత్యేక కానుక తీసుకొచ్చింది. ఉజ్జయిని మహాకాలేశ్వర్ ఆలయం నుంచి 5లక్షల లడ్డూలతో కూడిన ట్రక్ శుక్రవారం అయోధ్యకు బయల్దేరింది. మధురలోని శ్రీకృష్ణ జన్మస్థాన్ నుంచి 200 కిలోల లడ్డూలు, తిరుమల శ్రీవారి ఆలయం నుంచి లక్ష లడ్డూలు పంపారు. భక్తుల కోసం 7వేల కిలోల రామ్ హల్వాను తయారు చేయనున్నట్లు నాగపూర్‌కు చెందిన చెఫ్ విష్ణు మనోహర్ ప్రకటించారు. రాముడికి బంగారు పూతపూసిన పాదరక్షలను సమర్పించడానికి హైదరాబాద్‌కు చెందిన 64ఏళ్ల చల్లా శ్రీనివాస శాస్త్రి 8వేల కిలోమీటర్లు నడిచి అయోధ్యకు చేరుకున్నారు.




అంతా రామమయం!

రామాలయ ప్రతిష్ఠకు ముందు.. అయోధ్య మొత్తం రామమయమైంది. మొబైల్ ఫోన్ల కాలర్ ట్యూన్స్, రింగ్ టోన్లు, సోషల్ మీడియాలో శ్రీరాముడి పేరు మార్మోగిపోతోంది. అయోధ్య వీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. మరోవైపు, రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు అయోధ్య జిల్లా, నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బెడ్లను రిజర్వ్ చేసి ఉంచారు. అత్యవసర సమయంలో ఎలా స్పందించాలో ఎయిమ్స్ నిపుణులు స్థానిక ఆరోగ్య సంస్థల సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ నెల 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం ఈ బెడ్లను రిజర్వ్ చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా సుమారు 7 వేల మంది అతిథులను ఆహ్వానించారు. కాగా, అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఉత్తరప్రదేశ్ జైళ్లలోని ఖైదీలకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించనున్నారు.

భద్రతా వలయంలో అయోధ్య..

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠకు సమయం దగ్గర పడడం, ఆలయ అధికారులకు ఇటీవలే ఓ బెదిరింపు కాల్ రావడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రత ఉల్లంఘన జరిగినట్టు కేంద్ర హోం మంత్రిత్వశాఖ నుంచి సమాచారం అందడంతో.. భద్రతను కట్టుదిట్టం చేసి అయోధ్య మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయోధ్య నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 12 వేల మంది పోలీస్ సిబ్బందిని మోహరించారు. బెదిరింపుల నేపథ్యంలో భద్రతను పర్యవేక్షించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వినియోగిస్తున్నారు. 'అయోధ్యలో మొత్తం 10వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఫేస్ రికగ్నిషన్ కోసం ఏఐని ఉపయోగిస్తున్నాం' అని ప్రశాంత్ కుమార్ చెప్పారు.

లోకం తీరు




'జై శ్రీరామ్'కు కౌంటర్‌గా

'జై జగన్నాథ్'

ఒడిశాలో బీజేపీకి దీటుగా బీజేడీ ప్లాన్

పూరీ, జనవరి 19: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ 'జై శ్రీరామ్' నినాదానికి కౌంటర్ ఇచ్చేందుకు ఒడిశాలోని అధికార బీజేడీ 'జై జగన్నాథ్' నినాదాన్ని ఎత్తుకుంది. దీంతో బీజేడీ, బీజేపీ మధ్య రాజకీయ దుమారం రేగింది. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందే ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ పూరీలోని జగన్నాథ ఆలయంలో నూతనంగా నిర్మించిన 'జగన్నాథ్ కారిడార్'ను ప్రారంభించారు. వచ్చే నెల రోజులపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 10 వేల మంది వచ్చి దీన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది లోక్‌సభతో పాటు ఒడిశా అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే ప్రతి సవాల్‌నూ ఎలా ఎదుర్కోవాలో సీఎం నవీన్ పట్నాయక్‌కు తెలుసని బీజేడీ సీనియర్ నేత ఒకరన్నారు. బీజేపీ హిందుత్వ ఎజెండాను ఎదుర్కొనేందుకు బీజేడీ ప్రణాళిక ఏమిటని ఆయనను ప్రశ్నించగా 'జై జగన్నాథ్' అని బదులిచ్చారు.

అయోధ్య ఆలయ ప్రారంభానికి చంద్రబాబు



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హాజరవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఆలయ ట్రస్ట్ ఆయనకు ఆహ్వానం పంపింది. దీనితో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన నిర్ణయించుకొన్నారు. ఖరారైన కార్యక్రమం ప్రకారం ఈ నెల 21న సాయంత్రం ఆయన హైదరాబాద్ నుంచి బయలుదేరి అయోధ్య వెళ్తారు. ఆ రాత్రి అక్కడ బస చేసి 22న ఉదయం ఆలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు అక్కడ నుంచి బయలుదేరి హైదరాబాద్ తిరిగి వస్తారు. దీని నిమిత్తం ఈ నెల 21 నుంచి 23 వరకూ ఆయన తన జిల్లాల పర్యటనకు విరామం ఇచ్చారు. మళ్లీ 24 నుంచి ఆయన పర్యటనలు ప్రారంభిస్తారు.

'అయోధ్య' కోసం అయుథ్యా

▸ రామమందిర ప్రతిష్ఠ మహోత్సవం

తిలకించేందుకు థాయ్‌లాండ్‌లో ఏర్పాట్లు



అయోధ్య, జనవరి 19: అయోధ్య అయుథ్యా. ఈ రెండు పట్టణాలకు పేరులోనే కాదు, మతపరమైన విశ్వాసాల్లోనూ సారూప్యత ఉంది. అయోధ్య.. మన దేశంలోని శ్రీరాముడి జన్మభూమి కాగా, అయుథ్యా.. భౌగోళికంగా ఇక్కడికి 3,500 కిలో మీటర్ల దూరంలో ఉన్న థాయ్‌లాండ్‌లోని పురాతనమైన పట్టణం. ఒక్కమాటలో చెప్పాలంటే థాయ్‌లాండ్‌కు ఈ పట్టణం అయోధ్య లాంటిది. మన దేశంలో మాదిరే అయుథ్యాలోనూ ప్రజలు శ్రీరాముడిని ఆరాధిస్తారు. మరో రెండు రోజుల్లో అయోధ్యలో జరిగే రామమందిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించేందుకు అయుథ్యాలోని రామభక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే అయుథ్యా నుంచి తీసుకొచ్చిన మట్టిని, థాయ్‌లాండ్‌లోని మూడు నదుల నుంచి తీసుకొచ్చిన జలాలను అయోధ్య రామాలయ ట్రస్ట్ స్వీకరించింది. 22వ తేదీన రామమందిర ప్రతిష్ఠ ప్రత్యక్ష కార్యక్రమాలను టీవీల్లో తిలకించేందుకు అయుథ్యాలో ఏర్పాట్లు చేస్తున్నారు. అయుథ్యాలోని హిందూ ఆలయాలతో పాటు థాయ్‌లాండ్‌లోని ఇతర నగరాల్లో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసినట్టు బ్యాంకాక్‌కు చెందిన వీహెచ్‌పీ సభ్యులు ఒకరు చెప్పారు. ఆ రోజు ఆలయాల్లో దీపాలు వెలిగించి రామభజనలు చేస్తారని, ప్రసాదాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

శ్రీరాముడి జన్మస్థలం అయోధ్య పేరు మీదుగానే థాయ్‌లాండ్‌లోని ఈ పట్టణానికి అయుథ్యా అని పేరు పెట్టినట్టు ప్రపంచ హిందూ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి విజ్ఞానంద్ చెప్పారు. 'ఆ ప్రాంత సంస్కృతిపై రామాయణ ప్రభావం ప్రతిబింబించేలా అయుథ్యా మొదటి రాజు రామాతిబోధి పట్టణానికి ఈ పేరు పెట్టారు. చక్రీ వంశానికి చెందినవారితో సహా తదుపరి రాజులు శ్రీరాముడి పేరును స్వీకరించారు. నాటి నుంచి అక్కడ శ్రీరాముడిని ఆరాధిస్తున్నారు' అని స్వామి విజ్ఞానంద్ తెలిపారు. 1350లో అయుథ్యా పట్టణాన్ని నిర్మించారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు ఉత్తరాదిన 70 కి.మీ. దూరంలో, చావో ప్రాయ నది ఒడ్డున ఉంటుంది. సుసంపన్న, చారిత్రక పట్టణంగా పేరు పొందిన అయుథ్యాకు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చోటు దక్కింది.

తరలిరానున్న భిన్న రంగాల దిగ్గజాలు

అయోధ్య, జనవరి 19: రామాలయ ప్రతిష్ఠకు దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలకు, సినీ ప్రముఖులకు, రాజకీయ నేతలకు, ఉన్నతాధికారులకు, దౌత్యాధికారులకు... మొత్తం సుమారుగా 8వేల మందికి ఆహ్వానాలు అందాయి. వారిలో అత్యంత ప్రముఖులు సుమారు 100మంది దాకా ఉన్నారు. దేవాలయ ప్రతిష్ఠకు ప్రముఖ నటుడు అమితాబచ్చన్ ప్రత్యేక విమానంలో తరలిరానున్నారు. ఆహ్వానం అందుకున్న సినీ ప్రముఖుల్లో అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, చిరంజీవి, అల్లు అర్జున్, మోహన్ లాల్, అనుపమ్ ఖేర్ తదితరులు ఉన్నారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్‌పర్సన్ కుమార మంగళం బిర్లా, పిరమల్ గ్రూప్ చైర్‌పర్సన్ అజయ్ పిరమల్, ఆనంద్ మహీంద్ర, డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కే సతీశ్ రెడ్డి, ఎల్ అండ్ టీ సీఈఓ ఎస్ ఎన్ సుబ్రహ్మణియన్, ఆయన భార్య, దివీస్ లేబొరెటరీస్ మురళి దివి, ఇన్ఫోసిస్ స్థాపకులు ఎన్ ఆర్ నారాయణ మూర్తి తదితరులు ఉన్నారు. రాజకీయ ప్రముఖుల్లో మాజీ లోక్ సభ స్పీకర్ మీరా కుమార్, ప్లానింగ్ కమిషన్ మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లూవాలియా తదితరులున్నారు. ఇండియా జీ20 షెర్పా అమితాబ్ కాంత్, మాజీ అటార్నీ జనరల్స్ కే కే వేణుగోపాల్, ముకుల్ రోహత్గీ, భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ తదితర పేర్లు జాబితాలో ఉన్నాయి.

'అయోధ్యపై తీర్పు' జడ్జిలకు ఆహ్వానం

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో సహా మరో ఐదుగురు జడ్జిలకు రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేసేలా తీర్పునిచ్చిన రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదురుగురు జడ్జిలూ ఆహ్వానం అందుకున్న వారిలో ఉన్నారు. తీర్పును ఇచ్చిన వారిలో జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ బోబ్డె, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఉన్నారు.



భారత్ అభివృద్ధికి

సహకరించండి

గ్లోబల్ ఇన్వెస్టర్లకు ప్రధాని పిలుపు

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభం

బెంగళూరు, చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా మెరుగైన వృద్ధి సాధించాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. దేశంలో అన్ని రంగాలకూ అనువైన వాతావరణం ఉందని స్పష్టంచేశారు. బెంగళూరులో శుక్రవారం ఆయన బోయింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇండియా ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అమెరికా వెలుపల తొలిసారి బోయింగ్ అతిపెద్ద ఏరోస్పేస్ ఇంజనీరింగ్ సదుపాయాన్ని బెంగళూరులో ఏర్పాటు చేసింది. మహిళా సాధికారతే ధ్యేయంగా ఈ కార్యక్రమానికి 'బోయింగ్ సుకన్య' అని పేరు పెట్టారు. కాగా, యువశక్తి ద్వారానే నవ్యభారతం సాధ్యమవుతుందని, ఆ దిశగా యువకుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేలా దేశమంతటా 'ఖేలో ఇండియా' పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను మోదీ లాంఛనంగా ప్రారంభించారు.

బిల్కిస్ కేసు ముద్దాయిలకు

సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

▸ 21లోగా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 19: గుజరాత్ అల్లర్లలో సంచలనం కలిగించిన బిల్కిస్ బానో కేసులోని ముద్దాయిలకు శుక్రవారం సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జైలు అధికారుల ముందు లొంగిపోయేందుకు గడువును పెంచాలని ఐదుగురు ముద్దాయిలు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇంతకుముందటి ఆదేశాల మేరకు వారు ఈ నెల 21లోగా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. బిల్కిస్‌బానోపై సామూహిక అత్యాచారం చేయడంతోపాటు, ఆమె కుటుంబంలోని ఏడుగుర్ని హత్య చేసినందుకు 11మంది ముద్దాయిలకు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కానీ 14 ఏళ్ల శిక్ష తర్వాత గుజరాత్ ప్రభుత్వం వారిని విడుదల చేసింది. శిక్ష తగ్గింపును సవాలు చేస్తూ బాధితురాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ నెల 8న కొట్టివేసింది. ఈనెల 21లోగా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

లాలూ, తేజస్వీలకు ఈడీ మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి19: తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ప్రతిగా రైల్వే ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలపై విచారణ నిమిత్తం హాజరు కావాలంటూ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మళ్లీ సమన్లు పంపించింది. పట్నాలోని బ్యాంకు రోడ్‌లో ఉన్న తమ కార్యాలయానికి ఈ నెల29న హాజరు కావాలని లాలూను, 30న రావాలని తేజస్వీ యాదవ్‌ను ఆదేశించింది. గతంలోనూ వారికి సమన్లు ఇచ్చినా విచారణకు వెళ్లలేదు.

ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసిన మహువా

న్యూఢిల్లీ, జనవరి 19: లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రా తనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాను శుక్రవారం ఖాళీ చేశారు. బంగ్లాను ఖాళీ చేయాలని అధికారులు ఇచ్చిన నోటీసును నిలుపుదల చేయాలంటూ ఆమె చేసిన వినతిని గురువారం ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దాంతో మరుసటి రోజునే ఆమె ఖాళీ చేశారు. బంగ్లాను ఖాళీ చేయించడానికి డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ అధికారులు ఉదయమే మనుషుల్ని పంపించింది. ఆ భవనం చుట్టూ బారికేడ్లు కూడా ఏర్పాటు చేసింది. కానీ అంతకుముందే ఆమె ఖాళీ చేశారు. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆమె ఎంపీ పదవిని కోల్పోవడంతో బంగ్లాను ఖాళీ చేయాల్సి వచ్చింది.

అడవి బిడ్డలు అడవికే పరిమితమా?

వారి భూముల్ని బీజేపీ లాక్కుంటోంది: రాహుల్



జోడో న్యాయ్ యాత్రలో జానపద కళాకారులతో రాహుల్

మజులి, జనవరి 19: గిరిజనులకు విద్య, ఇతర అవకాశాలను దూరం చేసి అడవులకే పరిమితం చేయాలని బీజేపీ చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అసోం రాష్ట్రంలో భారత్ జోడో న్యాయ్‌యాత్ర రెండో రోజు గిరిజన ప్రాంతం మజులిలో శుక్రవారం సాగింది. ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... వనరుల మీద ఆదివాసీల హక్కులను కాంగ్రెస్ గుర్తిస్తుందన్నారు. "మేం మిమ్మల్ని ఆదివాసీలని పిలుస్తున్నాం... అంటే తొలి నివాసులని అర్థం... బీజేపీ మిమ్మల్ని వనవాసి అంటోంది... అంటే అడవుల్లో నివసించేవారని అర్థం.." అని వివరించారు. అసోం రాష్ట్ర ప్రభుత్వానికి మీ పిల్లలు పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకు వెళ్లి చదువుకోవడం, ఇంగ్లీషు నేర్చుకోవడం, వ్యాపారాలు చేయడం ఇష్టం లేదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా గిరిజనుల భూములను బీజేపీ ప్రభుత్వాలు లాక్కుంటున్నాయని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రాన్ని బీజేపీ మంటల్లో పెట్టిందన్నారు. నెలల తరబడి ఆ రాష్ట్రంలో ప్రజల మధ్య యుద్ధం సాగుతోందన్నారు. ఒకరినొకరు చంపుకొంటున్నారు... అయినా ఈ దేశ ప్రధాన మంత్రి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదన్నారు. నాగాలాండ్‌లో తొమ్మిదేళ్ల క్రితం చేసుకున్న ఒప్పందం ప్రధాని నేటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, అసోంలో భారత్ జోడో న్యాయ్‌యాత్రకు ఎక్కడా లేని అంతరాయాలు కల్పిస్తున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ మండిపడ్డారు. మొదటి యాత్ర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సాగినప్పుడు ఇటువంటి పరిస్థితి ఎదురు కాలేదన్నారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ కాంగ్రెస్‌కు అంతగా ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

▸ కోవింద్ కమిటీని రద్దు చేయాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి జమిలి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదనే అప్రజాస్వామికమని కాంగ్రెస్ ప్రకటించింది. ఒక దేశం- ఒకే ఎన్నికల వ్యవస్థ పేరుతో బీజేపీ జమిలి ఎన్నికలను ప్రవేశపెట్టాలనుకోవడం సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగ మౌలిక నిర్మాణానికీ వ్యతిరేకమని స్పష్టం చేసింది. జమిలి ఎన్నికలను అమలు చేసే విషయంపై అధ్యయనం చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని డిమాండు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే.. కోవింద్ కమిటీ కార్యదర్శి నితేన్ చంద్రకు లేఖ రాశారు. రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి వ్యక్తిత్వాన్నీ, ఆయన కార్యాలయాన్ని దుర్వినియోగపరుస్తోందని ఖర్గే ఆరోపించారు. అందుకు అనుమతించరాదని కోవింద్‌ను కోరారు. ప్రజల తీర్పును గౌరవించేందుకు ప్రభుత్వం, పార్లమెంటు, ఎన్నికల కమిషన్ కలిసికట్టుగా పని చేయాల్సి ఉందని తెలిపారు. దానికి బదులుగా జమిలి ఎన్నికల వంటి అప్రజాస్వామిక ఆలోచనలపై మాట్లాడుతూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

12 వేల ఏళ్ల కిందటే

లద్దాక్‌కు వలసలు

అత్యంత ప్రాచీన తెగ బ్రోక్‌పా

▸ సీసీఎంబీ, బీర్బల్ సహానీ ఇన్‌స్టిట్యూట్

సంయుక్త పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్, జనవరి19: కొత్త రాతి యుగం తొలినాళ్లకే అంటే 12వేల ఏళ్ల క్రితమే లద్దాక్‌కు ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి స్థిరపడ్డారని తాజా పరిశోధనలో వెల్లడైంది. ఇక్కడ నివసిస్తున్న కొన్ని తెగల ప్రజల జన్యువులు తూర్పు ఆసియా, దక్షిణాసియా, టిబెట్, బర్మా ప్రాంతాల ప్రజల జన్యువులతో సరిపోలుతున్నాయని తెలిసింది. లద్దాక్ ప్రజల జన్యు మూలాలపై, జన్యు వైవిధ్యంపై సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్త డాక్టర్ కుమారసామి తంగరాజ్, బీర్బల్ సహానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నీరజ్ రాయ్ సారథ్యంలోని పరిశోధకుల బృందం తొలిసారిగా సమగ్ర మైటోకాండ్రియల్ డీఎన్ఏ అధ్యయనం జరిపింది. దీనిపై శుక్రవారం ప్రకటన విడుదలైంది. బ్రోక్‌పా, చాంగ్‌పా, మోన్‌పా తెగలకు చెందిన 108 మంది జన్యువులను ఈ బృందం విశ్లేషించింది. ఫలితాలను పురాతత్వ, చారిత్రక ఆధారాలతో నూ పోల్చారు. తద్వారా బ్రోక్‌పా, చాంగ్‌పా, మోన్‌పా ప్రజల తల్లి తరఫు జన్యువులు తూర్పు ఆసియా, దక్షిణ ఆసియా, టిబెట్ ప్రాంత ప్రజల జన్యువులతో సరిపోలాయని తంగరాజ్ తెలిపారు. బ్రోక్‌పా తెగ ప్రజలు లద్దాక్‌లో అత్యంత ప్రాచీనులని, 12వేల ఏళ్ల కిందటి కొత్త రాతి యుగంకాలంనాటి జన్యు మూలాలు వారిలోఉన్నట్టు నీరజ్‌రాయ్ తెలిపారు. హిమాలయాలు ముఖ్యంగా సిల్కుమార్గం ద్వారా ప్రజల రాకపోకలు జరిగాయన్న సిద్ధాంతాన్ని తమ పరిశోధన రుజువు చేస్తుందని సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి తెలిపారు.



దీక్ష శిబిరంలో కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడితో మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా, దళిత సంఘాల నేతలు

కోడికత్తి శ్రీనుకు బెయిల్ ఇవ్వాలి

- తల్లి, సోదరుడి డిమాండ్... ఫంక్షన్ హాల్లో కొనసాగుతున్న దీక్ష
- పోలీసుల ఆదేశాలతో హాలుకు విద్యుత్ నిలిపివేత
- దీక్షకు బొండా ఉమ, రామకృష్ణ, సుంకర పద్మశ్రీ తదితరుల సంఘీభావం

విజయవాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ ఇవ్వాలని అతడి తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు చేస్తున్న ఆమరణ నిరాహారదీక్ష రెండోరోజు విజయవాడ గాంధీనగర్‌కు మారింది. మొదటి రోజున రహస్య ప్రదేశంలో దీక్షచేసిన వారిద్దరూ రెండో రోజు స్థానిక శ్రీరామా ఫంక్షన్ హాలులో దీక్ష కొనసాగించారు. మొదట హాల్‌లో సమతా సైనిక్ దళం సమావేశం నిర్వహించింది. మధ్యాహ్నం సావిత్రమ్మ, సుబ్బరాజును ఒక కారులో ఇక్కడకు తీసుకొచ్చారు. సభావేదికే వారి దీక్షకు వేదికయింది. వారికి మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జనసేన నేత పోతిన మహేశ్ సంఘీభావం తెలిపారు. జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదన్నారు. ఆమరణదీక్ష సమాచారంతో పోలీసులు భారీ సంఖ్యలో ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. ఆయా సంఘాల ప్రతినిధులతో చర్చించారు. మరోవైపు దళిత సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి, జగన్‌కు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులతో బొండా చర్చించారు. హాలునుంచి బయటకొస్తే అరెస్టు చేస్తామని పోలీసులు ఆయనకు చెప్పారు. కాగా, పోలీసుల ఆదేశాలతో పంక్షన్ హాల్ నిర్వాహకులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. చీకట్లోనే సావిత్రమ్మ, సుబ్బరావు దీక్షను చేశారు.

జైలులో శ్రీనివాస్ దీక్ష కొనసాగింపు

విశాఖపట్నం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిపై కోడికత్తితో దాడి చేసిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న శ్రీనివాస్ విశాఖపట్నం సెంట్రల్ జైలులో తన నిరాహార దీక్ష కొనసాగిస్తున్నాడు. రెండో రోజు శుక్రవారం కూడా శ్రీనివాస్ ఏమీ తీసుకోలేదు. శ్రీనివాస్‌కు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే వైద్యులకు చూపిస్తామని, వారు చెప్పినట్టు చేస్తామని జైలు అధికారులు చెబుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత జగన్‌కు లేదు

- శ్రీనుకు సంఘీభావంగా టీడీపీ దళిత నేతల దీక్ష

అమరావతి, అనంతపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని, ఆయన ఆశయాలనూ కాలరాసి.. విగ్రహాలు ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో పోయిన దళితుల ప్రాణాలు తిరిగొస్తాయా అని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. దళితులకు వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డికి అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే హక్కు... ఆవిష్కరించే నైతిక అర్హత లేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. కోడికత్తి కేసులో ఐదేళ్లుగా నిర్బంధంలో ఉన్న జనిపల్లి శ్రీనివాసరావు చేపట్టిన దీక్షకు సంఘీభావంగా టీడీపీ దళిత నేతలు శుక్రవారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడారు. తనను ముఖ్యమంత్రి చేయడానికి అమాయకంగా బలైన దళిత యువకుడు శ్రీనివాసరావు పట్ల జగన్ కర్కోటకంగా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దళితులను చంపిన వారికి పదవులు కట్టబెట్టే కొత్త సంస్కృతికి జగన్ తెరదీశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'భారత రాజ్యాంగ నిర్మాత ఆశయాలను కాలరాసిన వ్యక్తి సీఎం జగన్.. అలాంటి వ్యక్తి అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించడం దురదృష్టకరం. అంబేడ్కర్ మహాశయా.. మన్నించు' అని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు అనంతపురంలో అన్నారు. కాగా, అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాత్రాన వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దళితులపై జరిగిన దమనకాండను సీఎం జగన్ దాచిపెట్టలేడని టీడీపీ నేత ఫరూక్ నంద్యాల లో అన్నారు. కాగా, టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే వైసీపీ సర్కార్ నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చేసి, అమరావతిలో కొత్తగా విగ్రహం నిర్మిస్తామని తాను చెప్పినట్లు జరుగుతున్న ప్రచారాన్ని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఖండించారు. 'అంబేడ్కర్ ఆత్మకుశాంతి చేకూరాలంటే.. విగ్రహావిష్కరణ వేదికపై కోడికత్తి శ్రీను తల్లిదండ్రులను, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని, డాక్టర్ సుధాకర్ కుటుంబసభ్యులను, నెల్లూరు నుంచి ఉదయగిరి నారాయణ భార్యాబిడ్డలను కూర్చోపెట్టండన్నా.. అంటూ 'ఎక్స్'లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జగన్‌కు సలహా ఇచ్చారు.

అంగన్వాడీల సమ్మెతో జగన్ సర్కార్ ఉక్కిరిబిక్కిరి

- సమ్మె ముగింపునకు ప్రభుత్వ పెద్దల కసరత్తు
- మరోసారి చర్చలకు పిలిచే అవకాశం..!
- ముగిసిన షోకాజ్ నోటీసుల గడువు...
- విధులకు హాజరుపై కలెక్టర్లకు నివేదికలు



విజయనగరం కలెక్టరేట్ వద్ద జాతీయ రహదారి 26పై అంగన్వాడీల మానవహారం

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు అంగన్వాడీలు చేపట్టిన సమ్మెతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇచ్చిన హామీ నెరవేర్చలేక, చర్యలు తీసుకుంటే రాజకీయంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఆందోళన మరోపక్క... జగన్ ప్రభుత్వం కిందా మీదా పడుతోంది. ఎలాగైనా అంగన్వాడీల సమ్మెకు ముగింపు పలకాలని ప్రభుత్వ పెద్దలు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మరోసారి చర్చలకు పిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. అదే సమయంలో షోకాజు నోటీసు గడువు అయిపోవడంతో విధులకు హాజరుకాని అంగన్వాడీల వివరాలను సేకరించే పనిలోపడింది. అంగన్వాడీలు సమ్మె ప్రారంభించి 39 రోజులు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. వారు సీఎం జగన్ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చమని కోరుతున్నారు. కనీస వేతనం ఇవ్వమంటున్నారు. చేతులెత్తేసిన ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఇరు పక్షాలూ ఎవరి పట్టు వారు పడుతున్నారు. దీంతో సమస్య కొలిక్కి రావడం లేదు. మరోవైపు ప్రభుత్వం చర్చలు అంటూనే చర్యలకు సిద్ధమవుతున్నట్లు ఇస్తున్న సంకేతాలు పరిస్థితిని మరింతగా దిగజారుస్తున్నాయి. అటు ప్రభుత్వం, ఇటు అంగన్వాడీల మధ్య ఇరుక్కుపోయిన ఐసీడీఎస్ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించింది జగన్ సర్కార్. షోకాజు నోటీసులు ఇచ్చింది. ప్రత్యామ్నాయాలు చూసుకుంటాం అంటూ బెదిరించింది. దేనికీ లొంగని అంగన్వాడీలు పట్టుదలతో సమ్మెను కొనసాగించడమే కాదు... మరింత ఉధృతం చేశారు. జిల్లా, మండల, ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద నిరసనలు కొనసాగిస్తున్నారు.

చర్యలా...మళ్లీ చర్చలా?...

ఈ నెల 9న అంగన్వాడీలకు ఐసీడీఎస్ అధికారుల ద్వారా ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందిన 10 రోజుల్లో సమాధానం చెప్పాలంటూ ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు, ఆయాకు నోటీసులు వివిధ రూపాల్లో పంపింది. నోటీసులు అందుకున్న అంగన్వాడీలు ఇప్పటికే ఐసీడీఎస్ అధికారులకు సమాధానాలు ఇచ్చారు. కాగా, షోకాజ్ నోటీసుల గడువు ముగియడంతో విధులకు హాజరుకాని వారి జాబితాలను సిద్ధంచేసి కలెక్టర్లకు పంపాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఆయా జిల్లాల పీడీలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు ఐసీడీఎస్ అధికారులు తాజాగా కలెక్టర్లకు నివేదికలు పంపడం ప్రారంభించారు. అదే విధంగా విధులకు హాజరయిన వారి సంఖ్యనూ కలెక్టర్లకు పంపిన నివేదికల్లో పేర్కొనట్లు తెలిసింది. ఈ క్రమంలో కలెక్టర్లు పరిస్థితిని మదింపు చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపి స్పష్టత కోరే అవకాశం ఉంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంగన్వాడీలపై తీసుకునే ఎటువంటి చర్యలైనా రాజకీయంగా ప్రభావం చూపించే అవకాశం మెండుగా ఉందన్న వైసీపీ పెద్దల వాదన నేపథ్యంలో సర్కారు ఊగిసలాడుతోందని తెలుస్తోంది.

అంగన్వాడీల సమ్మె @ 39

ఆత్రేయపురంలో ఆందోళనతో అంగన్వాడీ మృతి



గుండెపోటుతో మృతి చెందిన శాంతకుమారి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు తీవ్ర ఒత్తిడికి, మనోవేదనకు గురైన అంగన్వాడీ టీచర్ కె.శాంతకుమారి (50) గుండెపోటుతో మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం పెదపేటలోని అంగన్వాడీ కేంద్రం 78లో కొత్తపల్లి శాంతకుమారి టీచర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం ఆమె కొత్తపేటలోని అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె శిబిరంలో పాల్గొనేందుకు ఇంటి నుంచి బయల్దేరింది. ఈలోగా గుండెపోటు రాగా కుప్పకూలి మృతి చెందింది. ఈమెకు ఒక కుమారుడు ఉన్నాడు. అంగన్వాడీ టీచర్ ప్రాణాన్ని జగన్ ప్రభుత్వం బలిగొందని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆరోపించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద అంగన్వాడీల ఆందోళన కొనసాగుతోంది. పరిష్కారం లభించే వరకూ సమ్మె విరమణ ప్రసక్తే లేదని నేతలు స్పష్టంచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు 39వ రోజు శుక్రవారం నిరసన కొనసాగించారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమను రోడ్లపాలు చేసిన సీఎం జగన్.. 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి.. సామాజిక, మహిళా సాధికారత అంటూ గొప్పలు పోతున్నారని, ఇదేం సాధికారత అని అంగన్వాడీలు మండిపడ్డారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షల్లో భాగంగా అంబేడ్కర్ చిత్రపటంతో పెద్దఎత్తున నిరసన తెలిపారు. చాట్రాయి, బుట్టాయిగూడెం, లింగపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. కుక్కునూరు, భీమడోలు, పోలవరం, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి, చింతలపూడి ప్రాంతాల్లో అంగన్వాడీలు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు, తణుకుతో సహా పలు ప్రాంతాల్లో అంగన్వాడీలు ఆందోళనలను కొనసాగించారు.

ట్రెజరీ ఉద్యోగులకు ఎన్నికల విధులు వద్దు : ఏపీటీఎస్ఏ

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధుల నుంచి ట్రెజరీశాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఎస్ఏ) కోరింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌ను కలిసి ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కిరణ్ కుమార్, భాస్కర్‌రావు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో ఖజానాశాఖ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని, , దీంతోపాటు ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ట్రెజరీశాఖ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాల్సి ఉందని ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

అప్పుల భారంతో కౌలు రైతు ఆత్మహత్య

పోలవరం, జనవరి 19: అప్పుల భారంతో పురుగుమందు తాగి ఏలూరు జిల్లాలో ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలవరం పంచాయతీ నూతనగూడెం గ్రామానికి చెందిన తిరుమలశెట్టి గోపీకృష్ణ (50) పోలవరంలో మూడు ఎకరాల పొలం కౌలుకు సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టం రావడం, ఇటీవల తుఫాన్ కారణంగా పంట కోల్పోవడంతో రూ.7 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీలు కట్టలేక కొద్ది రోజులుగా ఇబ్బందిపడుతున్న గోపీకృష్ణ శుక్రవారం పొలంలోనే పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని రాజమహేంద్రవరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మరొక చోటికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ప్రాజెక్టుల అప్పగింతకు తెలుగు రాష్ట్రాలు అంగీకరించాయి!

- వారంలో లాంఛనాలు.. నెలరోజుల్లో అప్పగించాలి
- సమావేశం మినిట్స్ విడుదల చేసిన కేంద్రం
- బోర్డు అంగీకరిస్తేనే ప్రాజెక్టుపైకి అధికారులను.. అనుమతించాలని సీఆర్‌పీఎఫ్‌కు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బోర్డుకు ఏ ప్రాజెక్టునూ అప్పగించేందుకు తాము అంగీకరించలేదని తెలంగాణ ప్రభుత్వం చెబుతుండగా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం రెండు తెలుగు రాష్ట్రాలూ ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించాయని అంటోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుతోపాటు 15 కాంపోనెంట్లను అప్పగించేందుకు ఈ నెల 17న జరిగిన సమావేశంలో అంగీకారం తెలిపాయని ప్రకటించింది. ఈ మేరకు ఆ సమావేశం తాలూకు మినిట్స్‌ను కేంద్ర జలశక్తి శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈ మినిట్స్ ప్రకారం.. కృష్ణా జలాలు/ప్రాజెక్టుల సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి, ప్రాజెక్టులను తటస్థంగా ఉన్న కృష్ణాబోర్డుకు అప్పగించడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయని కేంద్రం పేర్కొంది. రెండు రాష్ట్రాలతో పాటు కృష్ణాబోర్డుకు చెందిన అధికారులు వారం రోజుల్లో చర్చించుకొని, ప్రాజెక్టుల అప్పగింతకు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని, నెలరోజుల్లోగా ప్రాజెక్టులను అప్పగించాలని ఆదేశించింది. ప్రాజెక్టుల కట్టలతో పాటు కాంపోనెంట్లపై సీఆర్‌పీఎఫ్ బలగాలు గట్టిగా నిఘా ఉంచాలని, తెలుగు రాష్ట్రాల అధికారులను ప్రాజెక్టులపైకి కృష్ణా బోర్డు అనుమతి తీసుకున్న తర్వాతే అనుమతించాలని తెలిపింది. ఇరు రాష్ట్రాలు నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లకు తమవైపు ఉన్న భాగాల్లో మరమ్మతులు, నిర్వహణ పనులను బోర్డు పర్యవేక్షణలో, అనుమతి తరువాతే చేపట్టాలని పేర్కొంది. కృష్ణాబోర్డు నిర్వహణ కోసం తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24కు) నిధులను, గత ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు ఏమైనా ఉంటే వాటిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ప్రాజెక్టుల అప్పగింత పురోగతిపై 15 రోజుల్లో మరోమారు సమావేశం ఉంటుందని తెలిపింది.

తానా నూతన అధ్యక్షుడిగా నరేన్ కొడాలి



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అనూహ్య మలుపులతో రెండేళ్లపాటు కొనసాగిన తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా)ఎన్నికలు ఎట్టకేలకు ముగిశాయి. తానా తదుపరి అధ్యక్షుడిగా వర్జీనియాకు చెందిన నరేన్ కొడాలి ఎన్నికయ్యారు. జనవరి 18న ప్రకటించిన ఫలితాల ప్రకారం అన్ని జాతీయ పదవులను నరేన్ టీమ్ చేజిక్కించుకుంది. సుమారు 3వేల ఓట్ల ఆధిక్యంతో సతీష్ వేమూరిపై నరేన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా విజయం సాధించారు. బోర్డు డైరెక్టర్లుగా లావు శ్రీనివాస్, రవి పొట్లూరి, మల్లి వేమన గెలుపొందారు. కార్యదర్శిగా రాజా కసుకుర్తి, కోశాధికారిగా భరత్ మద్దినేని, జాయింట్ సెక్రటరీగా వెంకట్ కోగంటి, జాయింట్ కోశాధికారిగా సునీల్ పాంత్రా ఎన్నికయ్యారు.

ఆర్డీవో ముందు హాజరుకండి

- నోటీసుపై మీ అభ్యంతరాలు చెప్పండి
- బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు ఆదేశం
- 24 వరకు ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దు
- ఆర్డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోకు స్పష్టీకరణ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తన ముందు హాజరు కావాలని కోరుతూ సీఆర్పీసీ సెక్షన్ 110 కింద పలమనేరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. రామచంద్రయాదవ్‌పై ఈ నెల 24 వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. అయితే ఆర్డీవో ముందు హాజరై నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరాలు తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి శుక్రవారం ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. కేవలం రాజకీయ కక్షతో పిటిషనర్‌కు సీఆర్పీసీ సెక్షన్ 110 కింద నోటీసులు జారీ చేశారన్నారు. సంబంధిత సెక్షన్ కింద నోటీసు ఇవ్వడానికి గల కారణాలను అందులో పేర్కొనలేదన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఈ నెల 20న విచారణకు హాజరు అవుతానని పిటిషనర్ సమాచారం ఇచ్చారన్నారు. నోటీసుపై పిటిషనర్ తన అభ్యంతరాలను ఆర్డీవో ముందు వ్యక్తపరచవచ్చన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి... ఆర్డీవో ముందు హాజరై నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరాలు తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ నెల 24 వరకు పిటిషనర్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోను ఆదేశించారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు రామచంద్రయాదవ్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ధర్మ పోరాట సభ ఏర్పాటు ఘటనలో పుంగనూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నివురుగప్పిన నిప్పు

కొద్ది విరామం తరువాత మణిపూర్‌లో తిరిగి కొంతకాలంగా హింస కొన సాగుతోంది. నలభైఎనిమిదిగంటల్లో పదిమంది మరణించడంతో ప్రధాని ఇప్పటికైనా ఆ రాష్ట్రంమీద దృష్టిపెడతారా? అని విపక్షాలు అడుగుతున్నాయి. అధికారికంగా రెండువందలకుపైగా మరణాలు నమోదై, డెబ్బయ్ ఐదువేల మంది నిరాశ్రయులైన ఈ రాష్ట్రాన్ని రాహుల్ గాంధీ తన భారత్ జోడో న్యాయయాత్ర ఆరంభానికి ఎంచుకున్నారు. మణిపూర్ మంటలు చల్లారాలంటే, ప్రధాని నోరువిప్పాలని, ఆ రాష్ట్రాన్ని సందర్శించి ప్రజల మధ్య సయోధ్య కుదర్చాలని, సామరస్యాన్ని నెలకొల్పాలని కాంగ్రెస్ ఇప్పుడే కాదు, ఎప్పటినుంచో అంటోంది. రాహుల్ న్యాయ యాత్ర అక్కడి ప్రజలకు తమ భవిష్యత్తుపట్ల భరోసాని ఇస్తుందని ఆ పార్టీ చెప్పుకోవడం సహజం. తిరిగి రాష్ట్రంలో అగ్గిరాజుకుంటున్న ఈ తరుణంలోనైనా మోదీ తన ఊగిసలాటను పక్కనబెట్టి ఒక్కసారి కాలూనితే బాగుంటుందని చాలామంది నమ్మకం.

గురువారం మణిపూర్‌లో రెండువేర్వేరు ఘటనల్లో ఐదుగురు మీతీలు మరణించారు. ముందురోజు భారత్–మయన్మార్ సరిహద్దుపట్టణం మోరేలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనిక కమాండోలు కన్నుమూశారు. మూడు పోలీసు పోస్టులమీద కుకీ మిలిటెంట్లు దాడిచేశారని, మయన్మార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న 'పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్' తిరుగుబాటుదారులు వీరితో చేతులు కలిపివుండవచ్చునని ఈశాన్య రాష్ట్ర భద్రతాసలహాదారు కుల్దీప్ సింగ్ అనుమానం. ఈ రెండు వరుస ఘటనలతో పాటుగా పోలీసుస్టేషన్ల నుంచి ఆయుధాలను ఎత్తుకుపోయే ప్రయత్నాలు కూడా కొన్నిచోట్ల జరిగాయి. పోలీసులు అడ్డుపడటం, వారిమీద దాడులు జరగడం అటుంచితే, తమకు భద్రత కల్పించాలంటూ స్థానిక ప్రజలు వీధుల్లోకి రావడం, వారిని వెనక్కునెట్టివేసే ప్రయత్నంలో పోలీసులు గాయపడటం వంటివి కూడా జరుగుతున్నాయి. పోలీసులుమీదా, స్థానికులమీదా వరుసగా జరుగుతున్న దాడులు ప్రజలను భయపెడుతున్నాయి. వివిధ యువజన సంఘాలు నిరసన ర్యాలీలు నిర్వహించడం, ముఖ్యమంత్రిని కలిసే తమ ప్రయత్నాన్ని అడ్డుకున్నందుకు మహిళలు బైఠాయింపులు జరపడం వంటివి పరిస్థితి తీవ్రతను తెలియచెబుతున్నాయి. అన్ని భద్రతావిభాగాలతో కూడిన యూనిఫైడ్ కమాండ్ అధిపతిగా ఉన్న కుల్దీప్‌సింగ్‌ను తప్పించి, స్వయంగా ముఖ్యమంత్రే దానిని నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తుంటే, పరిస్థితులను నియంత్రించాలంటే కొన్ని వైమానిక హెలికాప్టర్లు మాకు అందుబాటులో ఉంచాలని ఆయన కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నారు.


మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితులకు కారణాలు ఏమైనప్పటికీ, ఆ రాష్ట్రం ఇంకా చల్లారలేదన్నది నిజం. వివిధ తెగల మధ్య ఉన్న ఆ పాటి సయోధ్య కూడా పూర్తిగా అడుగంటిపోయి, నివురుగప్పిన నిప్పులాగా ఉన్న వాతావరణాన్ని మిలిటెంట్లు తమకు అనుకూలంగా వాడుకోవడానికి ప్రయత్నించడం సహజం. గతవారం కుకీ ఉగ్రవాదులు నలుగురు మీతీలను అపహరించి చంపివేశారు. పక్షంరోజుల క్రితం మీతీ తీవ్రవాద సంస్థ 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' ఐదుగురు మీతీ ముస్లిం పంగాల్స్‌ను చంపివేసింది. నాగాల మాదిరిగానే ఈ తెగలమధ్య వైరంలో ముస్లిం మీతీలు ఏ పక్షానికి కొమ్ముకాయకుండా తటస్థంగా ఉన్న విషయం తెలిసిందే. తెగలమధ్య వైరంతో చీలిపోయివున్న మణిపూర్‌లో తీవ్రవాదం బలపడుతూండటం ప్రమాదకరం. అటు మీతీలకు, ఇటు కుకీ–జోమీ తెగలకు చెందిన వివిధ తీవ్రవాద గ్రూపులు తమ ప్రజల మానసికస్థితినీ, బలహీనతలను సొమ్ముచేసుకుంటూ, రక్షకులుగా అవతారమెత్తేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉద్రిక్తతలు కొనసాగేట్టు చేస్తున్నాయి. మీతీలపట్ల అపరిమిత ప్రేమాభిమానాలున్న ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ మీతీ తీవ్రవాద సంస్థల విషయంలో చూసీచూడనట్టు పోతున్నారని మిగతావారి అనుమానం.

అనేక ఆంక్షలు, నియంత్రణల మధ్య, స్థలకాలాదుల్లో కొన్ని మార్పుచేర్పులతో ఆరంభమైన రాహుల్ న్యాయయాత్ర ఈ ఈశాన్య రాష్ట్రం మీదకు తిరిగి దేశప్రజల దృష్టిని మళ్ళించింది. కొంతకాలం పాటు తీవ్రమైన చర్చోపచర్చలు జరిగి, ఆ తరువాత పాలకుల మాదిరిగానే మీడియాకు కూడా పట్టకుండా మిగిలిపోయిన మణిపూర్‌లో పరిస్థితులు పెద్దగా మారలేదని, తిరిగి రాజుకొనేందుకు అది సిద్ధంగా ఉన్నదని వరుస ఘటనలు హెచ్చరిస్తున్నాయి. రాహుల్ వచ్చివెళ్ళినందుకు కాకున్నా, ప్రధాని మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, ఈ ఎనిమిదినెలల కాలంలో తాము అక్కడ సాధించిందేమిటో స్వయంగా తెలుసుకొని, నాలుగు మంచిమాటలతో ప్రజలకు కాస్తంత ఉప-

కుబేరులే తప్ప, పేదలు పట్టరు!

తెలుగు నాటక రాజం 'కన్యశుల్కం'లో నాయక 'మధురవాణి' తనను ముద్దెట్టున్నదంటూ కొండుభట్లు అనే ఒక అప్రధాన పాత్ర వీధుల్లో ఆనందోత్సాహాలతో గెంతులు వేస్తుంది. సంపద్వంతమవుతున్న ఇండియా విషయమై మీడియా అత్యుత్సాహాలూ అదే విధంగా ఉన్నాయని అనవచ్చు. నిజమే, వార్షికాదాయం 10,000 డాలర్లు (రూ.8,40,000) ఉన్న వ్యక్తుల సంఖ్య పెరుగుతోంది. సీఏజీఆర్ (కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్) ఇతోధికంగా పెరుగుతూ సంపద్వంత వ్యక్తుల సంఖ్య పెరుగుతుందని మీడియా ఘోషిస్తోంది. వినియోగం భారీ స్థాయిలో పెరిగిపోయేందుకు సంపద్వంత ఇండియా విశేషంగా దోహదం చేస్తుందని. ఈ సంవత్సరాంతానికి భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ (ఐదు లక్షల కోట్ల) డాలర్ల విలువైనదిగా చేసేందుకు సంపన్న ఇండియా కృతనిశ్చయంతో ఉన్నదని మీడియా పదే పదే చెబుతోంది. అయితే ఈ 5 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్య పరిపూర్తి గడువు ఇంకా అనిర్ధారితంగా ఉన్నది (ఎందుకంటే అది నిరంతరమూ మారుతూ ఉన్నది).

ఇండియా సంపద్వంత మవుతుండడం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. అయితే అందుకొక షరతు ఉన్నది. గోల్డమన్ సాక్స్ అనే విఖ్యాత పెట్టుబడి బ్యాంకు అంచనా ప్రకారం 2026 సంవత్సరం నాటికి సంపన్న భారతీయుల సంఖ్య 100 మిలియన్ (పది కోట్లు)గా ఉంటుంది. అంటే దేశ జనాభాలో ఇంచుమించు 7 శాతం మంది సంపన్నులుగా ఉంటారు. అయితే గోల్డ్‌మాన్ సాక్స్ కేవలం సంపన్న భారతీయులు గురించి మాత్రమే ఎందుకు మట్లాడుతోంది? మిగతా 93 శాతం మంది భారత ప్రజల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదు? ఎందుకంటే ఆ సంస్థ సంపన్నుల బ్యాంక్. సంపద్వంత ఇండియా ఒక ప్రత్యేక దేశమైతే అది ఇక మధ్యస్థాయి ఆదాయం గల దేశంగాను, ప్రపంచంలో 15వ అతి పెద్ద సంపన్న దేశంగాను (కొన్ని గౌరవప్రదమైన మినహాయింపులతో) ఉండి ఉండవచ్చు. ఆర్జిస్తున్న భారీ ఆదాయాన్ని ఆదాచేసుకుని మదుపు చేసే వారు విచ్చలవిడిగా ఖర్చు చేసేవారు మాత్రమే తమ ఆదాయం, సంపద, ఇంకా ప్రతి విషయం గురించి పెద్దగా మాట్లాడుతున్నారు. సంపద్వంత ఇండియా ఏవైనా కొన్నప్పుడు, వినియోగం చేసినప్పుడు — సకల భారతీయులూ కొనుగోళ్లు చేస్తున్నారని, అమిత వినియోగం చేస్తున్నారనే భ్రాంతిని కలిగిస్తోంది! మరింత స్పష్టంగా చెప్పాలంటే సంపద్వంత ఇండియా సమస్త భారతదేశానికీ ప్రతినిధి అయింది! మిగతా 93 శాతం మంది అల్పాదాయాలతో సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి ప్రయత్నిస్తున్నవారు లేక లభిస్తున్న ఆదాయంతో సంతోషదాయకంగా జీవించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వారేనని చెప్పి తీరాలి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మూడు గణాంకాలను మరింత వివరంగా చూద్దాం. సంపద్వంత ఇండియా వార్షికాదాయం రూ.8,40,000; మధ్యస్థాయి ఆదాయం రూ.3,87,000, తలసరి ఎనఎనఐ – రూ.1,70,000. సంపద్వంత ఇండియా చాలా చాలా చిన్నది అని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తలసరి జాతీయ ఆదాయం (ఎనఎనఐ) అర్థరహితమైనది. సంపద్వంత ఇండియా ఆదాయసగటును పై స్థాయికి లాగుతుంది. కనుక బాగా ఉపయుక్తమైన గణాంకం మధ్యస్థాయి ఆదాయం మాత్రమే. భారత ప్రజల్లో సగం మంది (71 కోట్లు) వార్షికాదాయం రూ.3,87,000 లేక అంతకంటే తక్కువ. లేదా నెలసరిన చూస్తే రూ.32,000 లేదా అంతకంటే తక్కువ. ఆర్థిక నిచ్చెనపై మీరు ఎంత క్రింది స్థాయిలో ఉంటారో మీ ఆదాయం అంత తక్కువగా ఉంటుంది. దేశ జనాభాలో ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న పదిశాతం మంది లేదా 20శాతం మంది నెలా నెలా ఆర్జిస్తున్నదెంత? నా ఉదార అంచనా ప్రకారం క్రింది స్థాయి 10శాతం మంది నెలసరి ఆదాయం రూ.6000 కాగా కింది స్థాయిలో ఉన్న 11 నుంచి 20 శాతం మంది నెలసరి ఆదాయం రూ.12,000.



దేశ సంపదలో 60 శాతం మేరకు, జాతీయ ఆదాయంలో 57 శాతం వాటా కలిగివున్న 7 కోట్ల మంది సంపన్న భారతీయుల భాగ్య వైభవం ఆర్థికశ్రేణీక్రమంలో అట్టడుగు స్థాయిలో 20 శాతం మంది స్థితిగతుల పట్ల పాలకుల్లో ఉపేక్షా భావాన్ని కలిగిస్తోంది! మతాన్ని తీవ్ర జాతీయవాదంతో ఎలా మిళితం చేయాలో పాలక పార్టీకి బాగా తెలుసు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ సంపన్న భారతీయుల ప్రభుత్వమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆర్థిక సమత్వం, సామాజిక న్యాయం భావనలు, ఆదర్శాలకు మన దేశం చాలా దూరంగా, దూరంగా వెళ్లిపోతోంది.

ఇంత తక్కువ ఆదాయంతో వారు ఎలా జీవిస్తున్నారనే విషయమై మనం తప్పక కలవరపడవలసి ఉన్నది. ఎటువంటి ఆహారాన్ని వారు తీసుకుంటున్నారు, ఎటువంటి దుస్తులు ధరిస్తున్నారు, ఆరోగ్య భద్రత సేవలు ఎలా పొందుతున్నారు అనే అంశాలు తప్పక ఆందోళన కలిగిస్తాయి. ఇలాంటివారు దేశ జనాభాలో 16 శాతం మేరకు ఉంటారు. కానీ నీతి ఆయోగ్ అంచనా ప్రకారం దేశ జనాభాలో దారిద్ర్యరేఖకు దిగువన నివశిస్తున్నవారు 11.28 శాతం మంది లేదా 16.8 శాతంగా ఉన్నారు. శతాధిక కోట్ల భారతీయులలో 7 కోట్ల మంది సంపద్వంతులుగా ఉండడం చాలా ఆనందప్రదమైన విషయం. సంతోషంగా వేడుక చేసుకోవల్సిన విషయం, సందేహం లేదు. అయితే ఇంతకు మూడురెట్లు అధికంగా ఉన్న పేదల దయనీయ బతుకుల గురించి కూడా మనం తప్పక ఆలోచించాలి. 22.8 కోట్ల మంది భారతీయులు పేదరికంలో మగ్గుతున్నారు. ఈ పేదలు ఎవరో గుర్తించడం అంతకష్టమేమీ కాదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం పేరు నమోదు చేయించుకున్నవారు 15.4 కోట్ల మంది. వీరికి ఏటా కనీసం 100 రోజులపాటు ఉపాధి సమకూర్చడానికి ప్రభుత్వం హామీపడింది. గత ఐదు సంవత్సరాలుగా ఏటా సగటున 48 నుంచి 51 రోజులపాటు పనులు సమకూరుస్తున్నారు. ఈ లబ్ధిదారులలో అత్యధికులకు ఎల్పీజీ కనెక్షన్ సదుపాయం కూడా సమకూర్చారు. అయితే ఈ కుటుంబాలు సంవత్సరానికి కేవలం 3.7 సిలిండర్లను మాత్రమే వినియోగించుకోగల ఆర్థిక స్థితిలో ఉన్నాయి.

ఒకటి లేదా రెండు ఎకరాల వ్యవసాయ భూమి కలిగివుండి సొంత సేద్యం చేసుకుంటున్న కుటుంబాలు 10.47 కోట్ల దాకా ఉన్నాయి (ఈ సంఖ్య నవంబర్ 15, 2023 నాటికి 8.12 కోట్లకు తగ్గిపోయింది. ఈ కుటుంబాలకు ఏడాదికి కిసాన్ సమ్మాన్ కింద రూ.6000 ఆదాయం లభిస్తుంది; వ్యవసాయ కూలీలుగా ఉన్న దినసరి వేతన కార్మికులు పేదవారుగాక మరేమవుతారు? పేవ్‌మెంట్స్ వంతెనల కింద బతుకులు ఈడుస్తున్న అభాగ్యులు; ఒంటరి మహిళలలో అత్యధికులు వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్నవారే, మురికికాల్వలు మునిసిపల్ మూత్రశాలలను శుభ్రం చేయడం, చచ్చిన జంతువుల చర్మాలను వొలవడం మొదలైన అపరిశుభ్ర, పనులు జీవనాధారంగా ఉన్నవారు పేదలే అనడంలో సందేహం లేదు. మధ్యస్థాయి ఆదాయం కంటే తక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నవారిలో 21 నుంచి 50శాతం మంది ఆర్థిక శ్రేణి క్రమంలో దిగువన ఉన్న 20శాతం మంది కంటే మెరుగ్గా నివశిస్తున్నారు. ఆకలి దప్పులు అనేవి వీరికి తెలియనప్పటికీ వీరి జీవన స్థితిగతులు నిత్యం అనిశ్చితంగానే ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బంది మినహా ఇతర రంగాలోని ఉద్యోగులు, కార్మికులు తమ జీవనాధారాన్ని కోల్పోవలసివస్తుందనే భయంతో జీవిస్తున్నవారే. 2023లో టెక్ కంపెనీలు 2,60,000 మేరకు ఉద్యోగులను తగ్గించుకున్నాయి. నిపుణ సిబ్బంది వేల సంఖ్యలో వీధినపడ్డారు. 100 అంకుర సంస్థలు 24 వేల ఉద్యోగాలను రద్దు చేశాయి. ప్రైవేట్ ఉద్యోగులలో అత్యధికులకు ఉద్యోగభద్రత లేదు. అలాగే వారు పొందే సామాజిక భద్రతా సదుపాయాలు కూడా ఏమీ లేవు. ప్రభుత్వ ఈ–శ్రమ్ పోర్టల్‌పై నమోదైన 2.8 కోట్ల మంది గృహపరిచారకులు చట్టబద్ధమైన కనీస వేతనాలు పొందడమే లేదు. ఇటువంటి అభాగ్యుల సంఖ్య వాస్తవనికి ఇంకా అధికంగా ఉంటుంది.

పంచ నక్షత్రాల హోటళ్లు, రిసార్ట్‌లు, తళుకు బెళుకుల మిరుమిట్లుగొలిపే మాల్స్ లగ్జరీ బ్రాండ్ స్టోర్స్ మల్టీప్లెక్స్ సినిమా హాల్స్, విలాసకరమైన విహార కేంద్రాలలో వివాహాలు, 4 నుంచి 9 కోట్ల రూపాయల విలువ చేసే కార్లు (ఒక కంపెనీ ఇటువంటి కార్లను గత ఏడాది నూటికి పైగా విక్రయించింది) మొదలైన విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నవారు సంపద్వంత ఇండియాలో చాలా మంది ఉన్నారు. ఈ సంపన్న భారతీయులు ఇంత వైభవోపేత జీవనశైలిని ఎలా కలిగి ఉన్నారు? దేశ సంపదలో 60 శాతం మేరకు వీరి స్వాధీనంలోనే ఉన్నది. అంతేకాదు జాతీయ ఆదాయంలో వీరి వాటా 57 శాతంగా ఉన్నది. మిరుమిట్లుగొలుపుతున్న ఈ సంపన్నత ఆర్థికశ్రేణీ క్రమంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది స్థితిగతుల పట్ల పాలకుల్లో ఉపేక్షా భావాన్ని కలిగిస్తోంది. పేదల సంక్షేమం పట్ల బీజేపీ ప్రభుత్వ ఈ గర్హనీయ వైఖరికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతు ఉన్నది. అది ఒక ఉక్కు చట్రంలాంటి మద్దతు. కార్పొరేట్ కంపెనీలు, ఎన్నికల బాండ్ల పుణ్యమా అని పాలక పార్టీ కోశాగారంలో నిధులు సమృద్ధంగా ఉన్నాయి. మతాన్ని తీవ్ర జాతీయవాదంతో ఎలా మిళితం చేయాలో ఆ పార్టీకి బాగా తెలుసు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ కచ్చితంగా సంపన్న భారతీయుల ప్రభుత్వమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆర్థిక సమత్వం, సామాజిక న్యాయం భావనలు, ఆదర్శాలకు మన దేశం చాలా దూరంగా, దూరంగా వెళ్లి పోతోంది. ప్రతిపక్షాలు మీడియా ఈ కఠోర వాస్తవాల పట్ల జాగరూకతతో లేకపోవచ్చుగానీ 93 శాతం మంది పేద ప్రజలు, మధ్యతరగతి వర్గాల వారు పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నారు. తమ మనసులలోని మాటను వెల్లడించేందుకు వేచివున్నారు.

లెనిన్: 'ప్రపంచ కావ్యానికి ప్రతిపదార్థం'

లెనిన్‌గా సుప్రసిద్ధుడైన వ్లదీమిర్ ఇల్యీచ్ ఉల్యానొవ్ భౌతికంగా మరణించి ఈ 21కి వంద సంవత్సరాలు నిండుతాయి. యాభై నాలుగు సంవత్సరాలు నిండకుండానే మరణించినా, అందులో ముపె□అయిదేళ్లకు మించని ప్రజా జీవితంలో చేసిన పనులు, సాధించిన విజయాలు, ప్రపంచానికి చూపిన ఆదర్శాలు ఆయనకు అనితర సాధ్యమైన మరణానంతర జీవితాన్ని ఇచ్చాయి. ఒక మనిషిని మరొక మనిషీ, ఒక జాతిని మరొక జాతీ పీడించడానికి వీలులేని ఒక సమతా సుందర స్వప్నాన్ని మానవజాతి వందల ఏళ్లుగా, వేల ఏళ్లుగా కంటున్నదేమో గాని, మానవ చరిత్రలో ఆ స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత లెనిన్‌దే. చుట్టుముట్టిన భయానక అవరోధాల మధ్య, ప్రతీపశక్తుల సవాళ్లను ఎదుర్కొంటూ ఆ స్వప్నం నిలదొక్కుకోవడానికి మార్గం సుగమం చేసిన శక్తీ లెనిన్‌దే.

లెనిన్ జీవితమంతా, వ్యక్తిగత స్థాయిలోనూ, నిర్వహించిన ఉద్యమాల స్థాయిలోనూ, మొత్తంగా ఎదుర్కొన్న వ్యవస్థ స్థాయిలోనూ కంటకావృత మార్గంలోనే నడిచింది. కష్టం మీద కష్టం కష్టం తోసుకొచ్చాయి. ఆ కష్టభరిత జీవితంలోనే ఆయన విజయ సాఫల్యం వైపు పురోగమించాడు. ప్రకృతినీ, రాజ్యాన్నీ, లోపలి ప్రత్యర్థులనూ, బైటి ప్రత్యర్థులనూ అధిగమిస్తూ, ఓడిస్తూ, గేలి చేస్తూ విజయం మీద విజయం మీద విజయం సాధించాడు. బహుశా ఆ ఒత్తిడే ఆయన జీవితాన్ని అర్ధాంతరంగా 54 ఏళ్లకే ముగించి ఉంటుంది. కాని ఆ స్వల్ప జీవిత కాలంలోనే ఆయన చేసిన అధ్యయనం, రాసిన రచనలు, ఉపన్యాసంలో, రచనలో ఎదుటివారిని మెప్పించే వాదనా పటిమ, నాయకత్వం వహించిన ఉద్యమాలు, అనుభవించిన నిర్బంధాలూ

> **రష్యన్ సామాజిక చరిత్ర లెనిన్ అనే అసాధారణ వ్యక్తిని తయారు చేస్తే, ఆ వ్యక్తి ప్రపంచ చరిత్రనే మార్చే కొత్త దారి ఏర్పరిచాడు.**


ప్రవాసాలూ, తప్పించుకున్న హత్యా ప్రయత్నాలూ, స్థాపించిన మొట్టమొదటి కార్మిక కర్షక రాజ్యం, నిర్వహించిన కార్మికవర్గ సోషలిస్టు సమాజ నిర్మాణం, సమయ సందర్భాలకు తగినట్టు వ్యూహాలను మార్చిన చాతుర్యం, తన స్థల కాలాలకు మాత్రమే కాదు, ప్రపంచమంతటికీ, సర్వకాలాలకూ ప్రాసంగికమైన ఆలోచనాచరణలు — లెనిన్ జీవితం ఒక ప్రయోగం. ఒక ఆదర్శం. రష్యన్ సామాజిక చరిత్ర లెనిన్ అనే అసాధారణ వ్యక్తిని తయారు చేస్తే, ఆ వ్యక్తి ప్రపంచ చరిత్రనే మార్చే కొత్త దారి ఏర్పరిచాడు.

'ప్రపంచమనే పద్మంలో/ పరీమళం లెనిన్/ ప్రపంచమనే కావ్యానికి/ ప్రతి పదార్థం లెనిన్/ బ్రదుకనే చిక్కు సమస్యకు/ పరిష్కారం లెనిన్' అని శత జయంతి సందర్భంగా శ్రీశ్రీ రాసిన కవితాపాదాలు అక్షర సత్యాలు.

1870 ఏప్రిల్ 22న వోల్గా నదీ తీరంలోని సింబీర్స్క్ నగరంలో ఇల్యా నికొలాయేవిచ్, మరీయా అలెక్సాంద్రోవ్నాల ఆరుగురు సంతానంలో మూడవవాడు వ్లదీమిర్. ప్రగతిశీల భావాలున్న తండ్రి ప్రభుత్వ పాఠశాలల తనిఖీ అధికారిగా పనిచేస్తూ, వ్లదీమిర్‌కు పదహారేళ్లు ఉన్నప్పుడు మరణించాడు. తండ్రి మరణం నాటికి సేంట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న ఆరేళ్లు పెద్దదైన అక్క, నాలుగేళ్లు పెద్దవాడైన అన్న మూడో జార్‌కు వ్యతిరేకంగా సమీకృతమైన విప్లవ విద్యార్థి బృందంలో చేరారు. ఒక ఏడాది తర్వాత ఆ బృందం జార్ చక్రవర్తిని హత్య చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అన్న అలెక్సాంద్ర్‌కు ప్రభుత్వం మరణశిక్ష

> **లెనిన్ మరణించిన వెంటనే రాసిన దీర్ఘ కావ్యంలో కవి వ్లదిమీర్ మయకోవస్కీ అన్నట్టు, 'లెనిన్ నేడు లేడూ? చూడు, జనంలో ఉన్నాడు' అని అనుకోకుండా ఈ వంద సంవత్సరాలు గడవలేదు.**

విధించి ఉరి తీసింది. అక్క అన్నాను కూడా అరెస్టు చేశారు. దానితో సింబీర్స్క్‌లో పరిచయస్తులలో ఒకరిద్దరు మినహా అందరూ వెలివేసినట్టు చూడడంతో ఉండలేని స్థితి వచ్చి కుటుంబం కజాన్‌కు మారింది. అప్పుడున్న స్థితిలో వ్లదీమిర్‌కు ఎలాగూ సేంట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సీటు రాదు గనుక కజాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. కాని అక్కడా విద్యార్థి రాజకీయాలలో పాల్గొంటున్నాడని, విశ్వవిద్యాలయం నుంచి తొలగించి,



రేపు శతవర్ధంతి

కొకుష్కినో అనే గ్రామంలో నిరంతర పోలీసు నిఘా కింద ఉండాలని శాసించారు. అలా పదిహేడో ఏట మొదలైన నిర్బంధాలు, నిషేధాలు, ప్రవాసాలు తర్వాత ముపె□ళ్లు సాగుతూనే ఉన్నాయి.

రాజకీయ కారణాల వల్ల సీటు ఇవ్వని విశ్వవిద్యాలయంలోనే ప్రైవేటు విద్యార్థిగా నాలుగు సంవత్సరాల న్యాయశాస్త్ర విద్యను ఏడాదిన్నరలో పూర్తిచేసి న్యాయవాది అయ్యాడు. సమారా నగరంలో న్యాయవాదిగా పని చేస్తూ స్థానిక రైతుల తరఫున, ప్రజల తరఫున వాదించాడు. ఆ సమయంలోనే విపరీతంగా అధ్యయనం సాగిస్తూ మార్క్సిజంలో ప్రవేశించాడు. తన ఆలోచనలను కార్యాచరణగా మార్చడానికి అప్పటి రాజధాని సేంట్ పీటర్స్‌బర్గ్ చేరుకుని, కార్మికుల అధ్యయన బృందాలు ప్రారంభించాడు. అప్పుడే రచన కూడా ప్రారంభించాడు. ఇరవై మూడవ ఏట రైతాంగ జీవితంలో కొత్త ఆర్థిక పరిణామాలు' వంటి వ్యాసాలతో ప్రారంభించిన రచనాకృషి, మరణానికి ముందు యాభై మూడో ఏట తీవ్రమైన అనారోగ్యంలో డిక్టేట్ చేసిన రచనల వరకూ అసంఖ్యాకమైన వ్యాసాలు, పుస్తకాలు, కరపత్రాలు, వాదవివాదాలు, సైద్ధాంతిక రచనలు, ఉపన్యాసాలు, నివేదికలు, ప్రభుత్వ ఆదేశాలుగా విస్తరించింది. ఒక్కొక్కటి దాదాపు 650 పేజీలున్న 54 సంపుటాల (ఇంగ్లిష్‌లో 45 సంపుటాలు) రచనలు — అంటే ముపె□సంవత్సరాల్లో ముపె□ ఆరువేల పేజీలు — రచన చేశాడు.

సేంట్ పీటర్స్‌బర్గ్‌లో సాగించిన అధ్యయన, బోధన, రచన, సమీకరణ రాజకీయ కృషి వల్ల మళ్లీ ఒకసారి ఆయన మీద ప్రభుత్వం విరుచుకుపడింది. అక్కడ అయిదారేళ్ల కృషి కూడా పూర్తి కాకముందే, 1895లో, వందలాది మంది కార్మికులతో పాటు లెనిన్‌ను అరెస్టు చేశారు. ఏడాదిన్నర పాటు జైలులో ఉంచి, తర్వాత మూడు సంవత్సరాలు సైబీరియా ప్రవాసశిక్ష విధించి అక్కడికి పంపారు. ఆ ప్రవాసంలోనూ అధ్యయనం, రచన, రహస్య నిర్మాణం ఆపలేదు. అక్కడే, 'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' వంటి కీలక రచనలు చేశాడు. అక్కడే ప్రవాసశిక్షకు గురై ఉన్న సహకార్యకర్త నాడెజ్డా కృపస్కయాను పెళ్లి చేసుకున్నాడు. 1900లో అక్కడి నుంచి విడుదలై, ప్రభుత్వ ఆంక్షల మేరకు ప్స్కోవ్ నగరంలో ఉంటూ పార్టీ కోసం ఇస్క్రా (నిప్పురవ్వ) పత్రిక ప్రారంభించాడు. 'నిప్పురవ్వ దావానలమవుతుంది' అని అంతకు ముందరి శతాబ్దపు రైతాంగ పోరాట కవి ఒడోయెవ్స్కీ రాసిన మాటే లెనిన్‌కు ప్రేరణ, ఆ మాటను ఆయన నిజం చేశాడు కూడా.

ప్రవాసంలో జర్మనీ, ఇంగ్లండ్, బెల్జియం, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తిరుగుతూ, రష్యన్ విప్లవానికి మనుషులను కూడగడుతూ, 1903లో బ్రస్సెల్స్‌లో పార్టీ రెండో మహాసభ జరిపాడు. మహాసభలు జరుగుతుండగానే రష్యన్ గూఢచారుల కన్నుపడి, హఠాత్తుగా సభలను లండన్‌కు మార్చి దిగ్విజయంగా కొనసాగించాడు. ఆ సభలలోనే పార్టీ బోల్షివిక్కులు (అధిక సంఖ్యాకులు), అల్పసంఖ్యాకులు (మెన్షివిక్కులు) అని రెండుగా చీలిపోయింది. రెండు సంవత్సరాల తర్వాత సేంట్ పీటర్స్‌బర్గ్‌లో రక్తసిక్త ఆదివారం పేరుతో కుఖ్యాతి పొందిన మహా మారణకాండతో రష్యన్ ప్రజానీకంలో, కార్మికవర్గంలో జార్ చక్రవర్తి పాలన పట్ల భ్రమలు తొలగడం, బోల్షివిక్కుల పట్ల ఆదరణ పెరిగాయి.

ఈ మధ్యలో 1905 విప్లవ వైఫల్యం, 1907 స్టోలిపిన్ భయంకర నిర్బంధ కాలం, మొదటి ప్రపంచ యుద్ధం, 1917 ఫిబ్రవరి విప్లవం వంటి అనేక పరిణామాలు సంభవించాయి. 1917 ఫిబ్రవరిలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం మీద తిరుగుబాటుగా ప్రజలు, కార్మికవర్గం ఏ మార్గం చేపట్టవలసి ఉన్నదో ఏప్రిల్‌లో లెనిన్ క్రాంతదర్శిగా, ద్రష్టగా అక్టోబర్ విప్లవ సన్నాహాలు చేశాడు. సమయం ఆసన్నమైనప్పుడు తాత్సారానికి తావులేదని, 'మనం ఏ మాత్రం ఆలస్యం చేసినా మన మరణ శాసనంపై మనమే సంతకం చేసుకున్నవారమవుతాం' అన్నాడు. నిజానికి లెనిన్ జీవిత సారాంశమంతా ఇదే. పరిస్థితులకు తలొగ్గడం కాకుండా, ఆ పరిస్థితులను చేతుల్లోకి తీసుకుని, మార్గనిర్దేశనం చేసి, నాయకత్వం వహించడమే.

విప్లవానంతరం ఒక కొత్త రాజ్యం, ప్రపంచంలో మొట్టమొదటి కార్మిక కర్షక రాజ్యం నిర్మాణం ప్రారంభమయింది. నూతన జీవిత విధానం మొదలయింది. అంతకు ముందు ఇరవై సంవత్సరాలు పడిన శ్రమ ఒక ఎత్తు. ఇప్పుడు చేపట్టవలసిన కర్తవ్యాలు మరొక ఎత్తు. కాని ఆ కర్తవ్యాల నిర్వహణ కోసం చరిత్ర లెనిన్‌కు ఐదు సంవత్సరాల సమయం మాత్రమే ఇచ్చింది.

ఆ ఐదు సంవత్సరాలలో లెనిన్ తలపెట్టినవీ, చేసినవీ, చేయించినవీ, విజయం సాధించినవీ చూస్తే అబ్బురపాటు కలుగుతుంది. మొట్టమొదటి రోజునే భూమి శాసనం వెలువడి, భూస్వాముల, చర్చిల, మఠాల, సంపన్నుల భూమినంతా స్వాధీనం చేసుకుని దున్నేవారికి పంచే కార్యక్రమం మొదలయింది. అప్పటికే పాత రష్యన్ రాజ్యం రుద్ధిన యుద్ధం నుంచి బైటపడడం, పాత పాలకుల కుట్రలనూ, వారు ప్రారంభించిన అంతర్యుద్ధాన్నీ ఓడించడం, శాంతి కోరుకుంటున్న సోవియట్ ప్రజల మీదికి దండెత్తిన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా సహా పద్నాలుగు శత్రు దేశాల చక్రబంధాన్ని ఛేదించడం లెనిన్ తక్షణ సవాళ్లు అయ్యాయి. ఆ చక్రబంధాన్ని ఓడించగానే దేశంలో కరువు, టైఫస్, ఫ్లూ వ్యాధులు చెలరేగాయి. ఈ మధ్యలోనే లెనిన్ మీద

> **ఒక మనిషిని మరొక మనిషీ, ఒక జాతిని మరొక జాతీ పీడించడానికి వీలులేని ఒక సమతా సుందర స్వప్నాన్ని మానవజాతి వందల ఏళ్లుగా, వేల ఏళ్లుగా కంటున్నదేమో గాని, మానవ చరిత్రలో ఆ స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత లెనిన్‌దే. చుట్టుముట్టిన భయానక అవరోధాల మధ్య ప్రతీపశక్తుల సవాళ్లను ఎదుర్కొంటూ ఆ స్వప్నం నిలదొక్కుకోవడానికి మార్గం సుగమం చేసిన శక్తీ లెనిన్‌దే.**

కనీసం మూడు హత్యా ప్రయత్నాలు జరిగాయి.

ఈ భయంకర అవరోధాల మధ్య కొత్త రాజ్యాన్ని, కొత్త సమాజాన్ని, కొత్త మనిషిని నిర్మించడానికి లెనిన్ యుద్ధ కమ్యూనిజం, నూతన ఆర్థిక విధానాలు, సుబ్బోత్నిక్ స్వచ్ఛంద సేవ వంటి కొత్త కార్యక్రమాలు ప్రతిపాదించాడు. స్త్రీల విముక్తి, చిన్నారి పిల్లల ఆహ్లాదం, విద్య, వైద్యం, ఆరోగ్యం సోవియట్ రాజ్యపు ప్రధాన కర్తవ్యాలుగా ఎంచుకున్నాడు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి విద్యుదీకరణ, పారిశ్రామికీకరణ మొట్టమొదటి అవసరాలని ప్రకటించాడు. యువజన సంఘాన్ని సమావేశపరిచినప్పుడు, యుద్ధరంగానికి వెళ్లమంటాడేమో అనుకుంటే అధ్యయనం ప్రస్తుత కర్తవ్యం అని పిలుపు ఇచ్చాడు. శ్రామికవర్గ అంతర్జాతీయతను పెంపొందించడానికి ప్రపంచ దేశాల శ్రామిక పార్టీల ఐక్యతా కృషి ప్రారంభించాడు. జారిస్టు రష్యాలో మహా రష్యన్ జాత్యహంకారం కింద జాతుల బందిఖానాలో అణగారిపోయిన జాతులకు స్వయంనిర్ణయాధికారం ఇచ్చి, స్వచ్ఛంద ఐక్యతతో జాతుల నందనవనంగా మార్చే కృషి ప్రారంభించాడు.

1923 మార్చిలో లెనిన్‌కు మొదటిసారి బ్రెయిన్ □తో పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి ఎనిమిది నెలల పాటు అత్యున్నత స్థాయి చికిత్స, ఆహ్లాదకరమైన వాతావరణం వంటి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆరోగ్యం కుదుటపడలేదు. 1924 జనవరి 21న ఆ మహత్తర మేధావీ, కార్యకర్తా, నాయకుడూ, నవసమాజ నిర్మాతా అస్తమించాడు. లెనిన్ మరణించిన వెంటనే రాసిన దీర్ఘ కావ్యంలో కవి వ్లదిమీర్ మయకోవస్కీ అన్నట్టు, 'లెనిన్ నేడు లేడూ? చూడు, జనంలో ఉన్నాడు' అని అనుకోకుండా ఈ వంద సంవత్సరాలు గడవలేదు.

● ఎన్ వేణుగోపాల్

హేతువాద, మానవవాద సాహిత్య శిఖరం

'ఆలోచించడానికీ, మాట్లాడడానికీ, ప్రచురించుకోవడానికీ, ఆచరించడానికీ వీలయినంత ఎక్కువ స్వేచ్ఛ మానవుడికి భోగంగా కాక అవసరంగా కావాలి. ఈ స్వేచ్ఛాతత్వమే హేతువాదం. దీన్ని అర్థం చేసుకున్నవారే హేతువాదులు' అని ఐదు దశాబ్దాల క్రితమే స్పష్టం చేసిన ఆదర్శ హేతువాది రావిపూడి వెంకటాద్రి (1922–2023). హేతువాద లక్ష్యం మానవవాదమని ప్రకటించిన క్రాంతదర్శి ఆయన.

హేతువాదం, నాస్తికవాదం, భౌతికవాదం, మానవవాదం వంటి అనేక అంశాలలో స్పష్టత లేకుండా గందరగోళం చెలరేగి, వాదోపవాదాలు చోటు చేసుకుంటున్న తరుణంలో వాటన్నిటి స్వరూప స్వభావాలను, వాటి మధ్యగల సంబంధాలను విడమర్చి వివరిస్తూ సమగ్రమైన హేతువాద మానవవాద సాహిత్యాన్ని సృష్టించిన ఘనత వెంకటాద్రికే దక్కుతుంది.

నియమబద్ధంగా కొనసాగుతున్న ప్రకృతి నుండి పరిణామక్రమంలో ఆవిర్భవించిన మానవుడిలో ఆ నియమబద్ధతే హేతుత్వంగా రూపుదాల్చింది. అది జంతువులలో సహజాతాల రూపంలోను, మానవుడిలో విచక్షణ రూపంలోను దర్శనమిస్తోంది. ఆ విధంగా మనుషులందరూ మౌలికంగా హేతువాదులే అవుతున్నారు. అంటే మనుషులు తమలోని హేతుత్వాన్ని సక్రమంగా వినియోగించుకోగల సామర్థ్యాన్ని కలిగివున్నారని అర్థం. అయితే మతాచారాలు, సంప్రదాయాలు అడ్డుపడడం వల్ల సహజసిద్ధంగా ఉన్న హేతుత్వం మసకబారి అహేతుకత్వానికి దారి తీస్తుందని ఆయన వివరించారు.



> **తన జీవిత సర్వస్వాన్ని హేతువాద మానవవాద ఉద్యమ నిర్మాణానికే అంకితం చేసినవాడు రావిపూడి వెంకటాద్రి. 1956 నుంచి 1996 వరకు 40 సంవత్సరాల పాటు నాగండ్ల గ్రామానికి ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేశాడు. నిరాడంబరమైన, నిజాయితీతో కూడిన మచ్చలేని వ్యక్తిత్వంతో జీవించాడు. అజరామరమైన హేతువాద మానవవాద సాహిత్యాన్ని సృష్టించాడు.**

మతాలు నీతిని ప్రోత్సహిస్తున్నాయని, హేతువాదం–నాస్తికత్వం అవినీతిని ప్రోత్సహిస్తున్నాయని ఆస్తికులు ఆరోపణలు చేస్తున్నారు. ఇది పూర్తిగా వాస్తవ విరుద్ధం. హేతుమంతుడు కానివాడు నీతిమంతుడు కాలేడు. నీతి అనేది వ్యక్తి సామాజిక ప్రవర్తనకు సంబంధించింది. నీతి అంటే అంతరంగానికి జరిగే విన్నపమే. చరిత్ర గమనంలో మానవుడు హేతువంతుడైన మేరకే నీతివంతుడైనట్లు తెలుస్తోంది. ఈనాడు ప్రపంచవ్యాప్తంగా అధిక శాతం మతస్థులే ఉన్నప్పటికీ వారు నైతిక విలువలను పాటిస్తున్నట్లు ఆధారాలు లేవు. అంతటా అవినీతే తాండవిస్తోంది. దైవభీతి వల్ల కాక మానవుడు స్వచ్ఛందంగా నీతిగా ఉండాలనేదే హేతువాద పద్ధతి.

'మతం మంచినే బోధించిందనడానికి మతగ్రంథాల్లో సాక్ష్యం లేదు. బైబిలు అన్యజనుల పట్ల, ఖురాను అవిశ్వాసుల పట్ల, వేదం దస్యుల పట్ల, పురాణాలు రాక్షసుల పట్ల బోధించిన ద్వేషం హేయమైనది. అన్ని మతాలూ కొన్ని కొన్ని సందర్భాలలో శాంతి, దాంతి, దయ, దాక్షిణ్యాలను బోధించక పోలేదు. బోధలు మాత్రమే చేశాయి. కానీ, అవి ఆచరించినట్లు చరిత్రకు తెలియదు. ఆచరణలో ఆ బోధలకు వ్యతిరేకంగా అతి హింసాత్మకంగా ఆయా మతస్థులే ప్రవర్తించారు. ఎక్కడున్నదీ లోపం. హేతుత్వానికి విడాకులివ్వడంలోనే' అని వెంకటాద్రి మతాల నిజస్వరూపాన్ని బట్టబయలు చేశారు తన 'హేతువాదం' సంపుటంలో.

భారతదేశం నేడు మూఢవిశ్వాసాల ఊబిలో చిక్కుకుపోయి ఉంది. ముహూర్తాలు, జాతకాలు, జ్యోతిషం, వాస్తు వంటి వాటికి రోజురోజుకీ గిరాకీ పెరుగుతోంది. వాటి పేర వేల కోట్ల రూపాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇటువంటి వాటన్నిటినీ వెంకటాద్రి తన రచనలలో తీవ్రంగా విమర్శించి, ఖండించారు. జ్యోతిష్యం శాస్త్రమా? వాస్తు శాస్త్రమా వంటి గ్రంథా లలో అవి ఏవిధంగా తప్పో వివరిస్తూ వాటి బండారాన్ని బయటపెట్టారు.

హేతువాద ఉద్యమానికి పత్రిక అవసరమని భావించి 1982 సెప్టెంబర్‌లోనే 'హేతువాది' మాసపత్రికను ప్రారంభించారు. దానికి తానే సంపాదకుడిగా ఉండి తాను మరణించే వరకు 40 సంవత్సరాలకు పైగానే దానిని నిరాటంకంగా నడిపించారు. ఆధునిక విజ్ఞానం అందిస్తున్న అనేక నూతన ఆవిష్కరణల గురించి, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం మొదలుకొని, మాక్స్‌ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం వరకు ఆ పత్రికలో చర్చించారు. అదేవిధంగా ప్రాచీన భారతావనిలో కొనసాగిన వైదిక మతాచారాల గురించి, చార్వాక, జైన, బౌద్ధాది భావోద్యమాల గురించి 'హేతువాది' పత్రికలో విపులంగా చర్చించారు. తాత్విక రంగంలో కొనసాగుతున్న అనేక సిద్ధాంతాల గురించి చర్చించడమే గాక ఆయా సమస్యలకు పరిష్కారాలను సైతం సూచించారు. మత సిద్ధాంతాలు మొదలుకొని, మార్క్సిజం వంటి సిద్ధాంతాల వరకు కూలంకషంగా చర్చిస్తూ దాదాపు వంద పుస్తకాలు రచించారు. మతాలు అలౌకిక విషయాలకు ప్రాధాన్యతనిస్తూ మానవజాతిని నిర్వీర్యం చేస్తే, మార్క్సిజం వంటి లౌకిక సిద్ధాంతాలు సైతం వర్గపోరాటాల పేరుతో మానవజాతికి తీరని అన్యాయం చేశాయని, మానవజాతి శ్రేయస్సుకు మానవవాదమే శరణ్యమని వెల్లడించారు.

మానవజాతి చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రగా కారల్‌మార్క్స్ ప్రకటిస్తే, మానవజాతి చరిత్ర అంతా స్వేచ్ఛాపోరాట చరిత్రగా ఎంఎన్ రాయ్ అభివర్ణించాడు. మానవ జీవన పరమావధి స్వేచ్ఛ. అదో మౌలిక విలువ. దాని నుంచే మిగిలిన మానవ విలువలన్నీ నిష్పన్నమవుతాయి. స్వేచ్ఛ అంటే స్వయం సంపూర్ణ మానవులుగా ఉన్న వ్యక్తులలోని భౌతిక, మానసిక శక్తుల వికాసానికి అడ్డుతగిలే ప్రతిబంధకాలన్నీ క్రమానుగతంగా అదృశ్యం కావడమే. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలోని అసమానతలు, దోపిడీ పీడనలు సంకెళ్ల నుండి విముక్తి సాధించడమే స్వేచ్ఛ, విముక్తి పొందిన మేరకే స్వేచ్ఛాపరిధులు విస్తృతమవుతాయి. ఈ విధంగా మానవవాదంలో జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ, నీతి అనేవి ప్రధానపాత్ర వహిస్తాయి.

మానవుడిలోని వివేక సంకల్పాలు కూడా చాలా బలీయమైనవి. చరిత్ర గమనంలో అవి కూడా ప్రధానపాత్ర వహిస్తాయి. చరిత్ర గమనంలో భావాల పాత్రను కూడా తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. వాస్తవానికి సమాజంలోని ఏ రంగంలో అభ్యుదయం సాధించాలన్నా ముందుగా దానికి సంబంధించిన అభ్యుదయ భావాలు ప్రజల్లో వ్యాప్తి చెందాలి. దానినే భావవిప్లవం అంటారు.

భావ విప్లవాలు విజయవంతం కాకుండా, మానవుల మెదళ్లలో తిష్టవేసుకుని ఉన్న మతభావాలు తొలగిపోకుండా సామాజికాభ్యుదయాన్ని సాధించలేమన్నది చారిత్రక వాస్తవం. ఆ దిశగా కృషి జరగాలని భావించిన రావిపూడి వెంకటాద్రి సమగ్రమైన హేతువాద మానవవాద భావవిప్లవ సాహిత్యాన్ని సృష్టించాడు. భావవిప్లవోద్యమ సారథిగా జీవించి అమరుడయ్యాడు.

1922 ఫిబ్రవరి 9వ తేదీన ఆనాటి ప్రకాశం జిల్లా నాగండ్ల గ్రామంలో జన్మించిన రావిపూడి వెంకటాద్రి సంపూర్ణంగా 101 సంవత్సరాలు జీవించి 2023, జనవరి 21న చీరాలలో శాశ్వతంగా కన్ను మూశాడు.


ఆయన తన జీవిత సర్వస్వాన్ని హేతువాద మానవవాద ఉద్యమ నిర్మాణానికే అంకితం చేశాడు. 1956 నుంచి 1996 వరకు 40 సంవత్సరాల పాటు నాగండ్ల గ్రామానికి ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేశాడు. నిరాడంబరమైన, నిజాయితీతో కూడిన మచ్చలేని వ్యక్తిత్వంతో జీవించాడు. అజరామరమైన హేతువాద మానవవాద సాహిత్యాన్ని సృష్టించాడు.

ప్రారంభంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి ప్రభావం, తరువాత సుప్రసిద్ధ మానవవాద తత్వవేత్త ఎంఎన్ రాయ్ భావాల ప్రభావంతో వెంకటాద్రి అంతర్జాతీయ స్థాయి మానవవాద సాహితీవేత్తగా ఎదగడం విశేషం. ఛాందస మతభావాలు, ఫాసిస్టు రాజకీయాలు రాజ్యమేలుతున్న ఈ తరుణంలో రావిపూడి వెంకటాద్రి తన సాహిత్యం ద్వారా వెల్లడించిన హేతువాద మానవవాద భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు మనమర్పించే ఘనమైన నివాళి.

■ గుమ్మా వీరన్న
ఉపాధ్యక్షులు, భారత హేతువాద సంఘం

(జనవరి 21: రావిపూడి వెంకటాద్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com





బెంజిసర్కిల్ ఫ్లైఓవర్‌పై నిలిచిన వాహనాలు

అట్టహాసంగా..

బాణసంచా వెలుగులు.. లేజర్ కాంతుల నడుమ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వెయ్యి డ్రోన్ల ఇమేజ్ షోల మధ్య ప్రారంభం

- సీఎం రాకలో జాప్యం.. స్టేడియంలో సందర్శకుల అసహనం
- ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగానే.. జనం గోడదూకి జంప్
- ఆపలేక పోలీసుల నానా తంటాలు
- స్టేడియం పక్క రోడ్డులో తాగి పడేసిన మందు సీసాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నగరం నడిబొడ్డున అట్టహాసంగా జరిగింది. బాణసంచా వెలుగులు.. లేజర్ కాంతుల నడుమ.. వెయ్యి డ్రోన్ల ఇమేజ్ షోల మధ్య ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అంబేడ్కర్ 210 అడుగుల విగ్రహావిష్కరణ జరిగింది. శుక్రవారం రాత్రి పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో రూ.400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతి వనాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇందిరాగాంధీ స్టేడియంలో సామాజిక సమతా న్యాయసాధికార బహిరంగ సభ అనంతరం బస్సులో మంత్రులతో కలిసి వచ్చిన జగన్ స్వరాజ్య మైదానానికి చేరుకున్నారు. ఉత్తర ముఖంగా ఏర్పాటు చేసిన వేదికపై ముఖ్యమంత్రి జగన్, మంత్రులు కూర్చున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే ముందు విజయవాడ చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని వివరిస్తూ అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహ ప్రాశస్త్యంపై ఏవీని ప్రదర్శించారు. ఏవీని విగ్రహం దిగువన ఉన్న పెడెస్ట్రియల్‌కు అనుబంధంగా నిర్మించిన కాలచక్ర మహా మండపం గోడలపై ప్రదర్శించారు. అనంతరం లేజర్ షోను ఏర్పాటు చేశారు. జయహో గీతానికి లయబద్ధంగా లేజర్ షో జరిగింది. ఆ వెలుగు జిలుగుల మధ్య అంబేడ్కర్ విగ్రహం ధగధగలాడింది. ఆ తర్వాత వెయ్యి డ్రోన్లతో ప్రత్యేక లైటింగ్ షో నిర్వహించారు. గోదావరి బ్రిడ్జి, కొండారెడ్డి బురుజు, రామచిలుక, కూచిపూడి నాట్య దృశ్యాలు, రాజ్యాంగం పుస్తకం, అంబేడ్కర్ స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ వంటి చిత్రాలను డ్రోన్లు ఆవిష్కరించాయి. అంబేడ్కర్ విగ్రహం చెంతన భారీ ఎత్తున బాణసంచా పేల్చారు. దాదాపుగా పావు గంట పాటు సాగిన బాణసంచా కాల్పులతో అంబేడ్కర్ స్మృతివనం ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోయింది.

సీఎం రాక ఆలస్యంతో.. సందర్శకుల అసహనం

ఇందిరాగాంధీ స్టేడియంలో సామాజిక సమతా న్యాయ బహిరంగ సభను మధ్యాహ్నం 3 గంటలకు అన్నారు. కానీ అప్పటికి జన సమీకరణ జరగలేదని ముఖ్యమంత్రి సాయంత్రి 5 గంటల వరకు స్టేడియానికి రాలేదు. అప్పటికే నాలుగు గంటల పాటుగా వేచి ఉన్న సందర్శకులలో అసహనం కట్టలు తెంచుకుంది. స్టేడియం గేట్ల నుంచి బయటకు వచ్చారు. జనాన్ని పోలీసులు లోపలికి వెళ్లాలని ఒత్తిడి చేశారు. అయినా వినని పలువురు సందర్శకులు గోడదూకి బైటకు వెళ్లిపోయారు. ముఖ్యమంత్రి వచ్చే సమయానికి ఇతర జిల్లాల నుంచి బస్సుల్లో ఆ సమయానికి తరలించిన వారితో గ్యాలరీలు నింపారు. జగన్ మాట్లాడుతున్న సమయంలో మధ్యలోనే మైదానంలోని జనం వెళ్లపోసాగారు. జనం పలచన కావటం గ్రహించిన ముఖ్యమంత్రి అంతటితో తన ప్రసంగాన్ని ముగించి.. అందరూ విగ్రహావిష్కరణ రావాలని చెప్పారు. స్టేడియం నుంచి వచ్చే జనాలను పోలీసులు బందరు రోడ్డులో స్వరాజ్య మైదానం ఎదుట బారికేడింగ్ చేసిన ఏరియాలోకి మళ్లించారు. ఇలా మళ్లించిన జనానికి బస్సులో కూర్చుని అభివాదం చేసుకుంటూ సీఎం స్వరాజ్య మైదానానికి వచ్చారు.

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేళ అపచారం.. మందుబాటిల్స్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేళ అపచారం చోటు చేసుకుంది. జనాన్ని తరలించటం కోసం అధికార పార్టీ నాయకులు మందు బాటిల్స్ ఇచ్చి పంపటంతో.. పలువురు సందర్శకులు స్టేడియం పక్క రోడ్డులో తాగేసి వాటిని కిందపడేశారు.

నగరం అతలాకుతలం

- విజయవాడలో భారీగా ట్రాఫిక్ జామ్
- రహదారులను ఆక్రమించి పార్కింగ్
- సీఎంపై వాహనదారుల మండిపాటు
- ఫ్లై ఓవర్లపై నిలిచిన వాహనాలు

ఉదయం పది గంటలకే ఎక్కడికక్కడ బారికేడ్లు.. రహదారుల మూసివేతలు.. పోలీసుల ఆంక్షలతో బెజవాడలో వాహనదారులు ఉక్కిరి బిక్కిరయ్యారు. ఎటు వెళ్లాలో తెలీదు. ఎలా వెళ్లాలో అర్థం కాదు. ముందుకు కదల్లేక.. వెనక్కు మళ్లలేక.. వాహనాల మధ్యలో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించారు. సాయంత్రం నాలుగు గంటల తరువాత నుంచి సమస్య మరింత తీవ్రమైంది. రాత్రి పది గంటల వరకు ట్రాఫిక్ రద్దీ తగ్గలేదు. ఫ్లైఓవర్లు సైతం కిక్కిరిసిపోయాయి. బెంజిసర్కిల్, ఏలూరు రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డు, రామవరప్పాడు సెంటర్ మొత్తం ట్రాఫిక్ స్తంభించిపోయింది. - 6లో..



బందర్ రోడ్డులో వాహనాల రద్దీ



బస్సుల్లేక ఖాళీగా ఆర్టీసీ బస్టాండ్



వారధిపై నిలిచిన వాహనాలు

ఆకాశవాణి దగ్గర బారికేడ్లతో రోడ్డు బ్లాక్

ఉమ్మడి కృష్ణా జిల్లా వైసీపీ రాజకీయాలు హీటెక్కాయి. ఆ పార్టీ నుంచి కీలక నేతలు ఒక్కొక్కరూ దూరమవుతున్నారు. ఇప్పటికే గుడ్‌బై చెప్పిన వారిలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి ఉండగా ఇప్పుడు వారి సరసన తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి కూడా చేశారు. 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు అంటున్న సీఎం జగన్ ఓ దళిత ఎమ్మెల్యేనైన నన్ను నమ్మించి నట్టేట ముంచారు' అంటూ రక్షణనిధి ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క బయటకొచ్చేవారు టీడీపీ, జనసేన వైపు చూస్తున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీతో రక్షణనిధి తెగదెంపులు



వైసీపీ 4వ జాబితాలో రక్షణనిధికి బదులు తిరువూరు టికెట్‌ను ఎంపీ కేశినేని నాని అనుచరుడు స్వామిదాసుకు కేటాయించడంతో శుక్రవారం రక్షణనిధి విలేకరుల ముందుకొచ్చారు. వైసీపీతో తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. పార్టీ పెద్దలను కలిసే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. టికెట్ ఇస్తానని చివరి వరకు నమ్మించి తన గొంతు కోశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో తాను టీడీపీలో చేరనున్నట్టు పరోక్షంగా సంకేతాలిచ్చారు. 'వచ్చే ఎన్నికల్లో వైసీపీ టిక్కెట్ రానంత మాత్రాన ప్రజలకు దూరం కాలేను' అని అన్న రక్షణనిధి, నియోజకవర్గ ప్రజలు తనను టీడీపీ టికెట్ తెచ్చుకున్నా గెలిపిస్తామని అంటున్నారని తన భవిష్యత్తు రాజకీయ ప్రయాణాన్ని వివరించారు. రక్షణనిధి వ్యాఖ్యలతో ఆయన టీడీపీలో చేరడం దాదాపు ఖాయమని స్పష్టమవుతోంది. పోటీ చేసే సీటుపై స్పష్టత రాగానే ఆయన చేరిక ఉంటుందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ఒక్కొక్కరుగా..

- తాజాగా రక్షణనిధి గుడ్‌బై
- పార్టీ పెద్దలను కలిసే ప్రసక్తే లేదని స్పష్టం
- టీడీపీ వైపు అడుగులు..
- టికెట్ ఖరారైన వెంటనే ప్రకటన
- జనసేనానిని కలిసిన బాలశౌరి..
- మచిలీపట్నం నుంచే బరిలోకి
- పార్థసారథిని కలిసిన బుద్ధా, బొప్పన
- నూజివీడు

వైసీపీ నుంచి తప్పుకొంటున్న కీలక నేతలు

● పార్థసారథిని కలిసిన బుద్ధా, బొప్పన

పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథిని శుక్రవారం టీడీపీ నేత బుద్ధా వెంకన్న, వైసీపీని వీడిన బొప్పన భవకుమార్ కలిశారు. పార్థసారథి నివాసానికి వెళ్లిన వారు ఆయనతో సుమారు గంటసేపు భేటీ అయ్యారు. బీసీల పార్టీ అయిన టీడీపీలో పార్థసారథికి సముచిత స్థానం దక్కుతుందని ఈ సందర్భంగా వెంకన్న వ్యాఖ్యానించారు. సారథి టీడీపీలో చేరిక మరో రెండురోజులు వాయిదా పడింది. టీడీపీ అధినేత చంద్రబాబు అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి వెళుతుండటంతో సారథి 23న పార్టీ తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నాయి. నూజివీడు అసెంబ్లీ బరి నుంచి సారథి పోటీ చేయనున్నట్టు సమాచారం.



పార్థసారథితో బుద్ధా వెంకన్న, బొప్పన భవకుమార్

● బాలశౌరి మచిలీపట్నం నుంచే..

వైసీపీకి గుడ్‌బై చెప్పిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి శుక్రవారం హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. తన కుమారుడు అనుదీప్‌తో కలిసి ఆయన పవన్ నివాసానికి వెళ్లారు. ప్రముఖ సినీ నటుడు చిరంజీవితో బాలశౌరికి సన్నిహిత సంబంధాలున్నాయి. బాలశౌరి తనయుడు అనుదీప్ పెళ్లికి చిరంజీవి కుటుంబసమేతంగా హాజరయ్యారు. ఈ సాన్నిహిత్యం దృష్ట్యా బాలశౌరి వైసీపీని వీడాలని నిర్ణయించుకున్న తర్వాత జనసేన వైపు మొగ్గుచూపారు. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి ఆయన జనసేన అభ్యర్థిగా బరిలో నిలవడం దాదాపు ఖాయమైనట్లేనని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన తనయుడిని రాజకీయ అరంగేట్రం చేయించేందుకు బాలశౌరి సిద్ధమవుతున్నారు. ఆయన తనయుడు అనుదీప్‌కు అసెంబ్లీ టికెట్ కోసమూ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి కృష్ణా లేదా గుంటూరు జిల్లాల్లో జనసేనకు కేటాయించే అసెంబ్లీ స్థానాల్లో ఒకదాని నుంచి తన కుమారుడిని బరిలోకి దింపాలన్న యోచనలో బాలశౌరి ఉన్నారు.



జనసేన అధినేతతో ఎంపీ బాలశౌరి, ఆయన తనయుడు అనుదీప్

నందిగామ మున్సిపాలిటీ

పీఠం ఎవరిదో!

వరలక్ష్మి మృతితో కొత్తవారికి అవకాశం

- ఓర్సు లక్ష్మి, కృష్ణలలో ఒకరికి చాన్స్

- 6లో..

దుర్గమ్మకు భవానీల కానుకలు

4.08 కోట్లు



- 6లో..



దురగుడిలో కానుకల లెక్కింపు

దుర్గమ్మకు భవానీల కానుకల లెక్కింపు
రెండు రోజుల్లో రూ.4.08 కోట్లు

వన్‌టౌన్/విజయవాడ, జనవరి 19 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 3నుంచి 7వ తేదీ వరకు జరిగిన భవానీ దీక్షల విరమణకు వచ్చిన భక్తులు కనకదుర్గమ్మకు సమర్పించిన కానుకల లెక్కింపు పూర్తయింది. గురు, శుక్రవారాల్లో కానుకలను లెక్కించారు. రెండురోజుల్లో మొత్తంగా రూ. 4,08,64,534 నగదు లభించింది. బంగారం 358 గ్రాములు, వెండి 26కిలోల 425 గ్రాములు, విదేశీ కరెన్సీలో అమెరికా రూ. 248 డాలర్లు, ఓమన్ 16 రియాన్లు, కతార్ 109 రియాల్స్, ఆస్ట్రేలియా 75 డాలర్ల, సింగపూర్ 2 డాలర్లు యూఏఈ 40 ధీర్హమ్స్, కువైట్ 11.25 దీనార్లు, థాయిలాండ్ 140 బట్లు వచ్చాయి. ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

అన్నవితరణకు రూ. 1,00,116 విరాళం

దుర్గగుడిలో అన్నవితరణ కార్యక్రమానికి విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన సీతారాజ్యలక్ష్మి శుక్రవారం రూ. 1,00,116 విరాళం అందజేశారు. ఏఈవో రమేష్ ద్వారా విరాళం అందజేసి అమ్మవారిని దర్శించుకున్నారు.



జేసీకి తడిసి, రంగు మారిన ధాన్యం చూపుతున్న రైతులు

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

గురజాడ(పమిడిముక్కల), జనవరి 19 : తుఫాన్ వల్ల తడిసి రంగుమారిన ధాన్యం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసి ఆదుకోవాలని గురజాడ, తాండికి రైతులు జేసీ గీతాంజలి శర్మను కోరారు. గురజాడలో ఇథనాల్ ప్లాంట్ స్థల పరిశీలనకు శుక్రవారం గురజాడ వచ్చిన జేసీని పలువురు రైతులు కలిసి తడిసి రంగుమారిన ధాన్యం చూపించారు. ధాన్యం ఆన్ లైన్‌లో మిల్లర్లు తీసుకోపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు. ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న వైసీపీ నేతలు!

▸ టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు : కేశినేని శివనాథ్ (చిన్ని)



కంచికచర్ల/చందర్లపాడు, జనవరి 19 : నందిగామ నియోజకవర్గంలో వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, అధికారుల పక్షపాతధోరణితో టీడీపీ కార్యకర్తలను కేసుల్లో అక్రమంగా ఇరికిస్తున్నారని కేశినేని శివనాథ్ (చిన్ని) ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచికచర్లలో శుక్రవారం సీనియర్ నేత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ ఇంటి వద్ద పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కనుసన్నల్లో దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, న్యాయం చేయాల్సిన పోలీసులు వారికి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల టీడీపీ మహిళా నేతపై అభ్యంతరకర వీడియోలు ప్రదర్శించిన నిందితుడు కరీంపై కేసు పెడితే పట్టించుకోని పోలీసులు బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం అమానుషమన్నారు. మాజీ ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ, నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కూడా అవహేళనగా మాట్లాడటం దారుణమన్నారు.

వ్యక్తులు కాదు వ్యవస్థే ముఖ్యం.. చిన్ని వెంటే నాని అనుచరులు

పార్టీలో ఉన్నంత వరకే గౌరవిస్తాం.. ప్రాణంగా భావించే పార్టీని, అన్నలా భావించే అధినేతను దూషిస్తే సహిస్తామా.. ఇది నందిగామలో టీడీపీ నేతల మాట. మండలంలోని తుర్లపాడు గ్రామంలో కబడ్డీ పోటీల ప్రారంభానికి హాజరైన చిన్ని, మాజీ ఎమ్మెల్యే సౌమ్యలకు ముప్పాళ్ల గ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. ఇప్పటి వరకూ ఎంపీ కేశినేని వెంట ఉన్న నేతలు సమావేశానికి హాజరై పార్టీ పట్ల, అధినేత పట్ల నిబద్ధతను చాటుకున్నారు. పార్టీ నాయకుడై ఉన్నందునే తాము ఎంపీ కేశినేని వెంట నడిచామని, గీత దాటిన ఆయన్ను అనుసరించాల్సి అవసరం మాకు లేదని సదరు నేతలు స్పష్టం చేశారు. అధినేత ఎవరిని సూచిస్తే వారికి అనుకూలంగా పనిచేస్తామన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాష్ట్రాన్ని కాపాడడమే అందరి లక్ష్యమని చిన్ని అన్నారు. అనంతరం ముప్పాళ్ల నుంచి తుర్లపాడు వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

వైసీపీ వలస వెళ్లే రోజులొచ్చాయి : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్ : అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ నాయకులను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు తట్టా బుట్టా సర్దుకుని వలస పోయే రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడివాడలో జరిగిన 'రా కదలి రా' భారీ బహిరంగ సభకు వచ్చిన అశేష జనాన్ని చూసి వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. గుడివాడ నియోజకవర్గమే కాకుండా అన్ని నియోజకవర్గాల్లో చంద్రబాబు, జనసేన నాయకులకు ప్రజలు పట్టం కడుతున్నారన్నారు.

ఓటమి భయంతోనే పార్టీ వీడుతున్నారు : రవీంద్ర



మచిలీపట్నం టౌన్ : ఓటమి భయంతోనే వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం బందరులో విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పుట్టుకొచ్చిందని, కృష్ణాజిల్లాలో చాలామంది వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారన్నారు. సీఎం జగన్‌రెడ్డికి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కులేదన్నారు. బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌ల మధ్య రాజకీయ విభేదాలు సృష్టించేందుకు కొందరు పనిగట్టుకుని ప్రచారం చేయడం సబబుకాదన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి కృష్ణాజిల్లాలోని అన్ని సీట్లు గెలుచుకుంటాయన్నారు.

కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయండి : దేవినేని ఉమా



ఇబ్రహీంపట్నం : ఏపీలో జగన్మోహన్ రెడ్డి సైకో పాలనలో దళితులపై దాడి జరగని రోజు లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా టీడీపీ శ్రేణులు, ఎస్సీ సెల్ నేతలతో కలిసి శుక్రవారం ఉమా కొండపల్లి మున్సిపాలిటీలో అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేశారు. కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని, దళితులపై దమనకాండ ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రేవంత్‌రెడ్డి, సీతక్కలను చూసి నానీలు బుద్ధి తెచ్చుకోవాలి

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కలను చూసి విజయవాడ ఎంపీ కేశినేని నాని, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిలు బుద్ధి తెచ్చుకోవాలని మాజీమంత్రి ఉమా హితవు పలికారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, అంకుశం సినిమాలో రామిరెడ్డికి పట్టిన గతి గుడివాడ సెంటర్లో ప్రజలు ఎమ్మెల్యే నానికి పట్టిస్తారన్నారు. పార్టీ రంగు మారగానే కేశినేని నానికి పోలవరం గుర్తుకు వచ్చిందన్నారు. పట్టిసీమ, పోలవరం గురించి మాట్లాడే అర్హత నానికి లేదన్నారు.

బస్సులన్నీ బహిరంగ సభకే..

▸ ప్రయాణికులు విలవిల.. సిటీ బస్సుల్లేక తీవ్ర అవస్థలు

▸ నిర్మానుష్యంగా పీఎన్‌బీఎస్ ఆటోలకు డిమాండ్..

▸ రెండు రెట్లు అదనంగా ఛార్జీల వసూలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక సమతా సంకల్ప బహిరంగ సభకు జనాల కోసం బస్సులన్నీ తరలించడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 260 బస్సులు వినియోగించగా నగరంలో సిటీ బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీఎన్‌బీఎస్ వద్ద సిటీ టెర్మినల్‌లో బస్సుల కోసం గంటల తరబడి చూసినా రాకపోవటంతో చేసేదిలేక ఆటోలను ఆశ్రయించారు. ఆటోవాలాలు ప్రయాణికుల నుంచి రెట్టింపు ధర వసూలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2620కి పైగా బస్సులు బహిరంగ సభకు తరలడంతో.. బస్సులు లేక పీఎన్‌బీఎస్ బోసిపోయింది. రైల్వేస్టేషన్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆటోవాలాలు భారీగా రేట్లను పెంచేశారు. ప్రజలు బస్సులు దొరక్క నానా ఇబ్బందులు పడ్డారు. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలతో ఆటోలు కూడా ఎక్కడికక్కడ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోయాయి. కృష్ణాజిల్లా నుంచి 180 పైగా బస్సులు బహిరంగ సభకు వినియోగించడంతో విజయవాడ, మచిలీపట్నంల మధ్య అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.



విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద



పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..

▸ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారా

▸ అంగన్వాడీల కోసం ప్రత్యక్ష పోరాటానికి దిగుతాం

▸ మహిళలను ఇన్ని రోజులు రోడ్లపై కూర్చోబెడతారా

▸ యూనియన్ నేతలతో చర్చించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

▸ కార్యకర్తల దీక్షా శిబిరంలో పలువురు వక్తల ఉద్ఘాటన



బందరులో నిరాహార దీక్ష



విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళన

ధర్నాచౌక్, జనవరి 19: రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా, లేదా అని పలువురు నేతలు ప్రశ్నించారు. గత 39 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె, మూడు రోజులుగా నిరవధిక నిరహారదీక్ష చేస్తున్న అంగన్వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇన్ని రోజులుగా మహిళలను రోడ్లపై కుర్చో పెట్టడం మంచిది కాదని సీఎం జగన్‌కు హితవు పలికారు. స్థానిక ధర్నాచౌక్‌లో అంగన్వాడీలు చేపట్టిన నిరహారదీక్ష మూడవ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ దీక్షను సందర్శించిన పలు కార్మిక, ప్రజా సంఘాల నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక వైపు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ మరోవైపు ప్రజాస్వామిక విలువలకు పాతరేస్తూ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. సీఎం జగన్‌కు అంబేడ్కర్, దళితుల మీద ప్రేమ లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అధికంగా అందిస్తామన్న హామీని సీఎం జగన్ తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేదంటే తాము కూడా వారి పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగభూషణ, కె.ఉమామహేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర నేతలు సీహెచ్.నర్సింగరావు, యండీ.గఫూర్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు రమాదేవి, ఇఫ్టూ నేత ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ అఖిల భారత కార్యదర్శి ఎస్. వరలక్ష్మీ తదితరులు ప్రసంగించారు.

దిగిరాకపోతే ఆమరణ దీక్ష

▸ శిబిరంలోనే నిద్రించిన కార్యకర్తలు



శిబిరంలో నిద్ర



మచిలీపట్నం టౌన్ : ప్రభుత్వం దిగిరాకపోతే ఆమరణ దీక్షకు దిగుతామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ రాస్తారోకోలు, కలెక్టరేట్ సహా వివిధ కార్యాలయాలు ముట్టడిస్తామని అంగన్వాడీ కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తల సమ్మె 39వ రోజుకు చేరుకుంది. రిలే దీక్షల శిబిరంలోనే కార్యకర్తలు నిద్రిస్తున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా నాయకులు ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని, రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి రెజీనారాణి, నాయకురాలు లక్ష్మీ తదితరులు ప్రసంగించారు. అంగన్వాడీ కార్యకర్తల కోర్కెలు న్యాయ సమ్మతమని, ప్రభుత్వం కనీస వేతనం రూ. 26 వేలు పెంచాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

తానా కార్యదర్శిగా కసుకుర్తి రాజా ఎన్నిక



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఉత్తర అమెరికా తెలుగుసంఘం(తానా) కార్యదర్శిగా రాజా కసుకుర్తి ఎన్నికయ్యారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో జన్మించిన కసుకుర్తి రాజా విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నరేన్ కొడాలి ప్యానల్‌లో కసుకుర్తి రాజా కార్యదిర్శగా విజయం సాధించారు. కోశాధికారి, కో-ఆర్డినేటర్‌గా వివిధ పదవులు నిర్వహిస్తూ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు విదేశంలో అవసరమైన సహకారాన్నందించారు. అందరినీ కలుపుకుని తెలుగువారికి మరింత సేవలందించేందుకు కృషి చేస్తానని ఆయన ఫోన్‌లో తెలిపారు. కసుకుర్తి రాజా ఎన్నిక పట్ల ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

టీడీపీ, జనసేన నేతలపై కేసు నమోదు

గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు తులసీబాబు, యక్కలి మణిదీప్, కడియాల గణేష్, జనసేన నాయకులు సందు పవన్‌లతో పాటు మరికొందరు నాయకులపై సెక్షన్ 143, 188, 353 రెడ్‌విత్ 149 కింద కేసులను ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం గుడివాడ మండలం మల్లాయిపాలెంలో జరిగిన చంద్రబాబు 'రా..కదిలిరా' బహిరంగసభకు ర్యాలీగా బయలుదేరిన టీడీపీ, జనసేన నాయకులను పోలీసులు అడ్డుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బారికేడ్లను తొలగించిన నాయకులపై హెడ్ కానిస్టేబుల్ పళ్లెం కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గుండె జబ్బులకు ఆధునిక చికిత్సలు

▸ 21న విజయాస్ రవి హార్ట్‌కేర్ సెంటర్ ప్రారంభం : డాక్టర్లు శరత్‌బాబు, రవికుమార్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు, రవికుమార్

పాయకాపురం, జనవరి 19 : గుండెజబ్బు బారిన పడిన మధ్యతరగతి ప్రజలకూ ఆధునిక చికిత్స అందించాలన్న లక్ష్యంతో ఈ నెల 21 నుంచి విజయాస్ రవి హార్ట్‌కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు విజయ సూపర్ స్పెషాలిటీ హస్పటల్ సీఈవో డాక్టర్ జి.శరత్‌బాబు తెలిపారు. శుక్రవారం సూర్యారావుపేటలోని తమ హస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన దశాబ్దకాలం పైగా విజయ హస్పటల్ ద్వారా ఎంతోమందికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించామన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బుల సమస్య విపరీతంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని, అందుకోసం అన్ని వర్గాల వారికి అందుబాటులోకి అత్యున్నత స్థాయి విజయాస్ రవి హార్ట్‌కేర్ సెంటర్‌ను విశిష్ట నిపుణులైన వైద్యులచే ఈ నెల 21న లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సీనియర్ ఇంటర్‌నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో అన్నివర్గాల వారికి కరోనరి యాంజియోగ్రామ్ (గుండె రక్తనాళ పరీక్ష), కరోనరీ యాంజియోప్లాస్టి (స్టెంట్స్ అమర్చడం), పేస్ మేకర్ అమర్చడం, గుండె రంధ్రాలకు ఆధునిక డివైజ్ క్లోజర్ చికిత్స, బైపాస్ సర్జరీలు, వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు, బెలూన్ వాల్వోటమి తదితర ఆధునిక చికిత్సలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. తనతో పాటు బైపాస్ సర్జరీలు చేయడంలో అత్యంత ప్రావీణ్యం గల కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రశాంత్ ప్రభ నేతృత్వం వహిస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన జపాన్‌కు చెందిన షిమాడ్జు కేతలాబ్‌ను, అధునాతనమైన ఆపరేషన్ థియేటర్, కార్డియాక్ ఐసీయూ, పేషెంట్లకు అనుగుణంగా డీలక్స్ రూమ్‌లు వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, సీజీహెచ్ఎస్, అన్ని రకాల కంపెనీల రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంటుందన్నారు. మొదటి గంటలో గుండెపోటు సంభవించినప్పుడు వైద్యులను సంప్రదిస్తే 95శాతం పేషెంట్ రికవరీ అయ్యే చాన్స్ ఉందన్నారు. అనంతరం గుండె జబ్బులపై అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో హస్పటల్ చైర్మన్ జి.వెంకట్రావ్, డాక్టర్లు జి.శరత్‌బాబు, జి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నాని మాటపై నిలబడాలి.. : వెనిగండ్ల



గుడివాడ, జనవరి 19 : గుడివాడలో గురువారం జరిగిన 'రా...కదలిరా' బహిరంగ సభకు ఐదువేల మంది కూడా రారని చెప్పిన ఎమ్మెల్యే కొడాలి నాని యిచ్చిన మాటపై నిలబడాలని టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభను విజయవంతం చేసిన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చేసిన వాగ్దానానికి కట్టుబడి నాని ఊరు ఎప్పుడు వదిలిపోతున్నాడో తెలపాలని, లేదా తామే పంపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నాని, అతని అనుచరుల ద్వారా ఆస్తులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి తిరిగి యిప్పిస్తామని హామీ యిచ్చారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నగరం.. అతలాకుతలం!

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : రాత్రి ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ ఒక మాదిరిగా ఉంటుంది. తొమ్మిది గంటల తర్వాత కొంత వరకు రద్దీ తగ్గుతుంది. పది గంటలకు రహదారులపై ట్రాఫిక్ సాధారణంగా ఉంటుంది. ఇది బెజవాడలో నిత్యం కనిపించే పరిస్థితి. శుక్రవారం రాత్రి పది గంటలైనా రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఫ్లైఓవర్లు కిక్కిరిసిపోయాయి. పోలీసులు అమలు చేసిన ఆంక్షలు వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులను తెచ్చిపెట్టాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పలేదు. జాతీయ రహదారులతోపాటు నగర రహదారులపైనా ఇదే సీన్ కనిపించింది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి మొత్తం 2వేల బస్సులు విజయవాడకు చేరుకున్నాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ సభకు ఆయా జిల్లాల నుంచి జనాన్ని తీసుకొచ్చాయి. మొత్తం నాలుగు గంటల పాటు విజయవాడ వాసులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. విధుల నుంచి ఇళ్లకు వెళ్లేవారు, వ్యాపారులు, కూలీలు అందరికీ ట్రాఫిక్ నరకం చూపించింది.

అన్ని రహదారుల్లోనూ ఇదే పరిస్థితి

నగరంలో ఉన్న ట్రాఫిక్‌కు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాఫిక్ తోడవ్వడంతో రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. రామవరప్పాడు నుంచి స్క్యూబ్రిడ్జి వరకు రహదారి వాహనాలతో నిండిపోయింది. రోడ్డంతా కిక్కిరిసిపోయింది. బెంజ్‌సర్కిల్ రెండు ఫ్లైఓవర్ల పైనా ట్రాఫిక్ ఆగిపోయింది. విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే వారిదిపైనా ఇదే పరిస్థితి ఉంది. ఏలూరు రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలూ లేకపోయినా వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఇక్కడ చుట్టుగుంట నుంచి పడవలరేవు వంతెన జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా బస్సులను నిలుపుదల చేశారు.

ప్రయాణికులను మధ్యలో వదిలేసిన ఆటోలు

నగరంలో ఉన్న ట్రాఫిక్ రద్దీతో ఆటోవాలాలు కొత్త టెక్నిక్‌లు అమలు చేశారు. వాహనాల మధ్య ఆటోలు ఇరుక్కుపోవడంతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చలేదు. మార్గమధ్యలోనే ప్రయాణికులను దింపేశారు. ఈ తరహా ఘటనలు ఏలూరు రోడ్డు, బెంజ్‌సర్కిల్, పీసీఆర్ జంక్షన్లలో కనిపించాయి. చేసేదేమీ లేక ప్రయాణికులు ఇతర వాహనదారులను లిఫ్ట్ అడిగి వెళ్లాల్సి వచ్చింది. మొత్తంగా సీఎం జగన్ పర్యటన విజయవాడ వాసులకు చుక్కలు చూపించింది.

బందరు రోడ్డు బ్లాక్

అంబేడ్కర్ స్మృతివనరం ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా తరలించిన జనాల కారణంగా వారిని తీసుకువెళ్లడానికి బస్సులు రావటంతో.. దిగ్బంధమైపోయింది. బందరు రోడ్డు మీద వాహనాలను అనుమతించకపోవటంతో.. నగర ప్రజలు రాకపోకలు సాగించటానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతర్గత రోడ్లలో ముందుకు కదలటానికి గంటల సమయం పట్టింది. బహిరంగ సభ, విగ్రహావిష్కరణల అనంతరం కూడా నాలుగు గంటల పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు. బస్సులు ముందుకు కదలటానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పీఠం ఎవరిదో!

▸ నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ మృతితో ఖాళీ భర్తీ చేసేందుకు సన్నాహాలు

▸ ఎన్నికలపై నేతల దోబూచులాట



ఓర్సు లక్ష్మి



పాములపాటి కృష్ణ

నందిగామ, జనవరి 19 : మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి ఆకస్మిక మృతితో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు మునిసిపల్ అధికారులు రంగంసిద్ధం చేస్తున్నారు. సాధారణంగా చైర్‌పర్సన్ మరణిస్తే వైస్ చైర్మన్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మునిసిపాలిటీలలో రెండు వైస్ చైర్మన్ పోస్టులు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఆ ఇద్దరిలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారన్న అంశంపై చర్చ సాగుతోంది. పాలకవర్గం ఏర్పడిన సమయంలో ఏడో వార్డు నుంచి మాడుగుల నాగరత్నం, 15వ వార్డు నుంచి ఓర్సు లక్ష్మిలను వైస్ చైర్‌పర్సన్‌లుగా ఎంపిక చేశారు. కొద్దికాలం క్రితం నాగరత్నం మృతి చెందడంతో 1వ వార్డు నుంచి గెలుపొందిన పాములపాటి కృష్ణను ఆ స్థానంలో భర్తీచేశారు. చైర్‌పర్సన్ వరలక్ష్మి మరణంతో వైస్ చైర్‌పర్సన్‌లుగా ఉన్న ఓర్సు లక్ష్మి, పాములపాటి కృష్ణలపైనే పట్టణంలో విస్తృత చర్చ సాగుతుంది. ఈ ఇద్దరిలో ఎవరిని నియమిస్తారన్న ఆసక్తి నెలకొంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అధికార పార్టీకి ఈ ఎంపిక కత్తిమీద సాములాంటిదే అవుతుంది. ఓర్సు లక్ష్మి పట్టణంలో బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ కాగా, పాములపాటి కృష్ణ అదే స్థాయిలో బలమైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. పేరుకు ఆపద్ధర్మమే అయినప్పటికీ ఎక్కువ కాలం కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరణించిన వరలక్ష్మి, నాగరత్నంల వార్డులకు ఉపఎన్నికలు నిర్వహించిన తరువాతే చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈలోగా ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పైగా ఎన్నికల ముందు నియోజకవర్గానికి కీలకమైన నందిగామ పట్టణంలో ఉపఎన్నిక నిర్వహించే సాహసం అధికార పార్టీ చేయకపోవచ్చని ప్రజలు భావిస్తున్నారు. ఈ ఫలితం సాధారణ ఎన్నికలపై పడే అవకాశం ఉండటంతో ఉప ఎన్నికలకు తొందర పకడక పోవచ్చని భావిస్తున్నారు. దీంతో ఎక్కువ సమయం ఆపద్ధర్మ చైర్‌పర్సన్ కొనసాగే అవకాశం కనిపిస్తున్నది. నిర్ణయాధికారం మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులదే అయినప్పటికీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సూచనల మేరకే నియామకం జరుగుతుంది. దీంతో వారు ఎవరిని అందలం ఎక్కిస్తారో వేసి చూడాల్సిందే.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెడన, జనవరి 19 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొరిపర్తి నాగదుర్గాభవాని (36) శుక్రవారం ఉదయం భర్త నాగరాజుతో కలిసి బైక్‌పై మచిలీపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రిలో భర్తకు చికిత్స అనంతరం ఇరువురు బైక్‌పై దొడ్డిపట్ల గ్రామానికి బయలుదేరగా మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో పెడన-గుడివాడ రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో భవానీ బైక్‌పై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందింది. భవానీ తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ టి.సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్ వద్ద సూచికలు లేకపోవడంతోతరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

బిగ్ డేటా అండ్ హడూప్ ఎకో సిస్టమ్‌పై అవగాహన సదస్సు

భారతీనగర్, జనవరి 19: ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల సెమినార్ హాల్‌లో బిగ్ డేటా అండ్ హడూప్ ఎకో సిస్టమ్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీసీఎస్ కంపెనీకి చెందిన బిగ్ డేటా డెవలపర్ వై.నిఖిల్ పాల్గొని సీఎస్ఈ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బిగ్ డేటా అండ్ హడూప్ ఎకో సిస్టమ్ గురించి వివరించారు. డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాల స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా నిరసన


చిట్టినగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బేగ్ నిరసన


18వ డివిజన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతి

కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 19 : ఎన్నికల ముందు కోడి కత్తి డ్రామా ఆడించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆ కేసుల్లో జైల్లో మగ్గుతున్న కోడి కత్తి శ్రీనుకు న్యాయం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఎస్సీ సెల్ నేతలు కోడికత్తి కేసులో అన్యాయంగా బలైన శ్రీనుకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో దళితులపై హత్యలు, అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దళితులపై అరాచకాలకు పాల్పడుతూ మరో పక్క అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించి దళితులను మోస గిస్తున్నాడని విమర్శించారు. కోడికత్తి కేసులో జైల్లో మగ్గుతున్న శ్రీను కేసును వేగవంతంగా విచారించి నిజాలను నిగ్గుతేల్చి అతనికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, వింజమూరి సతీష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ నేతలు పాల్గొన్నారు.

దళితులను మోసగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి: ఎంఎస్ బేగ్

చిట్టినగర్: దళితులను జగన్మోహన్‌రెడ్డి మోసగిస్తున్నారని టీడీపీ నాయకులు ఎంఎస్. బేగ్ విమర్శించారు. కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని కోరుతూ టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చిట్టినగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడి జీవితాన్ని పణంగా పెట్టి జగన్మోహన్‌రెడ్డి తన రాజకీయ ప్రయోజనం నెరవేర్చుకున్నారన్నారు. ఇప్పుడు కోర్టుకు హాజరు కాకుండా దళిత యువకుడైన శ్రీనుని శాశ్వతంగా జైల్లోనే ఉంచే కుట్ర చేస్తున్నారన్నారు. ఎన్నికలు రాబోతున్న ఈ సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్నిచూపి దళితులను మరోసారి మాయ చేయడానికి సిద్ధం అయ్యారన్నారు. నీ మాయలో దళితులు చిక్కుకోరని అంబేడ్కర్ విగ్రహం చూపి ఓట్లు వేయించుకునే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. వెంటనే దళిత యువకుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఎర్ర రామారావు, ప్రధాన కార్యదర్శి బడుగు వెంకన్న, కొలగాని అశోక్, మైలవరపు రాజు. గద్దల ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా నిరసన

దీక్షలకు జనసేన మద్దతు

వన్‌టౌన్: కోడికత్తి శ్రీను, అతని తల్లి న్యాయం కోసం చేస్తున్న దీక్షలకు జనసేన మద్దతు ఇస్తోందని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు సీఎం జగన్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు, నాదెండ్ల మనోహర్‌ల దృష్టికి శ్రీను, అతని తల్లి పడుతున్న వేదనను తీసుకు వెళతామన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

రాణిగారితోట: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై అనేక దాడులు చేస్తూ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సిగ్గు చేటని 18వ డివిజన్ రాణిగారితోట నాయకులు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం దళితులపై చేస్తున్న దాడులకు నిరసనగా డివిజన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించిన జగన్‌మోహన రెడ్డి విదేశీ విద్య దీవెన పథకానికి అంబేడ్కర్ పేరు తీసివేయడం దారుణమన్నారు. కోడికత్తి శ్రీను దళితుడైనందుకే జైలు నుంచి బయటకు రాకుండా చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ఈ రోజు దళితులపై ప్రేమ ఉన్నట్లు నటిస్తూ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించడం అన్యాయమని, ఆయనకు విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు లేదని అన్నారు. డివిజన్ అధ్యక్షులు వేముల దుర్గారావు, ప్రసాద్, శాంతిబాబు, పీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

సత్యనారాయణపురం, జనవరి 19: వేమన పద్యాలు, శతకాలలోని నీతిని జీవితంలో అనుకరించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని గ్రంథాలయాధికారి సంపత్ కుమార్ అన్నారు. సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ప్రజాకవి యోగి వేమన 657వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వేమన చిత్రపటానికి సంపత్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదాయనికి హత్తుకునేలా చెప్పాడన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో వేమన రాసిన తెలుగు పద్యాలు ప్రతీ ఒక్కరికి సుపరిచితాలు అన్నారు. విద్యార్థులకు వేమన నీతి పద్యాలను వివరించారు. అనంతరం వేమన నీతిపద్యాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్

టీడీపీ కార్యకర్త వైద్యానికి ఆర్థికసాయం

మధురానగర్, జనవరి 19: మధురానగర్ 29వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తకు ఆ పార్టీ డివిజన్ కమిటీ ఆర్థికసాయం చేసింది. సాయిబాబా కాలనీ రెండో లైనులో ఉంటున్న కాకర్ల సురేష్ అనే కార్యకర్త ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. ఇతనికి వైద్య సాయం నిమిత్తం రూ.20వేలను అందించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వీవీఆర్, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు సింగం వెంకన్న, మాజీ సెక్రటరీ అంగిరేకుల రాంబాబు, బాబు, వెంపటాపు ప్రసాద్, కనకాల లక్ష్మీనారాయణ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

కాపులకు పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం కాపు సామాజిక వర్గానికి పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు కోరారు. సంఘం 64వ డివిజన్ అధ్యక్షురాలిగా శెట్టిపల్లి జయశ్రీ నియమితురాలైన సందర్భంగా శుక్రవారం సింగ్‌నగర్‌లోని కార్యాలయంలో ఆమెకు అంజిబాబు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా ఐక్యమత్యంగా ఉండి కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.


నియామకపత్రాన్ని అందిస్తున్న అంజిబాబు

బార్‌లపై కొరవడిన పోలీసుల నిఘా

● నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు ● మద్యం మత్తులో కొట్టుకుంటున్న మందుబాబులు

విద్యాధరపురం, జనవరి 19: భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బార్‌లపై పోలీసుల నిఘా కొరవడింది. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో ఉన్న బార్, బైపాస్ రోడ్డులో ఉన్న బార్‌తో పాటు మరికొన్ని బార్‌లు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలపాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మాముళ్లకు అలవాటు పడ్డ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రాంచ్ (ఎస్ఈబీ) అధికారులు, సిబ్బంది చూసీ చూడ నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సమయాలను పాటించకుండా మద్యం అమ్మకాలు చేస్తున్నారని, వేకువ జాము నుంచే మందుబాబులు ఈ బార్‌ల వద్దకు చేరుతున్నారంటే అప్పటికే విక్రయాలు జరుగుతున్నాయని అర్థమవుతున్నదని స్థానికులు అంటున్నారు. సాధారణంగా ఉదయం 10 గంటల నుంచి బార్‌లు తెరవాల్సి ఉండగా, అంతకు ముందే బార్‌కు ఉన్న పక్క మార్గాల నుంచి మందు విక్రయిస్తున్నారంటున్నారు. మరో పక్క ఎక్కువ ధరలకు కూడా విక్రయిస్తున్నారంటున్నారు.

బార్‌లలో చిత్తుగా తాగిన మందుబాబులు ఏ కారణాలు లేకుండానే వాదులాటలకు దిగడం, కొట్టుకోవడం జరుగుతోందని, ఎక్కడా లేని న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పోలీసుల నియంత్రణ కొరవడడంతో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయంటున్నారు. ఇటీవల ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో ఉన్న బార్‌లో మద్యం మత్తులో మందుబాబులు పరస్పరం దూషించుకుని ఘర్షణకు దిగారు. బైపాస్ రోడ్డులో ఉన్న బార్‌లో కూడా అదే తంతు. సమాచారం తెలిసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బార్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఎన్ఎస్ఈజేఎస్ పరీక్షలో జాగృతి ప్రతిభ

లబ్బీపేట, జనవరి 19: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎన్ఎస్ఈజేఎస్ పరీక్ష ఫలితాల్లో మొగల్రాజపురంలోని నారాయణ సీవో పాఠశాల 10వ తరగతి విద్యార్థి సంగ జాగృత్ ప్రతిభ కనబరిచి ఐఎన్‌జేఎస్‌వో-2024 సెకండ్ లెవల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సూరయ్య తెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ కార్యాలయం కో- ఆర్డినేటర్ రవికుమార్, డీన్ కేఎస్ ఏజీఎం మురళీ కిషోర్, ఆర్ఐ రామారావు, ఒలింపియాడ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందించారు.

వేమన పద్యాల పోటీలు

విజయవాడ కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ, ఆంధ్రా లయోల కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేమన జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. విద్యార్థులకు వేమన పద్యాల పోటీలను నిర్వహించారు. వాటిని రాగయుక్తంగా యువతీ యువకులు ఆలపించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ జి. కిరణ్‌కుమార్, వేమన జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సీతారామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోపాల్, కృపారావు పాల్గొన్నారు.


బ్యారేజీపై కనిపించిన గంజాయి బాక్స్‌లు

బ్యారేజీపై గంజాయి అట్టపెట్టెలు

వన్‌టౌన్, జనవరి 19: బ్యారేజీపై శుక్రవారం రెండు అట్టపెట్టెలలో ప్యాకింగ్ చేసిన గంజాయి పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని వివరాల ఆరా తీస్తున్నారు. బాహాటంగా గంజాయి ఉన్న రెండు అట్టపెట్టెలు పడి ఉండడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే చెక్‌పోస్టుల వద్ద ఉన్న తనిఖీ అధికారుల కళ్లు గప్పి భారీ ఎత్తున అట్టపెట్టెలలో ప్యాకింగ్ చేసిన గంజాయిని తరలిస్తుండగా జారీ పడి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు, కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, జనవరి 19: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరాలయంలో శుక్రవారం సందర్భంగా భక్తుల రద్దీ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. ఒక దశలో క్యూలన్నీ నిండిపోయాయి. సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు పలువురు భక్తులు చండీ హోమం, నవావరణార్చన,లక్ష కుంకుమార్చన తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆశీస్సులు అందుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా కొండపైకి ఘాట్‌రోడ్డు ద్వారా వెళ్లే వాహనాలను కూడా నియంత్రించారు.

ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంచర్ల

తిరువూరు, జనవరి 19: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణ ప్రముఖుడు, సీనియర్ న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్ ఎంపికయ్యారు. జంగారెడ్డిగూడెంలోని కార్యాలయంలో శుక్రవారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామసత్యనారాయణ నుంచి ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఆయన వెంట పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు బొడ్డు ప్రకాశరావు, సోమవరపు సత్యనారాయణ ఉన్నారు.

బాధపెట్టాం... క్షమించండి



నయనతార

నయనతార 'అన్నపూరణి' వివాదం ఇంకా సద్దుమణగలేదు. కథ రీత్యా ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా వున్నాయంటూ పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నయన్‌తో సహా చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబయ్‌ల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి . దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించడంతోపాటు వివరణ కూడా ఇచ్చుకుంది. ఇదిలా వుంటే.. రీసెంట్‌గా 'అన్నపూరణి' వ్యవహారంపై నయనతార భావోద్వేగపూరితంగా సోషల్ మీడియా ద్వారా ఓ లేఖను విడుదల చేశారు. 'బరువెక్కిన హృదయంతో ఈ లెటర్‌ను రాస్తున్నాను. నిజానికి 'అన్నపూరణి ' మంచి ప్రయత్నం. ఓ మంచి ఆలోచన ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం. సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు అనే మంచి విషయాన్ని ఈ సినిమా ద్వారా చర్చించాం. కానీ ఈ ప్రయత్నంలో తెలీకుండానే కొందరి మనసుల్ని బాధపెట్టాం. ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. మనోభావాలు దెబ్బతీయడం మా అభిమతం కాదు. నా 20 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ బాధపెట్టలేదు. సానుకూలంగానే ముందుకెళ్లాను. సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాను ఓటీటీ నుంచి తొలిగిస్తారని అనుకోలేదు. తెలిసో తెలియకో కొందరిని బాధపెట్టాం. క్షమించమని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాం' అంటూ సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు నయనతార. ఇక 'అన్నపూరణి' కథ విషయానికొస్తే.. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా రూపొందింది. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

బుక్ మై షోకు ఫిర్యాదు చేశాం



నాగవంశీ

'కొంతమంది కావాలనే బుక్ మైషోలో నకిలీ రివ్యూలు ఇచ్చి, 'గుంటూరు కారం' సినిమాను దెబ్బతీయాలని చూశారు. దానిపై ఆ సంస్థకు ఫిర్యాదు చేశాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'గుంటూరు కారం' విజయాన్ని అడ్డుకోవాలని కొందరు మొదటి రోజు నుంచే 'సినిమా బాగోలేద'ని సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పడానికి మా సినిమాకు వస్తున్న వసూళ్లే నిదర్శనం. ఆ విషయం చెప్పడానికే మీడియా ముందుకొచ్చాను' అని నిర్మాత నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. తొలి వారాంతానికే రూ. 200 కోట్ల వసూళ్లను సాధించి బాక్సాఫీసు దగ్గర నిలకడగా కొనసాగుతోందని. నాగవంశీ మీడియాతో ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

- మహేశ్‌బాబు మొదట్నుంచి ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నారు. నెగెటివ్ రివ్యూలు వచ్చినా ఆయన ఆందోళన చెందలేదు. 'రేపటి నుంచి 'గుంటూరు కారం' వసూళ్లు ఎలా ఉంటాయో చూడండి' అన్నారు. ఆయన అంచనాలే నిజమయ్యాయి. మహేశ్ ధైర్యమే ఈ స్థాయి వసూళ్లకు కారణమైందనుకుంటున్నాను.
- 'గుంటూరుకారం' సినిమా కొంతమంది మీడియా వాళ్లకు లక్ష్యంగా మారింది. డిస్ట్రిబ్యూటర్లకు, థియేటర్లకు ఫోన్ చేసి మరీ వసూళ్ల గురించి ఆరా తీస్తున్నారు. వాళ్లు ఎన్ని విధాలా ప్రయత్నించినా, నెగెటివ్ రివ్యూలు ఇచ్చినా సినిమా ఫలితాన్ని దెబ్బతీయలేకపోయారు. రిలీజైన తొలి రోజే సోషల్ మీడియా ద్వారా సినిమా బాగోలేదనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. కానీ సినిమా బాగుండడంతో ప్రేక్షకులు వాటన్నింటినీ పక్కనపెట్టి అఖండ విజయాన్ని అందించారు. కుటుంబ ప్రేక్షకులకు మా సినిమా బాగా నచ్చడం వల్లే ఈ స్థాయి వసూళ్లు వస్తున్నాయి. గతంలో మా బేనర్‌లో వచ్చిన చిత్రాలకు నెగెటివ్ రివ్యూ వచ్చినప్పుడు వసూళ్లు పడిపోయాయి. కానీ ఈ సారి మాత్రం వాటితో సంబంధం లేకుండా 'గుంటూరు కారం' భారీ వసూళ్ల దిశగా సాగుతోంది. కొందరు కావాలనే మా సినిమాను టార్గెట్ చేశారనే అభిప్రాయం ఉంది.
- దీనిని ఫ్యామిలీ సినిమాగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లి ఉండాల్సింది. ఇది త్రివిక్రమ్ శైలిలో ఉండే ఫ్యామిలీ సినిమా అని ప్రేక్షకులకు ముందే తెలియజెప్పలేకపోయాం. దీనివల్ల 'గుంటూరు కారం' పక్కా మాస్ ఫిల్మ్ అని అభిమానులు అనుకున్నారు. అందువల్ల మొదట్లో కొంత నిరాశ చెందినా సర్దుకున్నారు.



పుట్టిన రోజు ప్రత్యేక వీడియో

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. వరుణ్‌తేజ్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మేకర్స్ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రంలో గ్యాంబ్లింగ్ మాఫియా అధిపతిగా వరుణ్ కనిపించనున్నారు. వీడియోలో సిగార్ తాగుతూ స్టైలిష్ లుక్‌లో ఆయన ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో నోరా ఫతేహీ, మీనాక్షి చౌదరి హీరోయిన్లు. నవీన్‌చంద్ర, సత్యం రాజేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ మాట నిలబెట్టుకోవాలి

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

సంక్రాంతి సినిమా వార్ ముగిసింది అనుకునేలోపే రాబోతున్న ఫిబ్రవరి వార్‌కి సంబంధించిన సెగలు అప్పుడే మొదలయ్యాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు ఫిల్మ్‌ఛాంబర్‌కి రాసిన లేఖ.. వార్ మొదలవ్వకముందే వాతావరణం వేడెక్కేలా చేసిందని చెప్పాలి. నిజానికి పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన రవితేజ 'ఈగల్' సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సింది. కానీ అప్పటికే నాలుగు సినిమాలు పోటీలో ఉండటం, తద్వారా తలెత్తే థియేటర్ల కొరత.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని 'ఈగల్'ని ఫిబ్రవరికి వాయిదా వేసుకోవలసిందిగా ఛాంబర్ కోరింది. ఫిబ్రవరిలో సోలో డేట్ వచ్చేలా చూస్తామని ఫిల్మ్ ఛాంబర్ మాటివ్వడంతో.. పీపుల్‌మీడియా సంస్థ 'ఈగల్'ని ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఇదిలావుంటే.. ఇప్పుడు అదే తేదీకి రజనీకాంత్ 'లాల్ సలామ్', సందీప్‌కిషన్ 'ఊరి పేరు భైరవకోన' చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని సదరు చిత్రాల నిర్మాతలు ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో 'సోలో డేట్ ఇస్తాం' అని మాటిచ్చిన ఛాంబర్, తన మాటను నిలబెట్టుకోవాలని, తమకు సోలో డేట్ వచ్చేలా సహకరించాలని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లేఖ రాసింది. మరి ఈ విషయంపై ఛాంబర్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఇక 'ఈగల్' విషయానికొస్తే రవితేజ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలు.



శేఖర్ కమ్ముల సినిమాలా...

'కేరింత' ఫేమ్ పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. హర్షవర్ధన్ కీలకపాత్ర పోషించారు. ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను నటుడు శివాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇది నా మొదటి సినిమా. సరికొత్త కథాంశంతో తెరకెక్కిస్తున్నాం' అన్నారు. చక్కటి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించామని నిర్మాత చెప్పారు. 'మార్కెట్ మహాలక్ష్మి' సినిమా చూస్తుంటే శేఖర్ కమ్ముల సినిమాలు గుర్తుకొచ్చాయని నిర్మాత బెక్కం వేణుగోపాల్ చెప్పారు.

అది నా అదృష్టం



వీకే నరేశ్

నటుడిగా 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అని వీకే నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ.. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే నటుడిగా సుదీర్ఘ కెరీర్ సాధ్యమైందని చెప్పారు. జీవితాంతం పరిశ్రమకు సేవ చేస్తానని పేర్కొన్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి సినిమాల మధ్యనే పెరగడం వల్ల ఇదే తన జీవితం కావాలని కోరుకున్నానని చెప్పారు. తొమ్మిదో ఏట 'పండంటి కాపురం' లాంటి చిత్రంతో బాలనటుడిగా అరంగేట్రం చేయడం, ఎన్టీఆర్ లాంటి గొప్ప నటులతో కలసి పనిచేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభవం అని తెలిపారు. ఒక్క సినిమాలో హీరోగా నటించినా చాలు అనుకున్న తనకు ప్రేక్షకులు ఇంత సుదీర్ఘ సినీ కెరీర్‌ను ఇచ్చారని, వారికి రుణపడి ఉంటానని అన్నారు. నంది పురస్కారాలను అందించకపోవడంపై నరేశ్ స్పందిస్తూ 'నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమలో చాలా గౌరవంగా, ఒక గుర్తింపుగా భావిస్తారు. కానీ ఇప్పుడు ఆ పురస్కారాలను ప్రభుత్వాలు అందజేయకపోవడం చాలా బాధాకరం. దీనివల్ల ఒక తరం నటీనటులకు అసలు నంది పురస్కారాలు అంటే తెలిసే అవకాశం కూడా లేకుండా పోతుంది. నంది పురస్కారాలు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వాలు మళ్లీ పునరుద్ధరించాలి' అని కోరారు. 'సేవాభావంతోనే నేను రాజకీయాల్లోకి వెళ్లాను, కానీ అక్కడ మారిన పరిస్థితుల్లో ఇమడలేక బయటకు వచ్చాను, మళ్లీ ఆ వైపు వెళ్లే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు' అని నరేశ్ తెలిపారు. రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రూపొందే సినిమా తెలుగు పరిశ్రమ ఖ్యాతిని మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. నటుడిగా తనని తాను కొత్త కోణంలో ఆవిష్కరించుకొనే పాత్రలు మరిన్ని వస్తున్నాయనీ, నెగెటివ్ రోల్స్ చేయాలనుందని ఆయన చెప్పారు.

వేసవిలో ఎగిరే పతంగ్



గాలి పటాల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. ప్రణవ్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో గాయకుడు ఎస్పీ చరణ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం పోస్టర్ విడుదల చేశారు. హీరోలిద్దరూ గాలి పటాలు ఎగరేస్తూ పోటీ పడుతుంటే హీరోయిన్ వారిని చూస్తూ నవ్వుకుంటున్న ఈ పోస్టర్ అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్‌శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి మాట్లాడుతూ 'సికిందరాబాద్ బస్తీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న యూత్‌ఫుల్ ఫిల్మ్ ఇది. సినిమాలో ప్రతి సన్నివేశం సహజంగా ఉంటుంది' అని తెలిపారు.

పాటల పొట్టేల్



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా రూపొందిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగే నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా 'నగిరో..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలి పాటను శుక్రవారం చిత్రబృందం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాయగా, శేఖర్‌చంద్ర స్వరపరిచిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం తెలిపింది. గాయనీగాయకులైన అనురాగ్ కులకర్ణి, ఆర్.లాలస గానం శ్రోతల్ని మెస్మరైజ్ చేయడం ఖాయమని, విజువల్ పరంగా కూడా ఈ పాట అద్భుతంగా ఉంటుందని, యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్లల కెమిస్ట్రీ చూడముచ్చటగా ఉంటుందని మేకర్స్ చెప్పారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వీ చౌదరి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు.

ఒకటే షాట్.. 105 మినిట్స్!



హన్సిక హీరోయిన్‌గా నటించిన చిత్రం '105 మినిట్స్' ఈ నెల 26న విడుదల కానుంది. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలో పోషించిన పాత్ర గెటప్‌లోనే హన్సిక వేదికపైకి వచ్చి ట్రైలర్‌ను విడుదల చేయడం విశేషం. ఒకే పాత్రతో, ఒకటే షాట్‌లో చిత్రీకరించిన తొలి ప్రయోగాత్మక చిత్రం ఇది. ఈ సందర్భంగా చిత్రం కో ప్రొడ్యూసర్ సుమన్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా తీయడానికి నిర్మాతకు గట్స్ కావాలి. అందుకే నిర్మాత బొమ్మక్ శివను అభినందిస్తున్నాను. మంచి కంటెంట్ ఉన్న ఈ చిత్రాన్ని మొదట తెలుగులో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసి, తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. 'నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు. ఈ కథ విని హన్సికగారు అంగీకరిస్తారా లేదా అనే అనుమానం ఉండేది. కానీ ఆమె సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశారు. మాంక్ ఫిల్మ్స్ సుమన్‌గారు ఈ సినిమా విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు రాజు దుస్సా. హీరోయిన్ హన్సిక మాట్లాడుతూ 'ఇది కంప్లీట్ ఎక్స్పరిమెంటల్ ఫిల్మ్. ఈ సినిమాకు నన్ను ఎన్నుకోవడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.



మూడు భాషల్లో 'బాబు'

అర్జున్ కల్యాణ్, కుషిత కల్లాపు జంటగా నటించిన చిత్రం 'బాబు'. నంబర్ వన్ బుల్ షీట్ గై అనేది ట్యాగ్ లైన్. లక్ష్మణ్ వర్మ దర్శకత్వంలో దండు దిలీప్‌కుమార్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. విలాసం కంటే అవసరం గొప్పది అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రం ఇదనీ, ఫ్యామిలీ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సిదమైన ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో ఎంఎల్ఆర్, సోనాలి, మురళీధర్ గౌడ్, భద్రం, జబర్దస్త్ అప్పారావు, రవివర్మ, సునీత, మనోహర్, అశోక్‌వర్ధన్, భద్రి జార్జి ఇతర ముఖ్య తారాగణం. సంగీతం:: పవన్, ఛాయాగ్రహణం: పీఎస్ మణికర్ణన్, ఎడిటింగ్: డి.వెంకటప్రభు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
9
శనివారం • 20 జనవరి 2024



కూరలు, మసాలా కర్రీలు, మాంసాహారం.. ఎన్ని తిన్నా.. ఏమాటకి ఆ మాట చెప్పుకోవాలి కానీ.. ఈ రోటి పచ్చడి కథే వేరు. అన్నం, దోశలోకి కొద్దిగా రోటి పచ్చడి వేసుకుని తింటే.. ఆ రుచి అదరహో. ఈ వీకెండ్‌లో దొండకాయ రోటి పచ్చడి, కంద రోటి పచ్చడి, కాల్చిన వంకాయల రోటి పచ్చడి, పండు మిరపకాయల రోటి పచ్చడిని సులువుగా ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం.

రోటి పచ్చడి... కచ్చా పచ్చా!



దొండకాయ రోటి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

దొండకాయ ముక్కలు- 300 గ్రాములు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, మీడియం సైజ్ ఉల్లిపాయ- 1 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), చిన్న టమోటాలు- 3, పచ్చిమిర్చి-8 (సగానికి కట్ చేయాలి), వేయించిన పల్లీలు- ఒకటిన్నర టేబుల్ స్పూన్, వెల్లుల్లి- 4, చింతపండు రసం- టేబుల్ స్పూన్, ఉప్పు- కొద్దిగా, పసుపు- తగినంత

తయారీ విధానం

ఒక గుంత ప్యాన్‌లో నూనె వేసి దొండకాయ ముక్కలు, టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి వేసి మీడియం ఫ్లేమ్‌లో అవి మగ్గేవరకు కనీసం పది నిముషాలు కుక్ చేయాలి. మధ్యమధ్యలో చూసుకుంటూ మగ్గేంత వరకూ కుక్ చేయాలి. వీటిని ప్లేట్‌లో పక్కన ఉంచుకోవాలి.

రోలులో వేయించుకున్న దొండకాయ, టొమాటో, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలను వేసి దంచాలి. వేయించిన పల్లీలు, వెల్లుల్లి వేసి దంచాలి. ఇందులో ఉప్పు, పసుపును రుచికి తగినట్లు వేసుకుని రుబ్బాలి. చివరగా పల్లీలు వేసి ఆ తర్వాత చింతపులుసు వేసి దంచాలి. మిశ్రమంలోకి బాగా పడుతుంది. అవసరం అనుకుంటా ఈ పచ్చడిని పోపు వేసుకోవచ్చు. అన్నంలోకి, దోశ, చపాతీలోకి బావుంటుంది ఈ దొండకాయ పచ్చడి.



కంద రోటి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

శుభ్రపరచిన కందగడ్డ ముక్కలు- 300 గ్రాములు, ఎండుమిర్చి- 6, ఇంగువ- తగినంత, ఆవాలు- కొద్దిగా, శనగలు- అరటీస్పూన్, మెంతులు- కొద్దిగా, మినప్పప్పు- అరటీస్పూన్, చింతపండు గుజ్జు- రెండు స్పూన్లు, నూనె- 4 టీస్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, పసుపు- కొద్దిగా, ఉల్లిపాయ- 1 (చిన్న ముక్కలుగా తరగాలి), టొమాటో- 1 (చిన్న ముక్కలుగా తరగాలి)

తయారీ విధానం

శుభ్రపరచిన కంద ముక్కలను బియ్యం కడిగిన నీళ్లలో నానబెట్టాలి. ఇలా చేస్తే కంద వల్ల దురదరాదు. ఇలా పది నిముషాల పాటు నానబెట్టాలి. ఒక ప్యాన్‌లో సరిపడ నూనె వేసి కంద ముక్కలను పదిహేను నిముషాల పాటు వేయించాలి. మెత్తగా అవుతాయి. ఆ కంద ముక్కలను పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు, టొమాటో ముక్కలను వేయించాలి. చివరగా అదే ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి శనగలు, ఆవాలు, మెంతులు, మినప్పప్పును వేయించుకోవాలి. రోటిలో కంద ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, టొమాటో ముక్కలు వేసి కచ్చాపచ్చాగా నూరాలి. ఇందులోకి సరిపడ ఉప్పు, పసుపు వేసి నూరాలి. చివరగా పోపు మిశ్రమాన్ని వేసి నూరాలి. కంద పచ్చడి రెడీ. అన్నంలో లేదా దోశలోకి బాగుంటుంది.


కాల్చిన వంకాయ రోటి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

మీడియం సైజ్ పచ్చ వంకాయలు- 4, టొమాటోలు- 3 (చిన్నవి), ఉల్లిపాయ- 1, పచ్చిమిర్చి- 6, చింత పులుసు- టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, పసుపు- చిటికెడు

తయారీ విధానం

స్టవ్‌మీద రోటీ గ్రిల్ ఉంచి దాని మీద వంకాయలను పైన పొట్టు నల్లగా అయ్యేంత వరకు కాల్చుకోవాలి. వీటిని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయ, టొమాటోలు, పచ్చిమిర్చి కాల్చుకోవాలి. వీటిమీద ఉండే నల్లటి పొట్టు వల్చేయాలి. రోటిలో ఉల్లిపాయ, టొమాటో, పచ్చిమిర్చి వేసి దంచాలి. ఆ తర్వాత వంకాయలను వేసి దంచాలి. ఇందులో పసుపు, చింత పులుసు, ఉప్పు వేసి దంచాలి. ఈ కచ్చా పచ్చా వంకాయల రోటి పచ్చడి స్టైల్ అద్దిరిపోతుంది. దీన్ని బౌల్‌లో వేసుకుని తాజాగా సర్వ్ చేసుకోవటమే తరువాయి. అన్నంలోకి రుచిగా ఉంటుంది.



పండు మిరపకాయల రోటి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

పండు మిరపకాయలు- 12, టొమాటోలు- 3 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), ఉల్లిపాయ-1 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), కరివేపాకు- కొద్దిగా, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, ధనియాలు- అరటీస్పూన్, జీలకర్ర- అరటీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు- 6, చింతపండు- కొద్దిగా, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి సరిపడ

తయారీ విధానం

ప్యాన్‌లో నూనె వేసి అందులో పండు మిరపకాయలను వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు, జీలకర్ర, ధనియాలు, వెల్లుల్లి రెబ్బలు, చింతపండు వేసి వేయించాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నూనె జతచేయాలి. ఈ మిశ్రమాన్ని రోటిలో వేసి దంచాలి. చివరగా ఉప్పు, పసుపు వేసి దంచాలి. ఈ పండు మిరపకాయల పచ్చడిని అవసరం అనుకుంటే పోపు పెట్టుకోవచ్చు. ఈ పచ్చడిని అన్నంతో తింటే ఎంతో రుచిగా ఉంటుంది.



మేకప్

మెలకువలతో మెరుపులీనొచ్చు

మేకప్ అవసరం ప్రతి రోజూ ఉండకపోయినా, అవసరం పడినప్పుడు వేసుకునే మేకప్‌లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలి. అందుకోసం మేకప్ వేసుకునే విధానం మీద అవగాహన పెంచుకోవాలి.

చర్మపు రకం, రంగు: చర్మానికి నప్పే మేకప్ ఐటమ్స్ ఎంచుకోవాలంటే, చర్మపు తత్వం, టోన్‌ల గురించి తెలుసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు నూనె ఆధారిత మేకప్ ఐటమ్స్ ఎంచుకోకూడదు. కొన్ని మేకప్ సాధనాలు చర్మంలోని తేమను పీల్చేస్తాయి కాబట్టి పొడి చర్మం కలిగిన వాళ్లు వీటిని వాడకూడదు. చర్మపు తత్వం, రంగులకు తగిన సాధనాలనే ఎంచుకోవాలి.

సరైన బ్రషెస్: వేర్వేరు దశల్లో వేర్వేరు బ్రష్‌లను వాడుకుంటే, మేకప్ వేసుకోవడం తేలికవుతుంది. వేసుకున్న మేకప్ చూడచక్కగా ఉంటుంది. కనురెప్పల బేస్‌లో ఐ షాడో వేసుకోవడానికి చదునైన షాడో బ్రష్‌ను వాడాలి. ముడతలను దాచడం కోసం బ్లెండింగ్ క్రీజ్ బ్రష్ ఉపయోగించాలి. ల్యాష్ లైన్ మీద సన్నని గీతలా లైనర్‌ను పెట్టుకోవడానికి యాంగిల్డ్ లైనర్ బ్రష్ వాడాలి.

లిప్ లైనర్, లిప్‌స్టిక్: లిప్‌స్టిక్ వేసుకునే ముందు లిప్‌లైనర్‌తో పెదవుల అంచుల్లో లైన్ గీసుకోవాలి. లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉండడానికి లిప్‌లైనర్ అప్లై చేసుకోవడం అవసరం. ఆ తర్వాత లిప్‌స్టిక్ బ్రష్‌తో లిప్‌స్టిక్‌ను గీసుకున్న గీతల లోపల అద్దుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి:

- మేకప్‌ను పూర్తిగా తొలగించి, ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాతే నిద్రకు ఉపక్రమించాలి.
- శుభ్రమైన ఉత్పత్తులనే వాడాలి. వాటి మీది ఇంగ్రీడియెంట్స్‌ను క్షుణ్ణంగా చదవాలి.
- చర్మ తత్వానికి తగిన మేకప్ సాధనాలనే వాడాలి.
- అవసరానికి మించి మేకప్ వేసుకోకూడదు.



నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7LxJCLEలో చదవండి.

విభిన్నం

చిన్నప్పటి లక్ష్యం... డాక్టర్ కావాలని. దాని కోసమే శ్రమించి... అనుకున్నది సాధించింది. డెంటిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టాలనుకుంది. కానీ డ్యాన్స్‌పై ఉన్న అమితమైన ప్రేమ... ఆమె రూటు మార్చేసింది. యూట్యూబ్ స్టార్‌గా ఎదిగి... రెండు మూడు సినిమాల్లో నటించింది. భారత క్రికెటర్ యజుర్వేద చాహల్ సతీమణిగా... అద్భుతమైన డ్యాన్సర్‌గా... కొరియోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకున్న ధనశ్రీ వర్మ జర్నీ ఇది.

రంగం ఏదైనా... ధనశ్రీ హల్‌చల్ పక్కా





యజుర్వేద చాహల్‌తో పెళ్లికి ముందే ధనశ్రీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. తన డ్యాన్స్ వీడియోలతో యూట్యూబ్‌లో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. పెళ్లి తరువాత ఒక్కసారిగా ఆమె పేరు క్రికెట్ ప్రేమికులందరికీ పరిచయమైంది. భారత్‌లోనే కాదు... ఇతర దేశాల్లోని క్రికెట్ అభిమానులు కూడా ధనశ్రీ 'ఆట'కు ఫిదా అయ్యారు. ఇక చాహల్‌తో కలిసి ఆమె చేసే డ్యాన్స్ మూమెంట్స్‌కు అయితే విపరీతమైన క్రేజ్. విశేషమేంటంటే... వీరిద్దరినీ కలిపింది కూడా ఆ నాట్యమే. ఇప్పుడే కాదు... ఒకప్పుడు చాహల్ కూడా ఆమె డ్యాన్స్‌కు అభిమానే.

ఆమె అంటే ఎంతో గౌరవం...

"దేశమంతా లాక్‌డౌన్‌లో ఉన్న సమయం అది. 'టిక్‌టాక్'లో నా డ్యాన్స్ చూసి నాకు మెసేజ్ పంపించారు. తాను కూడా డ్యాన్స్ నేర్చుకోవాలని అనుకుంటున్నానని, ఆన్‌లైన్ తరగతులు ఏవైనా ప్రారంభించే ఉద్దేశం ఉందా అని అడిగారు. నేను సరేనన్నాను. ఒకటి రెండు నెలలు మా ఇద్దరి మధ్య సంభాషణలు కేవలం డ్యాన్స్ సంబంధిత విషయాల మీదే సాగాయి. తరువాత ఒక రోజు 'నిన్ను ఒకటి అడగాలని అనుకొంటున్నా' అని తను మెసేజ్ చేశారు. అదేంటంటే... 'ప్రపంచమే స్తంభించిన లాక్‌డౌన్‌లో కూడా మీరు ఇంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారు' అని! అక్కడి నుంచి మా మాటలు మా జీవన ప్రయాణంలోకి వెళ్లాయి" అంటూ చాహల్‌తో తన పరిచయం గురించి ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది ధనశ్రీ. తనలానే స్వయంశక్తితో ఎదిగిన మహిళగా చాహల్ ఆమెను ఎంతో గౌరవిస్తాడు. అభిమానిస్తాడు.

ముందు అమ్మకు చెప్పి...

చాహల్‌తో ధనశ్రీ పరిచయం కొన్నాళ్లకు మరో మలుపు తిరిగింది. తమ స్నేహాన్ని తరువాతి స్థాయికి తీసుకువెళ్లాలని అనుకున్నాడు చాహల్. "ధనశ్రీ గురించి నాకు పెద్దగా తెలియదు. కానీ ఈ కొన్నాళ్ల పరిచయంలో ఆమె అంటే నాకు ఇష్టం ఏర్పడింది. ముందు మా అమ్మా నాన్నలకు చెప్పాను... తనను నా జీవిత భాగస్వామి చేసుకోవాలని కోరుకొంటున్నానని. తరువాత అదే విషయం నేరుగా తనకు చెప్పాను. 'నువ్వంటే నాకు ఇష్టం. నీతో డేటింగ్ చేయాలనుకోవడం లేదు. నిన్ను పెళ్లి చేసుకోవాలని అనుకొంటున్నా' అని మనసులో ఉన్నది ఉన్నట్టు చెప్పాను" అని నాడు తమ నిశ్చితార్థం సందర్భంగా చాహల్ వెల్లడించాడు. అతడిలో ధనశ్రీకి నచ్చింది అదే... ముక్కుసూటితనం... ఎదుటివారికి గౌరవం ఇవ్వడం. 'ఆయన ప్రతిపాదన కాదనడానికి నా దగ్గర కారణాలేవీ లేవు' అంటున్న ధనశ్రీకి పరిచయమైన చాలా రోజుల వరకు చాహల్ పెద్ద క్రికెటర్ అని తెలియదు. ఎందుకంటే అతను అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టే సమయానికి ఆమె క్రికెట్ చూడడం మానేసిందట. 'యజీ ఎవరో నాకు అప్పటికి తెలియదు. అయితే ఏదో కాలక్షేపానికి కాకుండా డ్యాన్స్ క్లాసుల్లో పూర్తి శ్రద్ధ పెట్టేవారు. ఇచ్చింది ఇచ్చినట్టు హోమ్‌వర్క్ పూర్తి చేసేవారు. ఆయనలోని నిబద్ధత, మర్యాదగా నడుచుకొనే తీరు నాకు బాగా నచ్చాయి' అని భర్త గురించి గొప్పగా చెబుతుంది ధనశ్రీ. వీరిద్దరూ 2020లో పెళ్లి చేసుకున్నారు.



డాక్టర్ కావాలనుకుని...

ధనశ్రీ తండ్రి కపిల్‌వర్మ పారిశ్రామికవేత్త. తల్లి వర్ష గృహిణి. దుబాయ్‌లో పుట్టిన ధనశ్రీ ముంబయిలో పెరిగింది. అక్కడి 'జమునాబాయ్ నర్సీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... చిన్న నాటి నుంచి డాక్టర్ కావాలని కోరుకుంది. అందుకు తల్లితండ్రులు కూడా మద్దతు తెలిపి, ప్రోత్సహించారు. తన ఆకాంక్షకు అనుగుణంగా మెడిసిన్‌లో సీటు సాధించి 'డీవై పాటిల్ యూనివర్సిటీ'లో బీడీఎస్ పూర్తి చేసింది. అయితే మొదటి నుంచి డ్యాన్స్‌తో పాటు నటనపైన ఉన్న మక్కువ ఆమె కెరీర్‌ను మరో మలుపు తిప్పింది. చదువుకొనే రోజుల్లోనే ధనశ్రీ డ్యాన్స్, లిప్ సింకింగ్ వీడియోలు చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది. అలా పదేళ్ల కిందట ఆమె పెట్టిన ఓ వీడియోకు మంచి ఆదరణ లభించింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ప్రముఖ డ్యాన్సర్లతో జతకట్టి చేసిన వీడియోలకు లక్షల్లో వ్యూస్ వచ్చాయి. తన పేరుతో పెట్టుకున్న 'ధనశ్రీవర్మ' చానల్‌ను తక్కువ సమయంలో పది లక్షలమంది సబ్‌స్క్రైబ్ చేశారు.

భాగస్వామితో కలిసి...

ఇక పెళ్లి తరువాత ధనశ్రీ గ్రాఫ్ అనూహ్యంగా పెరిగిపోయింది. చాహల్ క్రికెట్ క్రేజ్ ఆమెకు బాగా కలిసివచ్చింది. వీరిని కలిపింది కూడా ఇద్దరికీ నాట్యం మీద ఉన్న మక్కువే కదా. దానికి కొనసాగింపుగా ఇద్దరూ కలిసి హిట్ పాటలకు లయబద్ధంగా అడుగులు కదిపి... వాటిని ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తున్నారు. ఇవి దేశం దాటి విదేశాల్లోని వారిని కూడా అలరిస్తున్నాయి. కొరియోగ్రఫీలో కూడా మంచి నైపుణ్యం ఉన్న ధనశ్రీ... ఒక్క క్షణం కూడా ఖాళీగా కనిపించదు. అటు ఇంటి పనులు చూసుకొంటూనే... మైదానానికి వెళ్లి చాహల్‌లో స్ఫూర్తి నింపుతుంది. ఆటలో అతడికి ఆటుపోట్లు ఎదురైనప్పుడు... ధైర్యం చెప్పి ముందుకు నడిపిస్తుంది. తనలా మరింతమంది డ్యాన్సర్లను తయారు చేయాలన్న ఉద్దేశంతో... ఒక నాట్యాలయాన్ని ప్రారంభించింది. అంతేకాదు... పెద్ద పెద్ద బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తోంది. డ్యాన్స్ ఆల్బమ్స్ రూపొందిస్తోంది. గత ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్ గీతంలో బాలీవుడ్ స్టార్ రణవీర్‌సింగ్‌తో కలిసి చేసిన డ్యాన్స్ ధనశ్రీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం మెగా డ్యాన్స్ రియాలిటీ షో 'ఝలక్ దిక్‌లాజా'లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చిన ధనశ్రీ నికర వార్షిక ఆదాయం మూడు మిలియన్ డాలర్లకు పైనే.



నారంగ కేసరమపాకృత బీజ పుంజం యోగ్నతి ఖండమరీ చోద్య వచూర్ణ మిశ్రమ్!
అన్నం గలె విశతి తస్య నరస్య తూర్ణం సంగృహ్యమాణ ఇవం రాహుజవేన చంద్రః!!

నారింజ, కమలా, బత్తాయి, నిమ్మ దబ్బ, పంపరపనస... ఇవన్నీ ఇంచుమించుగా సమాన గుణధర్మాలు కలిగిన ఫలాలు. ఆహార పదార్థాలుగా తయారు చేసుకునేందుకు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి.

నారింజ పచ్చడి... పప్పు

కమలాలు, బత్తాయిలూ 16-17 శతాబ్దాలలో మనకు పరిచయం అయ్యాయి. డచ్చి ఈస్టిండియా కంపెనీ వాళ్ల వాణిజ్య రాజధాని బటావియా దీవి. ఇది ఇండోనేషియాలో ఉంది. ఇక్కడ నుండి విత్తనాలు తెచ్చి గోదావరి జిల్లాల్లో రైతులకు ఇచ్చి పండించారు. పాలకొల్లు రైతులు దీన్ని అభివృద్ధి చేశారు. బటావియా నుండి వచ్చినవి కాబట్టి, వీటిని తెలుగువాళ్లు బత్తాయి పళ్లన్నారు. మనవాళ్లు బత్తాయిల్ని, మహారాష్ట్రులు కమలాల్ని వ్యాప్తిలోకి తెచ్చారు. ఇవి తియ్యని రసం కలిగినవి కాబట్టి వాటిని తీపి ఫలాలుగానే వాడుకుంటున్నాం.

పులుపు రుచి గల ఈ సిట్రస్ ఫలాలతో వంటకాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరించాడు. నిమ్మ, నారింజ, పంపర పనస, దబ్బ, గజనిమ్మ, మాదీఫలం... ఇవన్నీ పుల్లని రసం కలిగిన సిట్రస్ ఫలాలు. వీటితో పచ్చడి చేసుకునే విధానాన్ని ఈ శ్లోకంలో క్షేమశర్మ తెలిపాడు.

నారింజ పానీయం ఇలా...

నారింజకాయ తొనలు వలిచి, పైన పీచు తీసేసి, లోపల ముత్యాలుతో సహా రసాన్ని గింజలు లేకుండా ఒక గాజు పాత్రలోకి తీసుకోండి. అందులో తగినంత మిరియాల పొడి, ఉప్పు కలిపిన నారింజ పానీయం కమ్మగా ఉంటుంది. ఇది 'చంద్రుణ్ణి మింగిన రాహువులా రోగాల్ని మింగేస్తుంద'న్నాడు క్షేమశర్మ.

'నారంగం తువరం రుచ్యం సుగంధమతి చారుఐమ్! వాతఘ్నం కఫదం కించిత్పిత్తఘ్నం విశదమ్ స్మృతమ్'... ఈ పానీయం రోజూ తాగితే నోటికి రుచి తెలుస్తుంది. అన్నహితవు కలుగుతుంది. వాతవ్యాధులన్నిటిలోనూ ఔషధంగా పనిచేసి, త్వరగా తగ్గేలా చేస్తుంది. కొంచెం కఫాన్ని పెంచుతుంది. కానీ, వేడిని బాగా తగ్గిస్తుంది. సాధారణంగా వాతాన్ని తగ్గించే ద్రవ్యాలు వేడి చేసే స్వభావం కలిగి ఉంటాయి. నారింజ పానీయం వేడిని, వాతాన్ని కూడా తగ్గిస్తుంది. జీర్ణశక్తిని బాగు చేస్తుంది. సుగంధభరితంగా ఉంటుంది. శరీరంలో నీటిని లాగేస్తుంది. నీరు పట్టి వచ్చే జబ్బు (ఎడీమా) ఉన్నవారికి ఇది మంచి ఔషధం.

నారింజ పచ్చడి...

ఒక బాండీలో కొద్దిగా నూనె తీసుకుని, ఎండు మిరపకాయలు, తాలింపు గింజలు, కాసిని మెంతులతో సహా వేగించి, మిక్సీ పట్టాలి. అందులో నారింజ రసం, తగినంత ఉప్పు వేసి, కొత్తిమీరతో అలంకరిస్తే అదే నారింజ పచ్చడి. నిమ్మ రసంతోనూ, దబ్బ లేదా పంపరపనస రసాలతో కూడా ఇలా పచ్చడి చేసుకోవచ్చు. ఇది అన్నంలోకి ఆదరవుగానూ, టిఫిన్లలో చట్నీగా కూడా బాగుంటుంది.

నారింజ పులిహోర...

చక్కగా వండిన అన్నం చల్లారిన తరువాత నారింజ రసం కలిపి, తాలింపు పెడితే కమ్మని పులిహోర తయారవుతుంది. చింతపండుకి బదులు నారింజ రసం ఎక్కువ ఆరోగ్యదాయకం. ఇందులో కొద్దిగా ఆవపిండి కలుపుకుంటే ఈ పులిహోర ఇంకా రుచికరంగా ఉంటుంది. నిమ్మ, దబ్బ, పంపర పనస, గజనిమ్మ లాంటి సిట్రస్ ఫలాలన్నింటితోనూ పులిహోర తయారు చేసుకోవచ్చు.

నారింజ పప్పు...

కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు, శనగపప్పు, ఎర్ర కందిపప్పు (మసూరిపప్పు)... ఈ ఐదింటినీ సమానంగా తీసుకుని, విడివిడిగా దోరగా వేయించి, అన్నీ



కలిపి గుజ్జులా ఉడికించాలి. కొంచెం చల్లారాక అందులో నారింజ రసం తగినంత కలిపి, తాలింపు పెట్టిన ముద్దపప్పు కమ్మగా ఉంటుంది. ఇది అమిత బలకరం.

నారింజలో పొటాషియం, భాస్వరం, మెగ్నీషియం కాల్షియం, ఇనుము ఉప్పు కూడా తగినంత ఉన్నాయి. 'సి, బి' విటమిన్లూ పుష్కలం. ఒకప్పుడు నారింజ వాడకమే ఎక్కువ. తరువాత తీపి సిట్రస్ ఫలాలు అందుబాటులోకి వచ్చి, నారింజ వాడకం తగ్గిపోయింది. అందువల్ల వాణిజ్య పరంగా గిట్టుబాటు కాకపోవటంతో నారింజను పండించటం కూడా తగ్గిపోయింది.

• గంగరాజు అరుణాదేవి

అయ్యో.. అమ్మాయిలు!

భారత్ ఒలింపిక్ ఆశలు ఆవిరి



- మూడోస్థానం పోరులో జపాన్ చేతిలో ఓటమి
- హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్ చాంపియన్ జర్మనీ

రాంచీ: ఈ ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో భారత మహిళల హాకీ జట్టు విఫలమైంది. క్రితంసారి టోక్యో విశ్వక్రీడల్లో సెమీస్ వరకు చేరి అందరి అభిమానాన్ని చూరగొన్న జట్టు ఈసారి బెర్త్ కోసం స్వదేశీ అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేకపోయింది. శుక్రవారం మూడు-నాలుగు స్థానాల కోసం జపాన్‌తో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో సవిత సారథ్యంలోని భారత జట్టు 0-1 తేడాతో ఓడి నిరాశపరిచింది. ఇందులో కచ్చితంగా గెలిస్తేనే భారత్ బెర్త్ దక్కించుకునేది. తాజా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకే ఒలింపిక్స్‌లో చోటు లభిస్తుంది. ఫైనల్‌కు చేరడంతో జర్మనీ, అమెరికా జట్లు ఇప్పటికే అర్హత సాధించగా.. వీటి సరసన మూడోస్థానంలో నిలిచిన జపాన్ చేరింది. ఇక, మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను జపాన్ తొలి క్వార్టర్‌లోనే సాధించి, అదే ఆధిక్యాన్ని చివరికంటా కొనసాగించింది. అటు భారత్‌కు తొమ్మిది పెనాల్టీ కార్నర్లు లభించినా ఏమాత్రం ఫలితం లేకపోయింది. పీసీలను గోల్స్‌గా మలచడంలో తమ బలహీనతను మరోసారి చాటుకుని మూల్యం చెల్లించుకుంది. గురువారం జరిగిన సెమీస్‌లో భారత జట్టు షూటవుట్ ద్వారా జర్మనీ చేతిలో 3-4తో ఓడిన విషయం తెలిసిందే. కాగా, శుక్రవారమే జరిగిన ఫైనల్లో జర్మనీ 2-0తో అమెరికాను ఓడించి చాంపియన్‌గా నిలిచింది. 2016 తర్వాత ఒలింపిక్స్‌లో భారత్ చోటు దక్కించుకోకపోవడం ఇదే ప్రథమం. 2021 గేమ్స్‌లో అత్యుత్తమంగా నాలుగోస్థానంలో నిలిచింది.



గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి, సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రి ఠాకూర్, ఆ రాష్ట్ర క్రీడా మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఉన్నారు.

ఒలింపిక్స్ నిర్వహిస్తాం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభ వేడుకలో ప్రధాని మోదీ

చెన్నై: భారత్‌లో యూత్ ఒలింపిక్స్ (2029), ఒలింపిక్స్ (2036) నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను శుక్రవారం ఇక్కడ ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌ను ఈ క్రీడలు ప్రతిబింబిస్తున్నాయి. యూత్ గేమ్స్ ద్వారా 2024 క్రీడా ఏడాదికి స్వాగతం పలుకుతున్నాం. గత పదేళ్లలో దేశ క్రీడారంగంలో ఎంతో అభ్యున్నతిని సాధించాం. రాబోయే రోజుల్లో భారత క్రీడా రంగ పరిశ్రమ విలువ రూ. లక్ష కోట్లకు చేరే చాన్సుంది. ప్రపంచంలోనే అతిపెద్ద టోర్నీ ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం. 2029 యూత్ ఒలింపిక్స్‌తో పాటు 2036లో జరిగే విశ్వక్రీడల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం' అని అన్నారు. తమిళనాడును దేశ క్రీడాకేంద్రం దిశగా అభివృద్ధి చేస్తున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి, కేంద్ర క్రీడాశాఖ మంత్రి ఠాకూర్, రాష్ట్ర క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు.

శుభారంభం దక్కాలని..

బంగ్లాదేశ్‌తో భారత్ పోరు నేడు
అండర్-19 వరల్డ్‌కప్
మ. 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

బ్లూమ్‌ఫోంటీన్: అండర్-19 వరల్డ్‌కప్ చరిత్రలోనే విజయవంతమైన జట్టుగా పేరు తెచ్చుకున్న యువ భారత్ ఆరో టైటిల్ కోసం బరిలోకి దిగుతోంది. శనివారం గ్రూప్ 'ఎ'లో బంగ్లాదేశ్‌తో జట్టుతో తమ తొలి మ్యాచ్‌ను ఆడనుంది. జట్టుకు ఉదయ్ సహరన్ కెప్టెన్సీ వహిస్తుండగా.. ఇటీవలి అండర్-19 ఆసియాకప్ సెమీస్‌లో బంగ్లా చేతిలోనే భారత కుర్రాళ్లకు ఓటమి ఎదురైంది. దీంతో ఈసారి ఆ జట్టును తేలిగ్గా తీసుకుంటే మరో భంగపాటు తప్పదు. గత మూడు మ్యాచ్‌ల్లో ఓ సెంచరీ, రెండు హాఫ్‌సెంచరీలతో ఉదయ్ ఫామ్‌లో ఉండడం కలిసిరానుంది. అలాగే తెలంగాణ క్రికెటర్ అవనీశ్ తొలిసారి ఈ భారీ టోర్నీలో సత్తా చాటాలనుకుంటున్నాడు. ఆల్‌రౌండర్ ముషీర్ ఖాన్, బ్యాటర్ అర్షిన్ కులకర్ణి కీలకం కానున్నారు. ఇక, ఇదేరోజు గ్రూప్ 'బి'లో స్కాట్లాండ్-ఇంగ్లండ్ మధ్య, గ్రూప్ 'డి'లో పాక్-అఫ్ఘాన్ జట్ల మధ్య మ్యాచ్‌లుంటాయి. ఇక, గురువారం జరిగిన ప్రారంభ మ్యాచ్‌ల్లో ఐర్లాండ్ 7 వికెట్లతో అమెరికాపై.. గ్రూప్ 'బి'లో దక్షిణాఫ్రికా 31 పరుగులతో విండీస్‌పై నెగ్గాయి.

జాతీయ ఆర్చరీ ఉపాధ్యక్షులుగా
సత్యం, సంజీవ





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఆర్చరీ సంఘం ఎన్నికల్లో ఇద్దరు తెలుగు వ్యక్తులకు చోటు లభించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, తెలంగాణ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవ రెడ్డి ఉపాధ్యక్షులుగా గెలిచారు. ఇక, జాతీయ సంఘం అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి అర్జున్ ముండా, ప్రధాన కార్యదర్శిగా వీరేంద్ర సచ్‌దేవ్ ఎన్నికయ్యారు.

ఐదో రౌండ్‌లో హారిక ఓటమి

వీకాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ చాలెంజర్ విభాగంలో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఐదోరౌండ్‌లో ఓడిపోయింది. భారత్‌కే చెందిన ల్యూక్ మెన్డోన్కా.. హారికపై గెలిచాడు. ఇక మాస్టర్స్ టోర్నీ ఆరో రౌండ్‌లో జీఎం గుకేశ్..జీఎం వాన్ ఫోరీస్ట్‌పై నెగ్గాడు. గుకేశ్‌కిది వరుసగా రెండో విజయం కావడం విశేషం. జీఎం ప్రజ్ఞానంద- నెపోమ్నియాచీతో ఆరో రౌండ్ గేమ్‌ను డ్రా చేశాడు.

స్టార్లు సులువుగా..

ప్రీక్వార్టర్స్‌లో జొకో, సబలెంకా, గాఫ్

ఆస్ట్రేలియన్ ఓపెన్



కొకొ గాఫ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుక్రవారం పురుషులు, మహిళల సింగిల్స్ విభాగాల్లో స్టార్లంతా సునాయాస విజయాలతో ప్రీక్వార్టర్స్‌కు చేరారు. గత రెండు మ్యాచ్‌ల్లో నాలుగు సెట్లపాటు శ్రమకోర్చిన టాప్ సీడ్ జొకోవిక్ మూడో రౌండ్‌లో 6-3, 6-3, 7-6 (2)తో మార్టిన్ ఎచివెరీపై అలవోకగా నెగ్గాడు. మిగతా సీడెడ్ ఆటగాళ్లలో రుబ్లేవ్ 6-2, 7-6 (6), 6-4తో కోర్డాపై, సిన్నర్ 6-0, 6-1, 6-3తో సెబాస్టియన్‌పై, సిట్సిపాస్ 6-3, 6-0, 6-4తో లుకా వాన్‌పై, డిమినార్ 6-3, 6-3, 6-1తో కొబోలీపై గెలిచి నాలుగో రౌండ్ చేరారు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంప్ సబలెంకా 6-0, 6-0తో సురెంకోను, నాలుగో సీడ్ కొకొ గాఫ్ 6-0, 6-2తో అలీసియాను చిత్తుచేయగా, 9వ సీడ్ క్రెజికోవా 4-6, 7-5, 6-4తో హంటర్‌పై, ఆండ్రీవా 1-6, 6-1, 7-6 (5)తో డిన్‌పారీపై నెగ్గి రౌండ్-16లో ప్రవేశించారు. గత రౌండ్‌లో వోజ్నియాకికి షాకిచ్చిన రష్యన్ స్టార్ మరియా తొమఫీవా మూడోరౌండ్‌లో 7-6 (7), 6-3తో పదోసీడ్ మయాను ఓడించింది.

మూడోరౌండ్‌కు బోపన్న జోడీ

భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న డబుల్స్‌లో తన జోరు కొనసాగిస్తున్నాడు. బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-2, 6-4తో స్థానిక ద్వయం జాన్ మిల్‌మన్/ఎడ్వర్డ్ వింటర్‌పై విజయంతో మూడోరౌండ్‌లో అడుగుపెట్టింది. ఇక భారత్‌కే చెందిన శ్రీరామ్ బాలాజీ/విక్టర్ వ్లాడ్ (రొమేనియా) జంట 6-3, 6-4తో ఇటలీ ద్వయం మాటియో/ఆండ్రియాను ఓడించి రెండోరౌండ్ చేరింది.

ఆంధ్ర 188 ఆలౌట్

అసోంతో రంజీ

డిబ్రూఘర్: అసోంతో రంజీట్రోఫీ ఎలిట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులకే కుప్పకూలింది. షోయబ్ ఖాన్ (63), నితీశ్ (49) రాణించారు. ఈ జోడీ ఏడో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకుంది. స్పిన్నర్ రాహుల్ సింగ్ (6/46) ఆరు వికెట్లతో ఆంధ్రను వణికించాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన అసోం తొలిరోజు ఆట ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది.

భళా.. శ్రీజ

డబ్ల్యూటీటీ టైటిల్ కైవసం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలుగమ్మాయి ఆకుల శ్రీజ కొత్త సీజన్‌ను అద్భుత విజయంతో ప్రారంభించింది. వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సీనియర్ విభాగంలో శ్రీజ సింగిల్స్ విజేతగా నిలిచి ఈ ఏడాది తొలి అంతర్జాతీయ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టీ టోర్నమెంట్ ఫైనల్లో శ్రీజ 11-6, 18-16, 11-5తో అమెరికాకు చెందిన లిల్లీ ఝూంగ్‌పై గెలిచింది.

సీజన్‌కు రూ. 500 కోట్లు

టాటాకే ఐపీఎల్ టైటిల్ హక్కులు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను తిరిగి టాటా గ్రూప్ దక్కించుకుంది. ఐదేళ్లపాటు (2024-2028) సీజన్‌కు రూ.500 కోట్ల చొప్పున మొత్తంగా రూ.2500 కోట్లను బీసీసీఐకి చెల్లించనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ (ఏబీజీ) మొదట టైటిల్ హక్కుల కోసం పోటీ పడింది. అయితే రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డు ద్వారా ఏబీజీ వేసిన బిడ్ మొత్తాన్ని తానే చెల్లించేందుకు టాటా గ్రూప్ సిద్ధమైంది. గతంలో చైనా బ్రాండ్ వీవో ఈ హక్కుల నుంచి వైదొలగడంతో టాటా గ్రూప్ 2022, 2023 సీజన్లకు రూ.335 కోట్ల చొప్పున చెల్లించింది. తాజాగా ఈ బిడ్ సీజన్‌కు రూ.165 కోట్ల చొప్పున పెరగడం విశేషం.

టైటాన్స్‌కు మళ్లీ నిరాశే



హైదరాబాద్ అంచె కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమంలో టాలీవుడ్ హీరో బాలకృష్ణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ వైఫల్యం కొనసాగుతోంది. సొంతగడ్డపై అభిమానులను కూడా ఆ జట్టు నిరాశపరిచింది. శుక్రవారం ఇక్కడ గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో మొదలైన హైదరాబాద్ అంచె పోటీల్లో తెలుగు టైటాన్స్ 26-42 స్కోరు తేడాతో బెంగళూరు బుల్స్ చేతిలో చిత్తుగా ఓడింది. టాలీవుడ్ హీరో బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్ అంచె పోటీలను ప్రారంభించారు. ఇక మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 34-31తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. ఇప్పటిదాకా తానాడిన మొత్తం 13 మ్యాచుల్లో ఒకే ఒక్క గెలుపందుకున్న టైటాన్స్ కేవలం పది పాయింట్లతో చివరి స్థానంలో నిలిచింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

సింగిల్స్‌లో ప్రణయ్



న్యూఢిల్లీ: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్ టోర్నమెంట్‌లో టైటిల్ సాధించే దిశగా సాగుతోంది. శుక్రవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-7, 21-10తో డెన్మార్క్‌కు చెందిన ఐదోసీడ్, కిమ్ ఆస్ట్రప్-ఆండర్స్ రాసుముస్సెన్ జంటను చిత్తుగా ఓడించి సెమీఫైనల్ చేరింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21-11, 17-21, 21-18తో చైనీస్ తైపీ షట్లర్ వాంగ్ జూ వీపై గెలిచి ఈ టోర్నీలో తొలిసారి సెమీఫైనల్లో ప్రవేశించాడు. ఫైనల్ బెర్త్ కోసం షి యుకి (చైనా)తో ప్రణయ్ తలపడనున్నాడు. ఇక, జియా మిన్ (సింగపూర్)తో జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 19-21, 0-3తో వెనుకంజలో ఉన్న దశలో డిఫెండింగ్ చాంప్ అన్ సే యంగ్ (కొరియా) రిటైర్డ్ హర్ట్‌తో మ్యాచ్ నుంచి వైదొలగింది. దీంతో జియా సెమీస్ చేరింది.

పంకజ్‌దే స్నూకర్ టైటిల్

ముంబై: పంకజ్ అడ్వాణీ ఆలిండియా ఓపెన్ స్నూకర్ టైటిల్ గెలుచుకున్నాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో పంకజ్ 10-8తో ఇష్‌ప్రీత్‌సింగ్ చద్దాను ఓడించి విజేతగా నిలిచాడు.

బిజినెస్

రిలయన్స్ లాభం రూ. 17,265 కోట్లు

ఆదాయం రూ.2.28 లక్షల కోట్లు.. మందగించిన ఓ2సీ వ్యాపారం

రిటైల్, టెలికాంలో కొనసాగిన జోరు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఏకీకృత నికర లాభం రూ.17,265 కోట్లుగా (ఒక్కో షేరుకు రూ.25.52) నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.15,792 కోట్ల (ఒక్కో షేరుకు రూ.23.19) లాభంతో పోలిస్తే, 9.3 శాతం వృద్ధి కనబర్చింది. సమీక్షా కాలానికి జామ్‌నగర్‌లోని చమురు శుద్ధి ప్లాంట్‌లో షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ తనిఖీతో కంపెనీ ప్రధాన ఆదాయ వనరు అయిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) వ్యాపారం బలహీనపడినప్పటికీ రిటైల్, టెలికాం విభాగాలు జోరు కొనసాగించాయి. కాగా, ఈ క్యూ3లో రిలయన్స్‌కు వ్యాపార కార్యకలాపాల ద్వారా ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.6 శాతం వృద్ధితో రూ.2.28 లక్షల కోట్లకు పెరిగింది. ఈ క్యూ2 (జూలై-సెప్టెంబరు)తో పోలిస్తే, లాభం 0.7 శాతం, ఆదాయం దాదాపు 3 శాతం తగ్గింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఎబిటా వార్షిక ప్రాతిపదికన 16.7 శాతం పెరిగి రూ.44,678 కోట్లకు చేరుకుంది. గత ఏడాది సెప్టెంబరు చివరినాటికి కంపెనీ వద్దనున్న నగదు, నగదుకు సమానమైన నిల్వలు రూ.1.78 లక్షల కోట్లుగా ఉండగా.. డిసెంబరు చివరికల్లా రూ.1.92 లక్షల కోట్లకు పెరిగాయి. కంపెనీ నికర అప్పులు కూడా రూ.2.95 లక్షల కోట్ల నుంచి రూ.3.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

జియో ప్లాట్‌ఫామ్స్ లాభం రూ.5,445 కోట్లు

రిలయన్స్‌కు చెందిన టెలికాం, డిజిటల్ వ్యాపారాల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ ఏకీకృత నికర లాభం ఈ క్యూ3లో 11.6 శాతం వృద్ధి చెంది రూ.5,445 కోట్లకు చేరుకుంది. స్థూల ఆదాయం 11.4 శాతం పెరిగి రూ.32,510 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో రిలయన్స్ జియో వినియోగదారుల నుంచి సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) మాత్రం కేవలం రెండు శాతం పెరుగుదలతో రూ.181.7గా నమోదైంది. క్యూ3లో జియో వినియోగదారులు మరో 1.12 కోట్ల మేర పెరిగి 47.09 కోట్లకు చేరుకున్నారు.

రిటైల్ లాభంలో 31.87 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం 31.87 శాతం పెరిగి రూ.3,165 కోట్లకు చేరుకుంది. వ్యాపార కార్యకలాపాల ద్వారా ఆదాయం 23.75 శాతం వృద్ధితో రూ.74,373 కోట్లుగా నమోదైంది. కిరాణా సరుకులతో పాటు ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రిటైల్ వ్యాపారాలన్నీ మంచి పనితీరు కనబర్చడం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు నెలల్లో 252 కొత్త స్టోర్లను ప్రారంభించడం జరిగిందని, దాంతో మొత్తం విక్రయ కేంద్రాలు 18,774కు పెరిగాయని కంపెనీ తెలిపింది. అంతేకాదు, గత మూడు నెలల్లో కంపెనీ స్టోర్లను 28.2 కోట్ల మంది సందర్శించారని వెల్లడించింది. డిజిటల్ కామర్స్, న్యూ కామర్స్ వ్యాపారాలు సైతం వేగంగా వృద్ధి చెందుతున్నాయని, ఈ విభాగ ఆదాయంలో ఈ రెండింటి వాటా 19 శాతానికి చేరుకుందని ప్రకటనలో పేర్కొంది.

ఓ2సీ ఆదాయంలో 2.4 శాతం తగ్గుదల

మూడో త్రైమాసికంలో ఆయిల్ రిఫైనింగ్, పెట్రోకెమికల్ (ఓ2సీ) వ్యాపార విభాగ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.4 శాతం తగ్గి రూ.1,41,096 కోట్లకు పరిమితం కాగా.. ఎబిటా 1 శాతం వృద్ధితో రూ.14,064 కోట్లుగా నమోదైంది. అయితే, క్యూ2లో నమోదైన రూ.16,281 కోట్ల ఎబిటాతో పోలిస్తే బాగా తగ్గింది.

ఆయిల్ అండ్ గ్యాస్ ఎబిటా రూ.5,804 కోట్లు

సమీక్షా కాలానికి కంపెనీ ఆయిల్ అండ్ గ్యాస్ విభాగ ఎబిటా 50 శాతం వృద్ధితో రూ.5,804 కోట్లకు చేరుకుంది. కేజీ-డీ6 బేసిన్ నుంచి సహజ వాయువు రోజువారీ ఉత్పత్తి 30 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లకు చేరుకుందని, రోజుకు 21,000 పీపాల చమురు ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.



భారత మార్కెట్లోకి రోల్స్-రాయిస్ ఎలక్ట్రిక్ లగ్జరీ కారు స్పెక్ట్రే

- ప్రారంభ ధర రూ.7.5 కోట్లు
- దేశీయంగా అత్యంత ఖరీదైన ఎలక్ట్రిక్ కారు ఇదే

న్యూఢిల్లీ: బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్-రాయిస్.. భారత మార్కెట్లోకి తొలి పూర్తి ఎలక్ట్రిక్ లగ్జరీ సెడాన్ కారు స్పెక్ట్రే విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.7.5 కోట్లు. దేశీయ మార్కెట్లో అత్యంత ఖరీదైన ఎలక్ట్రిక్ కారు ఇదే. 102 కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్) బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అంతేకాకుండా కేవలం 4.5 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 195 కేడబ్ల్యూ డీసీ ఫాస్ట్ చార్జర్‌ను ఉపయోగిస్తే 34 నిమిషాల్లో 80 శాతం బ్యాటరీ చార్జింగ్ అవుతుందని రోల్స్-రాయిస్ తెలిపింది. ఈ అల్ట్రా లగ్జరీ కారును భారత్‌లో ప్రిన్సిపల్ డీలర్‌గా ఉన్న సెలెక్ట్ కార్స్ ద్వారా రోల్స్-రాయిస్ విక్రయించనుంది. ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రస్థానంలో ఉండటమే కాకుండా మూడో అతిపెద్ద కార్ మార్కెట్‌గా ఉందని సెలెక్ట్ కార్స్ సీఈఓ యదుర్ కపూర్ అన్నారు.

ప్రస్తుతం దేశీయంగా రోల్స్-రాయిస్.. ఫాంథమ్, కలినాన్ ఎస్‌యూవీలను విక్రయిస్తోంది. కాగా ప్రస్తుతం ఈ కార్లను పూర్తిగా యూకే నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దేశీయంగా భిన్న వర్గాల నుంచి ఈ కార్లకు డిమాండ్ పెరుగుతుండటంతో వెయిటింగ్ పీరియడ్ కనీసం ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు ఉంటోందని కపూర్ వెల్లడించారు. స్పెక్ట్రే ఎలక్ట్రిక్ కారుకు ఇప్పటికే మంచి ఆర్డర్లు వచ్చాయని, ఈ కారు డెలివరీకి వెయిటింగ్ పీరియడ్ దాదాపు ఏడాది వరకు ఉందని తెలిపారు.

మూడు రోజుల తర్వాత లాభాల్లోకి..

సెన్సెక్స్ 496 పాయింట్లు అప్

ముంబై: వరుసగా మూడు రోజుల పాటు నష్టాలు చవిచూసిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో మళ్లీ లాభాలబాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ట్రెండ్‌తో ఇన్వెస్టర్లు ఆయిల్, మెటల్ సెక్టార్ షేర్లలో కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 496.37 పాయింట్ల లాభంతో 71,683.23 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 160.15 పాయింట్లు పెరిగి 21,622.40 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 పుంజుకున్నాయి. ఎయిర్‌టెల్ 3.52 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా సూచీలోని ఇతర బ్యాంకింగ్ షేర్లన్నీ నష్టాల్లో కొనసాగాయి. శుక్రవారం సెషన్‌లో మరో 1.08 శాతం క్షీణించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు గడిచిన ఈ మూడు సెషన్లలో మొత్తం 12.40 శాతం పతనమైంది.

నేడు మార్కెట్లో ట్రేడింగ్

సోమవారం మార్కెట్లకు సెలవు

సాధారణంగా స్టాక్ మార్కెట్లో ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు ట్రేడింగ్ జరుగుతుంది. శని, ఆదివారాలు ఎక్స్ఛేంజీలకు సెలవు. కానీ, ఈ శనివారం (జనవరి 20న) కూడా ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తెలిపాయి. అలాగే, అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ నెల 22న (సోమవారం) మహారాష్ట్ర సర్కారు సెలవు ప్రకటించిన నేపథ్యం లో ఎక్స్ఛేంజీలు సైతం సెలవు పాటించనున్నాయి. తొలుత ఎక్స్ఛేంజీలు శనివారం ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో సంసిద్ధతను పరీక్షించుకునేందుకు ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ఈ ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపాయి. రెండు సెషన్లలో (ఉదయం 9.15 గంటల నుంచి పదింటి వరకు ప్రాథమిక సైట్‌లో, 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్లో) స్పెషల్ ట్రేడింగ్‌ను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాయి. కానీ 22న సెలవు పాటించాల్సి వస్తుండటంతో శనివారం ప్రత్యేక ట్రేడింగ్‌కు బదులు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు సాధారణ ట్రేడింగ్‌నే నిర్వహించాలని ఎక్స్ఛేంజీలు నిర్ణయించాయి.

ఎయిర్‌లైన్లు, క్యాటరర్లు ఆహార భద్రతా నిబంధనలు పాటించాలి

ఎఫ్ఎస్ఎస్ఏఐ

హైదరాబాద్: దేశంలోని విమానయాన సంస్థలు, వాటికి ఆహార పదార్థాలు సరఫరా చేసే క్యాటరర్లు ఆహార భద్రతా నియమాలను పాటించాలని ఫుడ్ రెగ్యులేటర్ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. ప్రయాణికులకు సరఫరా చేసే ఆహార పదార్థాలకు తగిన లేబుల్ జత చేయడం ద్వారా వాటి తయారీ గురించిన సవివరమైన సమాచారం అందించాలని సూచించింది. ఎయిర్‌లైన్ క్యాటరింగ్ పరిశ్రమ అనుసరిస్తున్న ఆహార భద్రతా నియమావళిని పరిశీలించి, వాటిని మరింత పెంచడానికి చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గత మంగళవారం విమానయాన సంస్థలు, వాటికి ఆహారం సరఫరా చేసే ప్రముఖ క్యాటరర్ల సమావేశం ఏర్పాటు చేసింది. విమాన ప్రయాణికులకు అందించే ఆహారం ఎప్పుడు ఎక్కడ తయారైంది, దాని స్వభావం ఏమిటి అనే వివరాలు అందించడం ద్వారా పారదర్శకత పెంచడం దీని లక్ష్యం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▲	57,700 ▲	77,200 ▲
ముంబై	62,390 ▲	57,149 ▲	71,228 ▲

బెంగళూరులో ఇంటెక్స్ ఫార్మింగ్ 2024 ఎక్స్‌పో



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తయారీ రంగం వాటా రెండింతలు పెరగాలంటే భారతీయ మెషిన్ పరిశ్రమ.. హై ప్రెసిషన్ మెషిన్స్ ఉత్పత్తిని చేపట్టాలని టైటాన్ కంపెనీ ఎండీ సీకే వెంకటరామన్ అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఇంటెక్స్ ఫార్మింగ్ 2024, టూల్‌టెక్, వెల్డ్ ఎక్స్‌పోను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేస్తున్నారన్నారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ ఈ స్థాయికి చేరుకోవాలంటే అందులో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం వాటా లక్ష కోట్ల డాలర్లుగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 50,000 కోట్ల డాలర్లుగా ఉంది. ఈ కార్యక్రమంలో కిర్లోస్కర్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఎండీ గీతాంజలి కిర్లోస్కర్, ఇండియన్ మెషిన్ టూల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ) రాజేంద్ర రాజమనే పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పో ఈ నెల 23 వరకు కొనసాగనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	523	విజయవాడ	535
20 జనవరి		విశాఖపట్నం	550
చిత్తూరు	548	వరంగల్	525
గోదావరి	535	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	103
విశాఖపట్నం	101		

ఎల్ఐసీ నుంచి జీవన్ ధార 2 ప్లాన్



న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) జీవన్ ధార 2 ప్లాన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఇది వ్యక్తిగత, సేవింగ్స్ డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్. కనీస ఎంట్రీ వయసు 20 సంవత్సరాలు. గరిష్ఠ ఎంట్రీ వయసు 80, 70, 65 సంవత్సరాలు. ప్రారంభం నుంచి యాన్యుటీకి అనుమతిస్తారు. సోమవారం నుంచి ఈ ప్లాన్ విక్రయానికి అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్ కింద 11 యాన్యుటీ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి. ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి దీన్ని ఆవిష్కరించారు. డిఫర్‌మెంట్ సమయంలో జీవిత బీమా కవరేజీ కూడా కల్పిస్తారు. అధిక వయసుకి అధిక యాన్యుటీ రేట్లు వర్తిస్తాయి. రెగ్యులర్ ప్రీమియం, సింగిల్ ప్రీమియం అందుబాటులో ఉంటాయి. డిఫర్‌మెంట్ (పాలసీదారుడు ఎంచుకున్న మేరకు భవిష్యత్తులో బీమా పాలసీ ప్రయోజనాలు అందుకునేందుకు నిర్దేశించుకున్న సమయం) కాలపరిమితి రెగ్యులర్ ప్రీమియంలో 5-15 సంవత్సరాలు. కాగా సింగిల్ ప్రీమియంలో 1-15 సంవత్సరాలు ఉంటుంది. డిఫర్‌మెంట్ సమయంలోను, ఆ తర్వాత కూడా రుణ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

నేడు మండపేటలో బహిరంగ సభ

అమలాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో శనివారం జరిగే భారీ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొంటారు. అమలాపురం లోక్‌సభ పరిధిలో నిర్వహిస్తున్న ఈ సభకు టీడీపీ, జనసేన నేతలు భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా మండపేటలో నిర్వహించేది 11వ బహిరంగ సభ. లక్ష మందిని సమీకరించడంలో ఇరు పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. కోనసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాల వైసీపీ కీలక నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నారు.

పవన్‌ను కలిసిన వైసీపీ ఎంపీ బాలశౌరి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎక్స్ వేదికగా జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన ఆయన తొలిసారిగా శుక్రవారం అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. కుమారుడు వల్లభనేని అనుదీప్‌తో కలిసి హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా రాజకీయాలపై కొద్దిసేపు చర్చించారు. ఇందులో ఎంపీ సీటు కేటాయింపుతోపాటు పార్టీలో చేరే తేదీ వంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులో ఆయన జనసేన పార్టీలో అధికారంగా చేరనున్నట్లు సమాచారం.

ఎన్నికలకు సమాయత్తమవ్వండి

» **బీజేపీ శ్రేణులకు పురందేశ్వరి పిలుపు**



అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తమ పార్టీ నాయకులు, శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం వెబెక్స్ మాధ్యమం ద్వారా ఆమె బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు ఏవిధంగా సన్నద్ధం కావాలనే అంశాలను వివరిస్తూ నేతలకు దిశానిర్దేశం చేశారు. 'రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి, ఆయా క్లస్టర్ల వారీగా నిర్వహించే కార్యక్రమాలకు పార్టీ జాతీయ నాయకులు హాజరవుతారని చెప్పారు. తొలిసారి ఓటుహక్కును వినియోగించుకునేవారికి బీజేవైఎం ఆధ్వర్యంలో 'ఓటర్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించాలో వివరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో వాల్ రైటింగ్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' కార్యక్రమాన్ని పొడిగించినందున ఈ కార్యక్రమంలో పార్టీ నేతలందరూ చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

'చంద్రబాబు బెయిల్ రద్దు'పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని జగన్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదావేసింది. ఈ కేసులో కౌంటర్ దాఖలుకు సమయం కావాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు గుంటూరు ప్రమోద్ కుమార్, ప్రేరణ కోర్టును అభ్యర్థించడంతో ఉన్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ లోపు ఇరు పక్షాలు తమ వాదనలను లిఖిత పూర్వకంగా సమర్పించాలని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల వర్గీకరణ అంశంపై అధ్యయనం చేసేందుకు కేంద్రప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలోని ఈ కమిటీలో కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, గిరిజనశాఖ, సామాజిక న్యాయశాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఈ నెల 23న ఈ కమిటీ తొలిసారిగా సమావేశం కానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'ఎస్సీలలో మాదిగ తదితర సామాజిక వర్గాల ప్రయోజనాలను పరిరక్షించటానికి తీసుకోవాల్సిన చర్యలను అధ్యయనం చేసేందుకు కేంద్రప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఎస్సీలలో సాపేక్షికంగా ముందంజలో ఉన్న వర్గాల కారణంగా నష్టపోతున్న అత్యంత వెనుకబడిన వర్గాలకు.. రిజర్వేషన్ ప్రయోజనాల్లో న్యాయమైన వాటా లభించేలా ఈ కమిటీ చూస్తుంది' అని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటైందని తెలిపాయి. ఎస్సీ కులాల వర్గీకరణ జరపాలంటూ కేంద్రానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి ఇప్పటికే విజ్ఞప్తులు అందాయి. ఈ అంశంపై పలు న్యాయస్థానాలు విచారణ కూడా జరిపాయి. ప్రస్తుతం ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట ఎస్సీ వర్గీకరణ అంశం ఉంది.

రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రమాదం

» **వెస్టెక్స్ ఏషియా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అపశ్రుతి**

» **కంపెనీ సీఈవో మృతి.. ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలు**

» **ఏరియల్ యాక్ట్ ద్వారా స్టేజీపై దిగుతుండగా ఘటన**



సంజయ్‌షా (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన వెస్టెక్స్ ఏషియా కంపెనీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ ఘటనలో సదరు కంపెనీ సీఈవో మృతి చెందగా, కంపెనీ ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముంబైకి చెందిన సంజయ్ షా(56) చికాగోలో స్థిరపడ్డారు. ఆయనకు విస్టెక్స్ ఏషియా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. కంపెనీ ఏర్పాటు చేసి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రామోజీఫిల్మ్ సిటీలోని లైమ్-లైట్ గార్డెన్ వేదికగా గురు, శుక్రవారాల్లో సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి 7గంటలకు ఈ వేడుక ప్రారంభమైంది. కంపెనీ సీఈవో సంజయ్‌షాతో పాటు ప్రెసిడెంట్ విశ్వనాథ్ రాజ్‌దాట్ల ఏరియల్ యాక్ట్ ద్వారా స్టేజీ మీదకు వచ్చేలా ఈవెంట్ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏరియల్ యాక్ట్ ద్వారా వారిద్దరూ స్టేజీ మీదకు దిగే క్రమంలో ఒక వైపున ఉన్న ఐరన్ తీగలు తెగిపోయాయి. దీంతో సుమారు 20అడుగుల ఎత్తు నుంచి వారిద్దరూ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ తొలుత సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ సంజయ్‌షా గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కంపెనీ ప్రెసిడెంట్ విశ్వనాథ్‌రాజ్ దాట్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈవెంట్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



"సీఎం జగన్ తీరుతో రాష్ట్రం విధ్వంసమవుతోంది. రైతులు బాగున్నారా? యువతకు ఉద్యోగాలు వచ్చాయా? నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉన్నాయా? ప్రభుత్వ ఉద్యోగులు బాగున్నారా? ఏ కులంవారైనా... చివరికి రెడ్లన్నా బాగున్నారా?"

"సీఎం సొంత జిల్లాలో 35మండలాలు కరువు బారిన పడ్డాయి. అయినా ఒక్క కరువు మండలాన్ని ప్రకటించలేదు. జిల్లాలో కరువు తీవ్రంగా ఉందని అధికారులు చెబితే... అదేమీ లేదని ఫైలు వారి ముఖాన విసిరిగొట్టారు. నేను ఉండి ఉంటే కేంద్రాన్ని ఒప్పించి డబ్బులు తెచ్చి కరువు రైతులను ఆదుకునేవాడిని."

"మీ సహకారం లేకపోతే, మీలో చైతన్యం లేకపోతే మళ్లీ ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం నా ఒక్కడి చేతుల్లో లేదు. గత ఎన్నికల్లో వైసీపీకి అన్ని సీట్లు గెలిపించారు. మీ పరిస్థితి మారిందా, ఉద్యోగాలొచ్చాయా? జగన్‌రెడ్డి.. మాటలు కోటలు దాటాయి గాని చేష్టలు గడప కూడా దాటలేదు.

\- చంద్రబాబు

జగన్.. ఇంటికే

(మొదటి పేజీ తరువాయి)

అయిన జగన్‌కు ఇసుక నుంచీ తైలం తీసే శక్తి ఉందని, ఆ కారణంగానే రాష్ట్రాన్ని దోచేస్తున్నారని ఆరోపించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై గతంలో తాను ఉక్కుపాదం మోపానని, శేషాచల అడవుల్లో తమిళనాడు స్మగ్లర్లు 32మంది టాస్క్‌ఫోర్స్ కాల్పుల్లో మృతి చెందిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఇపుడు జగన్ దొంగ వ్యాపారాలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని, పోలీసు ఎస్కార్ట్ పెట్టి మరీ ఎర్రచందనం పంపిస్తున్నారని ఆరోపించారు. జగన్ టైం అయిపోయిందని, ఇక ఆయన ఇంటికి పోవడం ఖాయమన్నారు. ఈసారి పులివెందుల కూడా టీడీపీదేనని స్పష్టం చేశారు. శిశుపాలుడిని ఆనాడు వంద తప్పుల వరకే భరించారని, ఇపుడీ తుగ్లక్ వెయ్యి తప్పులు చేసినా ఇంకా భరిస్తారా అంటూ ప్రజలను చంద్రబాబు ప్రశ్నించారు.

సీనియర్ నేతలను లెక్క పెట్టని అహంకారం

జగన్ పాలన బాగా లేదని మొదటగా చెప్పింది వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డేనని చంద్రబాబు అన్నారు. వారిది రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబమని, ఎన్టీఆర్, వైఎస్ వద్ద ఆనం మంత్రిగా పనిచేశారని తెలిపారు. ప్రజల సమస్యల కోసం అడిగితే ఆయన్ను దూరం పెట్టారని ఆరోపించారు. సీనియర్ నేతలను లెక్క పెట్టని అహంకారం ఎవరిదని చంద్రబాబు ప్రశ్నించగా... జగన్‌ది అంటూ ప్రజల నుంచి పెద్దఎత్తున సమాధానం వచ్చింది. రాష్ట్రంలో 29మంది ఎస్సీ ఎమ్మెల్యేలుంటే వారందరినీ మార్చేశాడని, ఈ ఊరి చెత్త ఇంకో ఊరిమీద అన్నట్టుగా చేస్తున్నాడని ఆరోపించారు. జగన్ బాణం రివర్సుగా వచ్చిందని, ఇదేనా ఆయన విశ్వసనీయత అని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.95వేల కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని చెప్పారు. బిల్లులు మంజూరుకాక అప్పులపాలై 43మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకోగా వారిలో వైసీపీ సర్పంచ్ కూడా ఉన్నారన్నారు. మద్యపాన నిషేధం హామీ ఇచ్చి నిషేధించకపోగా మద్యం వ్యాపారాన్ని తాకట్టు పెట్టి రూ.36వేల కోట్ల అప్పు తెచ్చాడని ఆరోపించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

రాష్ట్రానికి జగన్ చేసింది ఇదీ...

"శ్రీవారి భక్తుల కోసం రూ.630కోట్లతో మేం తిరుపతిలో గరుడ వారధి తెస్తే, జగన్ గంజాయి తెచ్చారు. తిరుపతిని, టీటీడీని పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయడానికి నేను ప్రయత్నించాను. అక్కడ జగన్ దొంగ ఓట్ల సంస్కృతి తెచ్చారు. ఎర్రచందనం అక్రమ రవాణాను మేం ఉక్కుపాదంతో అణచివేస్తే ప్రస్తుతం జగన్ చిత్తూరు అసెంబ్లీ టికెట్ స్మగ్లర్‌కే ఇస్తున్నారు. రాష్ట్రంలో రూ.16లక్షల కోట్ల పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థలతో మేం ఒప్పందాలు చేసుకుంటే ఇపుడు జగన్ 24శాతం నిరుద్యోగంతో ఏపీని చిట్టచివర నిలబెట్టారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను మేం రప్పిస్తే జగన్ అమరరాజా వంటి కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమివేస్తున్నారు. 20ఏళ్ల కిందటే నేను ఐటీ ఉద్యోగాలు కల్పిస్తే జగన్ ఇప్పుడు యువతకు వలంటీరు, మటన్ షాపు, చేపల షాపు, బ్రాందీ షాపుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తున్నారు. మేం అంతర్జాతీయ బ్రాండ్ ఉన్న పరిశ్రమలు రాష్ట్రానికి తెప్పిస్తే జగన్ నాసిరకం మద్యం బ్రాండ్లు తెప్పిస్తున్నారు."

దొంగ ఓట్ల కోసం తాపత్రయం

"జగన్‌కు ఓటమి భయం చుట్టుకుంది. అందుకే దొంగ ఓట్ల కోసం తాపత్రయపడుతున్నారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వ్యవహారంలో రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా సస్పెండయ్యారు. ఈ రోజు ఒక తహసిల్దారు, డిప్యూటీ తహసిల్దారు సస్పెండయ్యారు. ఉపఎన్నికల్లో అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో కేసులు వేసిన టీడీపీ నేత పనబాక లక్ష్మి ఇంటిచుట్టూ ఇపుడు బాధ్యులైన అధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కేసులు వెనక్కి తీసుకోవాలంటూ బతిమాలుకుంటున్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం కావాలో రాతియుగం కావాలో ప్రజలే తేల్చుకోవాలి. అందరూ ఏకమై ముందు కు రావాలి. విధ్వంసక తుగ్లక్ పాలనను తరిమికొట్టాలి. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా కుటుంబ వికాసం పేరిట ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు ఉద్యమానికి శ్రీకారం చుట్టాం. పేదరికం నుంచి పేదలను బయటికి తెచ్చేవరకూ వారితోనే ఉంటా."

హు కిల్డ్ బాబాయ్?

"వివేకా హత్య వ్యవహారం చూస్తే టాలీవుడ్, బాలీవుడ్ సినిమాలను తలపించే విధంగా ఉంది. మలుపులు మీద మలుపులు. సస్పెన్స్ మీద సస్పెన్స్‌లు. 2019 మార్చి 15న వివేకాను ఘోరంగా చంపేశారు. ఆ రోజు ఆయన సొంత చానెల్‌లో గుండెపోటు అని వచ్చింది. రక్తం చూసిన తర్వాత రక్తపు వాంతులు అని మాట మార్చేశారు. ఆయన కూతురు పట్టుబట్టి పోస్టుమార్టం చేస్తే.. గొడ్డలితో నరికితే బ్రెయిన్ కూడా చెల్లాచెదురై పోయిందంటే అప్పుడు మాట మార్చేశారు. ఆ రోజు 'నాకు నాన్న లేడు.. బాబాయ్‌ని కూడా చంపేశారు' అని జగన్ కొత్త నాటకం ఆడాడు. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? నారాసుర చరిత్ర అని నా చేతిలో కత్తిపెట్టి స్టోరీ రాశాడు ఈ దుర్మార్గుడు. చివరకు కూతురైన సునీత, అల్లుడిపైన కేసు తోసేసే పరిస్థితికి వచ్చారు. రేపు మిమ్మల్ని, నన్ను చంపినా దిక్కులేదు."



వెంకటగిరి బహిరంగసభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, హాజరైన జనం

జనంపై పన్నుల మోత

"గత ఎన్నికల ముందు సుపరిపాలన అందిస్తానన్నారు. ఇపుడు పెట్రోల్, డీజల్ ధరలు, ఆర్టీసీ చార్జీలు పెరిగాయ్. చెత్తపన్ను వేశారు. కరెంటు చార్జీలు పెరుగుతూనే ఉన్నాయి. రూ.200వచ్చే కరెంటు బిల్లు ఇపుడు రూ.1000 వస్తోంది. కరెంటు విషయంలో సంస్కరణలు తెచ్చిన పార్టీ టీడీపీ. ఐదేళ్ల ఒక్కపైసా చార్జీ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ ఇచ్చాం. ఈరోజు ఫ్యూయల్ చార్జి, పర్చేజ్ కాస్ట్, ట్రూఅప్ చార్జీ అంటూ పేదవాడు భరించలేని భారం వేశారు. 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమన్నారు. ఇప్పుడు ఇచ్చే పరిస్థితి ఉందా? కరెంటు చార్జీలు 9సార్లు పెంచాడు ఈ పెద్దమనిషి. ఒక తుగ్లక్, ఒక అసమర్థుడు, ఒక విధ్వంసకారుడు ఏం చేస్తాడో చెప్పడానికి విద్యుత్ రంగమే ఉదాహరణ. అధికారంలోకి వస్తూనే పీపీఎల్ రద్దు అన్నారు, డిస్కమ్‌లను క్రైసిస్‌లోకి తోసేశారు. ఇష్టానుసారంగా అప్పుల కోసం రైతుల మోటర్లకు మీటర్లు పెట్టిన అసమర్థుడు జగన్"

జగన్ రాయలసీమ ద్రోహి

కడప స్టీల్‌ప్లాంట్ వస్తుందన్న నమ్మకం ఉందా..? రెండుసార్లు రిబ్బన్ కట్ చేశాడీ సోగ్గాడు.. రిబ్బన్లు కట్ చేసుకోవడం, రంగులేసుకోవడం, పేర్లు పెట్టుకోవడం మీద ఉన్న శ్రద్ధ పని మీద లేదు. నేను కూడా రాయలసీమ బిడ్డనే. ఇక్కడే పుట్టా... మీ అందరి కళ్ల ముందు పెరిగా. ఒకటే హామీ ఇస్తున్నా రాయలసీమకు అన్నీ అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కానీ మనకు నీళ్లు లేవు. ఆ నీళ్లు ఇచ్చిన యుగపురుషుడు నందమూరి తారకరామారావు. సీమకు నీళ్లు ఇస్తే రతనాల సీమ అవుతుందని, కృష్ణాజలాల్లో తగిన కోటా ఇవ్వాలని నిర్ణయించారు. గండికోట ప్రాజెక్టును, బ్రహ్మంసాగర్‌ను, తెలుగుగంగను తవ్విన వ్యక్తి ఎన్టీఆర్. ఆ తర్వాత ఇరిగేషన్ ప్రాజెక్టులపై మేం శ్రద్ధ పెట్టాం. 15ఏళ్లలో రూ.12,500కోట్లు ఇరిగేషన్‌కు పెట్టి ప్రాజెక్టులను పరిగెత్తించిన పార్టీ టీడీపీ. పులివెందులకూ నీళ్లిచ్చి పంటలను కాపాడిన ఘనత టీడీపీది. జగన్మోహన్‌రెడ్డీ.. రాయలసీమకు ఐదేళ్లలో నేను ఖర్చుపెట్టిన దానిలో 20శాతం అయిన ఖర్చు పెట్టారా.. ప్రాజెక్టులు కట్టారా, కాల్వలు తవ్వారా, పిల్ల కాల్వలు పూర్తి చేయలేదు కాబట్టి జగన్ రాయలసీమ ద్రోహి. ఈ రాయలసీమను రతనాల సీమగా చేసే బాధ్యత మాది. రైతును రాజుగా చేసే బాధ్యత టీడీపీ తీసుకుంటుంది. అధికారంలోకి వస్తూనే భూ రక్షణ చట్టం తీసేసి మీ ఆస్తులు కాపాడతాం. విలువలు లేని వ్యక్తి రాజకీయాలకు అనర్హుడు."

దేశీయ హెపటైటిస్-ఏ వ్యాక్సిన్ వచ్చేసింది

» **'హవిష్యూర్'ను విడుదల చేసిన ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ లిమిటెడ్**

» **విస్తృతమైన క్లినికల్ ట్రయల్స్ తర్వాత అందుబాటులోకి**

» **కాలేయ ఇన్‌ఫెక్షన్లకు చెక్**

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మొట్టమొదటిసారిగా దేశీయంగా అభివృద్ధి చేసిన హెపటైటిస్-ఏ వ్యాక్సిన్ 'హవిష్యూర్'ను ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) శుక్రవారం విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన వ్యాక్సిన్ విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజ్ కర్పన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐఎల్ ఎండీ డాక్టర్ కె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం హెపటైటిస్-ఏ వ్యాక్సిన్ల కోసం దిగుమతులపై ఆధారపడుతున్నామని, తొలిసారిగా దేశీయంగా వ్యాక్సిన్‌ను తయారు చేశామని తెలిపారు. విస్తృతమైన క్లినికల్ ట్రయల్స్ అనంతరం హవిష్యూర్ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. హెపటైటిస్-ఏ కలుషిత ఆహారం, నీరు వల్ల సోకుతుందని.. కాలేయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఈ వైరస్ నుండి వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుందని చెప్పారు. హెపటైటిస్-ఏ సోకిన వారికి, దీర్ఘకాలిక కాలేయ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు టీకా అవసరమన్నారు. సాధారణ రోగనిరోధకత (ఇమ్యూనిటీ) ఉన్న పిల్లలకు కూడా టీకాను సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. ఇది రెండు మోతాదుల టీకా అని, తొలి మోతాదును 12 నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న పిల్లలకు ఇస్తారని, మొదటి డోస్ ఇచ్చిన ఆరు నెలల తర్వాత రెండో డోస్ ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎల్ డిప్యూటీ ఎండీ డాక్టర్ ప్రియబ్రత పట్నాయక్, శుకుల్ శ్రీ వాత్సవ తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ లిమిటెడ్.. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ అనుబంధ సంస్థ.



హవిష్యూర్ వ్యాక్సిన్‌ను విడుదల చేస్తున్న ఐఐఎల్ డిప్యూటీ ఎండీ డాక్టర్ ప్రియబ్రత పట్నాయక్, శుకుల్ శ్రీ వాత్సవ, ఎమ్మెల్యే నాగరాజు, అజయ్‌మిశ్రా, ఐఐఎల్ ఎండీ ఆనంద్‌కుమార్

అభ్యర్థులపై సాగుతున్న జగన్ కసరత్తు

» **సిట్టింగులపై కొత్త ఇన్‌చార్జిల ఫిర్యాదు**

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో సీఎం జగన్ కసరత్తు ఇంకా సాగుతోంది. గురువారం రాత్రి పొద్దుపోయాక తొమ్మిది మందితో కూడిన జాబితాను విడుదల చేసిన జగన్ మరి కొన్ని కీలక అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలపై దృష్టి సారించారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో బిజీగా ఉన్న ఆయన ఎంపికల కార్యక్రమాన్ని సీఎంఓ ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించేశారు. కాకినాడ ఎంపీ వంగా గీతను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. అయితే పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు తనకు సహకరించడం లేదని ఆమె ఫిర్యాదు చేశారు. దొరబాబు అనుచరులు తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని గీత అసహనం వ్యక్తం చేశారు. అయితే.. సిట్టింగులకు చాన్స్ ఇవ్వకుండా, సహకరించాలంటే ఎలా అని పార్టీ నేతలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురంలో వంగా గీత బలమైన అభ్యర్థిగా జగన్ విశ్వసిస్తున్నారు. అందుకు భిన్నంగా ఆమె స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను సీఎంఓ దృష్టికి తీసుకువెళ్లడం చర్చనీయాంశమయింది. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కూడా సీఎంఓకు గురువారం వచ్చారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వచ్చారు. అనకాపల్లి టికెట్ దక్కకపోవడంతో పెందుర్తి స్థానం ఇవ్వాలని మంత్రి గుడివాడ అమర్నాథ్ కోరుతున్నారు. గురువారం పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తనకు మరో అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. వీరద్దరూ గురువారం సీఎంఓకు వచ్చారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల, మంత్రి బొత్సలతో సమావేశమయ్యారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్ కూడా మరోసారి సీఎంఓకు వచ్చారు. అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అంటూనే నేతలు క్రమం తప్పకుండా సీఎంఓకు రావడం నియోజకవర్గాల్లో చర్చనీయాంశమైంది. కాగా, ఈ నెల 25న సీఎం జగన్ విశాఖ జిల్లా భీమిలిలో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైసీపీ నేతలు సమాయత్తమవుతున్నారు.



రేపు పగ్గాలు చేపట్టనున్న షర్మిల

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సోదరి వైఎస్ షర్మిల ఆదివారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి నాలుగు గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. ప్రత్యేక విమానంలో షర్మిలతో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డితో సహా పలువురు కేంద్ర మాజీ మంత్రులు.. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, తులసిరెడ్డి తదితరులు ఇడుపులపాయ వెళతారు. ఆదివారం ఉదయం కడప నుంచి ప్రత్యేక విమానంలో షర్మిల గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం విజయవాడలో ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఉదయం 11 గంటలకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరిస్తారు.

వైఎస్ అభిమానులపై ఫోకస్

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించాక.. పార్టీని బలోపేతం చేయడంపై షర్మిల దృష్టి సారిస్తారని చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకురావడంలో భాగంగా పార్టీ పట్ల అభిమానం కలిగిన కుటుంబాలను వెనక్కు రప్పించాలన్న యోచనలో ఆమె ఉన్నారు. ప్రధానంగా వైఎస్‌ను అభిమానించే నేతలు.. ఆయన కుమారుడు జగన్ వెంట వైసీపీలోకి వెళ్లారు. ఇప్పుడు వారంతా ఆ పార్టీలో సరైన గౌరవం దక్కక అవమానాలు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిని తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకురావాలని షర్మిల భావిస్తున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తొలి నుంచి వైఎస్ కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్నారు. ఆయన విజయవాడలో షర్మిల పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టుగా పార్టీ ముఖ్యనేతలు వెల్లడించారు. మంగళగిరి ఎమ్మెల్యే బాటలోనే.. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సహా.. రాయలసీమలోని పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరతారని చెబుతున్నారు. కాగా.. ఈ నెల 23న ఏపీసీసీ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ విజయవాడ వస్తున్నారు. ఆ రోజు అయన పార్టీ నేతలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా షర్మిలకు రోడ్ మ్యాప్‌ను అందజేస్తారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ టికెట్ ఆశించి భంగపడ్డ నేతలను సంప్రతించేందుకు ఏపీసీసీ ప్రయత్నాలు చేపట్టింది. రాజశేఖరరెడ్డితో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూనే.. కాంగ్రెస్‌లో దక్కే ప్రాధాన్యమేవిటో కూడా వివరించనున్నారు.

జగన్ నట్టేట ముంచారు!



» **తిరువూరు సీటు నాదేనని నమ్మించారు**

» **ఎంపీ కేశినేని నాని పైరవీలకు నన్ను బలిచేశారు**

» **తిరువూరు దళిత ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆగ్రహం**

తోట్లవల్లూరు, జనవరి 19: 'ముఖ్యమంత్రి జగన్, నన్ను నమ్మించి నట్టేట ముంచారు. విధేయతకు విలువ లేదు. పైరవీదారులకే పెద్దపీట వేసినట్లయింది' అని తిరువూరు దళిత ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. నాలుగో జాబితాలో తిరువూరుకు టీడీపీ నుంచి వచ్చిన నల్లగట్ల స్వామిదాసుని వైసీపీ అభ్యర్థిగా ప్రకటించటంపై రక్షణనిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంలో రక్షణనిధి మీడియాతో మాట్లాడారు. 'తిరువూరులో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది మారుమూల తండాలకు సైతం వెళ్లి ప్రజలకు సేవ చేశా. నియోజకవర్గంలోని నలుగురు వైసీపీ నాయకులు... తమ పెత్తనం లేకుండా పోయిందని నాపై 6నెలుగా కుట్రలు చేస్తూ వచ్చారు. అయినా గడప గడపకు విజయవంతంగా నిర్వహించి రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచాను. మళ్లీ టికెట్ ఇచ్చేందుకు ఇదే కొలమానమని జగన్ చెప్పుకొచ్చారు. అయితే టీడీపీ ఎంపీ కేశినేని నాని రంగప్రవేశం చేసి తన అనుచరుడైన నల్లగట్ల స్వామిదాసుకు టికెట్ ఇప్పించేందుకు కుట్రలు చేశారు. పైరవీలకే పెద్దపీట వేస్తానని జగన్ నిరూపించారు. గడపగడపకు పూర్తిచేసిన ఎమ్మెల్యేకి టికెట్ ఇస్తానని చెప్పి మాట తప్పారు. నన్ను తప్పించి ఏ అర్హత ఉందని స్వామిదాసుకు టిక్కెట్ ఇచ్చారు?' అని రక్షణనిధి ప్రశ్నించారు.

తప్పకుండా ఎమ్మెల్యేగా పోటీచేస్తా

'వచ్చే ఎన్నికల్లో వైసీపీ టికెట్ రానంతమాత్రాన నేను ప్రజలకు దూరం కాలేను. తప్పకుండా ఎమ్మెల్యేగా పోటీచేస్తా. తిరువూరు ప్రజలు రాజకీయాలకు అతీతంగా నాకు ఫోన్లు చేస్తున్నారు. టీడీపీ టికెట్ తెచ్చుకున్నా తాము ఓటేసి గెలిపించుకుంటామని చెబుతున్నారు. త్వరలో నా రాజకీయ భవిష్యత్‌ను ప్రకటిస్తా. వైసీపీ పెద్దలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కలిసేదిలేదు' అని రక్షణనిధి స్పష్టం చేశారు.

గుండెల్లో ఉన్నావన్నారు.. పక్కన పెట్టారు

» **నందికొట్కూరు వైసీపీ ఎమ్మెల్యే ఆర్థర్ ఆవేదన**

» **రేపు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి**



కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: ఎమ్మెల్యే టికెట్ తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చిన తమ పార్టీ అధిష్ఠానం చివరకు తనను విస్మరించిందని నందికొట్కూరు వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా వైసీపీ విడుదల చేసిన నాలుగో జాబితాలో ఆయన పేరు లేదు. నందికొట్కూరు(ఎస్సీ) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆయన స్థానంలో కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుధీర్‌ను వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ సందర్భంగా ఆర్థర్ కర్నూలులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి.. తనకు సీటు తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సజ్జలతో సమావేశమైనప్పుడు కూడా 'సీఎం జగన్ గుండెల్లో నువ్వున్నావు.. అధైర్యపడాల్సిన అవసరం లేదు.. తప్పకుండా సీటు వస్తుంది' అని హామీ ఇచ్చారన్నారు. ఐప్యాక్ సర్వేలో కూడా తనకే ఎక్కువ శాతం అనుకూలంగా వచ్చిందని, కానీ ఎందుకో తనకు టికెట్ దక్కలేదన్నారు. నందికొట్కూరులో ఎప్పటి నుంచో ఒకే ఇన్‌చార్జ్ పెత్తనం కొనసాగుతూనే ఉందంటూ ఆయన పరోక్షంగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఈ నెల 21న కేఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగే కార్యకర్తలు, అభిమానులు, నాయకుల సమక్షంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని ఎమ్మెల్యే ఆర్థర్ వెల్లడించారు.

అంబేడ్కర్ సభలో సొంత భజన

- పార్టీ ప్రచారంలా విగ్రహావిష్కరణ కార్యక్రమం
- జెండాలు, బ్యానర్లతో రాజకీయ రంగు
- సర్కారు సొమ్ముతో జగన్ సర్కారు గొప్పలు
- భారీగా బెజవాడకు జనం తరలింపు
- సచివాలయ ఉద్యోగులకు బాధ్యత అప్పగింత
- ఆర్టీసీ బస్సులు పంపడంతో ప్రజలకు పాట్లు
- విజయవాడలో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జగన్ 'బటన్' నొక్కుడు కార్యక్రమాల తరహాలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవాన్ని వైసీపీ ప్రచార కార్యక్రమంలా మార్చేశారు. సర్కారు సొమ్ముతో సొంత డబ్బా కొట్టుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఫ్యాన్ గుర్తుతో ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా చేశారు. జనాన్ని తరలించిన బస్సులపై జై జగన్ నినాదాలతో కూడిన బ్యానర్లు, జగన్ బొమ్మ, ఫ్యాన్ గుర్తు, వైసీపీ జెండాలు దర్శనమిచ్చాయి. పేరుకు అంబేడ్కర్ చిత్రాన్ని ఏర్పాటు చేశారు. విజయవాడ నగరంతో పాటు కార్యక్రమం జరిగిన స్వరాజ్ మైదాన్ ప్రాంతంలోను వైసీపీ జెండాలు వెలిశాయి. సభలో ప్రతి నేత జగన్‌ను అభినవ అంబేడ్కర్‌గా ప్రశంసించారు. సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవంలోనూ జగన్ రాజకీయాలు మాట్లాడటాన్ని పలువురు తప్పుపట్టారు. సభలో అంబేడ్కర్ గొప్పతనం వివరించడం కన్నా జగన్ ఫొటోల ప్రచారమే ఎక్కువగా చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి దళిత మేధావులను ఆహ్వానించకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. మొత్తానికి ఈ కార్యక్రమానికి రాజకీయ రంగు పులిమి జనాన్ని ఇబ్బంది పెట్టారనే విమర్శలు వచ్చాయి. మరోవైపు డబ్బులు ఇచ్చి మరీ బలవంతంగా జనసమీకరణ చేశారనే ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి మొత్తం 2 వేల బస్సుల్లో విజయవాడ సభకు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సచివాలయం నుంచి 10 మంది చొప్పున జనసమీకరణ చేసి విజయవాడకు తరలించారు. సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి మరీ జనాన్ని తరలించారు. పలు చోట్ల ఒక్కొక్కరికి రూ.500 డబ్బులిచ్చి తరలించారు. ఆర్టీసీ బస్సులను పెద్ద ఎత్తున కేటాయించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బస్సులు అందుబాటులో లేకపోవడంతో చాలాచోట్ల ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బస్టాండుల్లో గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. పలు చోట్ల ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 107, ఏలూరు జిల్లా నుంచి 100 బస్సులలో జనాన్ని విజయవాడకు తరలించారు.

మరీ ఇంత ప్రచార పిచ్చా!

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభ సందర్భంగా ఏపీ ప్రదర్శించే ముందు కాలచక్ర మహామండపం గోడలపై నీటి పరవళ్ల దాని మీద జగన్ ఫొటోలు కనిపించేలా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 100 డ్రోన్లతో స్పెషల్ షోలో కూడా జగన్ ప్రచారం జరిగింది. కూచిపూడి నృత్యం చిత్రం తర్వాత జగన్ ఫొటోను ప్రదర్శించారు. ఆ తర్వాత జగన్ ఫొటోతో కూడిన నవరత్నాల లోగోను ప్రదర్శించారు. అనంతరం ప్రజలతో జగన్ అన్నట్టుగా ఇద్దరు మనుషుల మధ్య జగన్ ఉన్నట్టుగా పీపుల్స్ లీడర్ జగన్ పేరుతో చిత్రాలను ప్రదర్శించారు. అంబేడ్కర్ విగ్రహం దగ్గర రాష్ట్ర ఖ్యాతి గురించి చెప్పే క్రమంలో జగన్ ఫొటోలను పదేపదే ప్రదర్శించటం ఎబ్బెట్టుగా అనిపించింది.

రాష్ట్రపతి, గవర్నర్‌కు ఆహ్వానమేదీ?

భారీ ఎత్తున ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పిలవకపోవటంపై విమర్శలు వస్తున్నాయి. దేశ ప్రథమ పౌరురాలి హోదాలో ఉన్న గిరిజన బిడ్డతో విగ్రహావిష్కరణ చేయించి ఉంటే బాగుండేదని విగ్రహావిష్కరణకు వచ్చిన పలువురు దళిత సోదరులు పెదవి విరిచారు. ఇక విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం చెంతనే రాజ్‌భవన్ ఉంటుంది. గవర్నర్‌ను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. పూర్తిగా వైసీపీ రాజకీయ కార్యక్రమంగా దీనిని నిర్వహించారని విమర్శిస్తున్నారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా బాణసంచా వెలుగులు



విజయవాడలోని స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరైన జనం

స్టాట్యూ ఆఫ్ లిబర్టీలా అంబేడ్కర్ విగ్రహం

సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం.. పేదలు, రాజ్యాంగ హక్కులకు స్ఫూర్తి: జగన్

బెజవాడలో 210 అడుగుల విగ్రహావిష్కరణ

అమరావతి/విజయవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమతా న్యాయ శిల్పం (స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్) అంబేడ్కర్ 210 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయ మహాశిల్పం అంబేడ్కర్ విగ్రహం వెలిగిపోతుందని జగన్ అన్నారు. 56 నెలల్లో నిర్మించిన ఈ విగ్రహం సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. అంబేడ్కర్ జన్మించి 133 సంవత్సరాలైందని, మరణించి 68 సంవత్సరాలైందని... ఇప్పటికి మనం అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పి సామాజిక న్యాయ శిల్పం స్థాపించామన్నారు. మరణం లేని ఆ మహా మనిషి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం ద్వారా విజయవాడ చైతన్యాల విజయవాడగా కనిపిస్తోందన్నారు. ఈ విగ్రహం పేదల హక్కులకు, రాజ్యాంగ హక్కులకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. దళిత వర్గాలకు, బలహీనవర్గాలకు అంబేడ్కర్ గొంతుకగా నిలిచారని, మరణం లేని మహానేత అంటూ కొనియాడారు. ప్రపంచంలోని అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం విజయవాడలో ఉందని చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు. అంటరానితనం తన రూపం మార్చుకుందని, పేదలను దూరంగా ఉంచడం మాత్రమే అంటరానితనం కాదన్నారు. పేదవారు ఇంగ్లిష్ మీడియం చదవొద్దని కోరుకోవడం కూడా అంటరానితనమేనన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ లాంటి సేవలందకుండా చేయాలనుకోవడం కూడా అంటరానితనమేనన్నారు. పేద విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తే దానిని వ్యతిరేకించడం కూడా మార్చుకున్న అంటరానితనానికి నిదర్శనమన్నారు. దళితులకు చంద్రబాబు ఒక సెంట్ భూమి ఇవ్వలేదని, అంబేడ్కర్ విగ్రహం నిర్మించలేదన్నారు. చంద్రబాబు రక్తంలో ఏ కోశాన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై ప్రేమ లేదని విమర్శించారు. రూ.2.47 లక్షల కోట్ల నిధులను నవరత్నాల పథకాల కింద బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేస్తున్నామని తెలిపారు. 2.10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తే అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే 80 శాతం ఇచ్చామన్నారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామానికెళ్లినా, ఏ ఇంటికెళ్లినా మార్పులు కనిపిస్తాయన్నారు. పరిపాలనా సంస్కరణలు, వ్యవసాయ విప్లవం ప్రతి ఊళ్లో కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన, బీసీ మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌పై భారీగా నిలిచిపోయిన వాహనాలు

భారీగా ట్రాఫిక్ జామ్

సీఎం పర్యటన నేపథ్యంలో విజయవాడలో ప్రధాన మార్గం మహాత్మాగాంధీ రోడ్డులో వాహనాలను అనుమతించలేదు. ఈ ప్రభావం ఇతర రహదారులపై పడింది. ఏలూరు రోడ్డు, వారధి, బెంజ్‌సర్కిల్, రామవరప్పాడు, గుణదల ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. జిల్లాల నుంచి వచ్చిన బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపేశారు. స్టేడియానికి రెండు కిలోమీటర్ల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. సభ ముగిసిన తర్వాత రద్దీ భారీగా పెరిగింది. విజయవాడలో అన్ని రహదారులపై వాహనాలు స్తంభించిపోయాయి. రెండు, మూడు కిలో మీటర్లు వెళ్లడానికే గంట, రెండు గంటల సమయం పట్టింది. రాత్రి పది గంటల వరకు ఈ ట్రాఫిక్ రద్దీ కనిపించింది. పలుచోట్ల అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి.



విజయవాడ మొఘల్రాజపురంలోని సిద్ధార్థ స్కూల్‌లో నిలిపి ఉంచిన బస్సులు

ఇరుక్కుపోయిన ఐపీఎస్

తిరుపతి ఉప ఎన్నిక సమయంలో వెంకట అప్పల నాయుడు జిల్లా ఎస్పీగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో అరాచకాలను అడ్డుకోవడంలో విఫలం కావడంతోపాటు విపక్ష నేతల ఫిర్యాదు మేరకు నమోదైన కేసులను నీరుగార్చినందుకు ఆయనను బాధ్యుడిని చేస్తూ... చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. పోలింగ్‌లో దొంగ ఓటు కార్డులు ఉపయోగించడం తీవ్రమైన అంశం. ఈ విషయాన్ని ఫిర్యాదుల్లో పేర్కొన్నా తగిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయలేదు. ఫిర్యాదులో ప్రస్తావించిన ఒకరిద్దరు వ్యక్తులను మాత్రం విచారించి... వదిలేశారు. తర్వాత కేసు పూర్తిగా మూసివేశారు. దీనికి ఎస్పీనే బాధ్యత వహించాలని ఈసీ భావిస్తోంది.

గిరీషా సస్పెన్షన్.. ఉత్తర్వులు జారీ..

తిరుపతి ఉప ఎన్నిక అక్రమాల వ్యవహారంలో ఈసీ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేస్తూ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డూప్లికేట్ ఓటర్ కార్డులు సృష్టించారనే ఆరోపణల మీద ఆయను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనధికారంగా ఒరిజినల్ ఓటర్ కార్డులు డౌన్‌లోడ్ చేసినట్లు కూడా జీవోలో పేర్కొన్నారు. సస్పెన్షన్ సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా విజయవాడ హెడ్ క్వార్టర్స్‌ను దాటి వెళ్లవద్దని స్పష్టం చేశారు.

తహసిల్దార్‌తో పాటు మరికొందరిపైనా...

ఇక... తిరుపతి తహసీల్దార్ జయరాములు, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ భాస్కర్‌ను కూడా ఈసీ సూచనల మేరకు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జయరాములు అప్పట్లో తిరుపతి అర్బన్ తహసిల్దారుగా, విజయభాస్కర్ అదే కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసిల్దారుగా పని చేశారు. జయరాములు ఏఈఆర్వోగా కూడా వ్యవహరించారు. ఓటరు ఐడీలను అక్రమంగా డౌన్‌లోడ్ చేయడంలో వీరి పాత్ర కీలకమని తేలింది. వీరితోపాటు ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను విధుల నుంచి పూర్తిగా తొలగించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ నుంచి ఐఏఎస్‌ల దాకా...

ఇరుక్కుపోయారు!

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కొక్కరుగా బలైపోతున్నారు. 'ఎమ్మెల్యే చెప్పారు... మంత్రి మాట్లాడారు'.. అంటూ వారికి దాసోహమైన అధికారుల మెడకు ఇప్పుడు ఉచ్చు బిగుస్తోంది.

ఐఏఎస్‌పై ఎఫ్ఐఆర్...

2021లో సిట్టింగ్ ఎంపీ మరణంతో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. తమ అభ్యర్థిని 'భారీ మెజారిటీ'తో గెలిపించుకునేందుకు అధికార పార్టీ అన్ని రకాల అరాచకాలకు తెర లేపింది. అందులో ఒకటి... పక్క జిల్లా, నియోజకవర్గాలకు చెందిన వాళ్ల ఫొటోలతో నకిలీ ఓటరు ఐడీలను సృష్టించడం! అప్పట్లో ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన నాటి మునిసిపల్ కమిషనర్, ప్రస్తుత అన్నమయ్య కలెక్టర్ గిరీషా లాగిన్ ఐడీతో వేలకొద్దీ ఓటరు ఐడీలను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ అక్రమాలపై విచారణ జరిపిన కేంద్ర ఎన్నికల సంఘం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. అంతేకాదు... గిరీషాపై కేసు కూడా నమోదైంది.

అప్పటి కలెక్టర్‌పైనా గురి...

తిరుపతి ఉప ఎన్నికలో అక్రమాలకు సంబంధించి అప్పట్లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి హరినారాయణ, ఎస్పీ అప్పల నాయుడు పైనా చర్యలకు రంగం సిద్ధమవుతోంది. తన జిల్లా పరిధిలో జరిగిన ఉప ఎన్నికలో భారీగా అక్రమాలు జరిగినట్లు తెలిసినా ఆయన మౌనం వహించారు. వేలకొద్దీ దొంగ ఓటర్లు, వందల వాహనాల్లో తిరుపతికి తరలి వచ్చి... వెంకన్న దర్శనానికి వచ్చిన భక్తుల్లా, పెళ్లి వేడుకలకు వచ్చిన అతిథుల్లా 'నటించారు'. ఈ విషయం పోలింగ్ రోజునే బట్టబయలైంది. దొంగ ఓటర్లు బస్సుల్లో తరలి రావడం, క్యూలో నిలబడి ఓట్లువేయడం, వీరిని విపక్ష నేతలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం వంటి దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. అయినా... నాటి కలెక్టర్ పట్టించుకోలేదు. సుమారు 20కిపైగా పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలు జరిగాయి. ఈ అంశాలతో కలెక్టర్ ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపించాలి. కలెక్టర్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఈసీ తదుపరి నిర్ణయం తీసుకుంటుంది. కానీ... అప్పటి కలెక్టర్ హరినారాయణ ఈ విషయంలో 'మౌన వ్రతం' పాటించారు. విధి నిర్వహణలో విఫలమై, ఓట్ల అక్రమాలకు సహకరించిన ఆయనపైనా చర్యలకు ఈసీ రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఇన్నేళ్లకు మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు

ఓటరు ఐడీ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేయడంపై తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సుమారు వారం కిందట ఫిర్యాదు చేశారు. 'గుర్తు తెలియని వ్యక్తులు' అక్రమంగా ఓటరు ఐడీ కార్డులను డౌన్‌లోడ్ చేశారని, వాటి ద్వారా నకిలీ ఓటరు కార్డులు తయారు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఉప ఎన్నికల సమయంలో తిరుపతి అర్బన్ తహసిల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేసిన ప్రతాప్ నాయక్, సి.శివ కుమార్, జి.విజయ్‌కుమార్‌లను తాను విచారించగా వారు తమకేమీ తెలియదని చెప్పినట్టు పేర్కొన్నారు.

ఇద్దరు సీఐలపైనా కేసు...

తిరుపతి ఉప ఎన్నికలో ఓటుకు తూట్లు పొడిచేందుకు సహకరించిన ఇద్దరు సీఐలపైనా కేసు నమోదైంది. పోలింగ్‌కు ముందురోజు రాత్రే బయటి ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో భారీగా దొంగ ఓటర్లు తరలి వచ్చారు. ఈ వీడియోలు సోషల్ మీడియా, టీవీ చానెళ్లలో ప్రసారమయ్యాయి. దీనిపై ప్రతిపక్ష నాయకులు అప్పుడే అలిపిరి, తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లలో సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదులు చేశారు. దీంతో... తిరుపతి ఈస్ట్ సీఐ శివ ప్రసాద్, అలిపిరి సీఐ దేవేంద్ర తప్పనిసరి పరిస్థితుల్లో కేసులు నమోదు చేశారు. కానీ... చిన్నపాటి చర్య కూడా తీసుకోలేదు. పోలింగ్ రోజున దొంగ ఓటర్లున్న బస్సులు, వాహనాలను విపక్ష నేతలు అడ్డుకున్నారుకానీ... పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా... ఆ వాహనాలను 'సేఫ్'గా పక్కకు తప్పించారు. దొంగ ఓట్లపై నమోదైన కేసుల్లో తూతూమంత్రం విచారణ జరిపి... 'అంతా బాగుంది. తప్పులేమీ జరగలేదు' అంటూ రెండు కేసులను మూసేశారు. తిరుపతి జిల్లాకే చెందిన ఒక ఎమ్మెల్యే, మరో మంత్రి ఫోన్ చేయగానే మొత్తం 'మ్యాటర్'ను క్లోజ్ చేసినట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే సీఐలు శివప్రసాద్, దేవేంద్రలపై కేసు నమోదైంది. అంతేకాదు... స్థానికంగా అయితే రాజకీయ, అధికారిక ఒత్తిళ్లు పనిచేసే అవకాశముందని ఈ కేసులను పక్కనే ఉన్న నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా పోలీస్ అధికారులతోనే దర్యాప్తు చేయిస్తున్నారు.

హెల్ప్ ప్లీజ్...

దొంగ ఓటరు ఐడీ స్కామ్‌లో ఇరుక్కుపోయిన పలువురు అధికారులు రాయలసీమలోనే పవర్‌ఫుల్ నేతగా పేరుపడ్డ ఓ మంత్రిని ఆశ్రయించారు. ఆయన కుమారుడు రంగంలోకి దిగి... 'తమ' వాళ్లను కేసు నుంచి తప్పించాలని పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయంలో ఈసీ సీరియస్‌గా ఉందని, ఎన్నికల ఏడాది కావడంతో తామూ ఏమీ చేయలేమని ఉన్నతాధికారులు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. మరోవైపు... కేంద్ర ఎన్నికల సంఘానికి, పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో పాటు హైకోర్టులో కేసులు వేసిన అప్పటి టీడీపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కేసులు వెనక్కు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులు బతిమాలుకుంటున్నారు.

టీడీపీ ఓట్లు తొలగించేందుకు కుట్రలు

విడపనకల్లు, జనవరి 19: టీడీపీ సానుభూతిపరుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. అనంతపురం జిల్లా విడపనకల్లులోని 22, 26వ పోలింగ్ కేంద్రాల పరిధిలో టీడీపీకి చెందిన 98మంది పేర్లను తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మృతుల పేర్లను తొలగించేందుకు క్షేత్రస్థాయిలో విచారించి, సంతకాలను సేకరించాలి. కానీ ఇద్దరిని విచారించి.. 71మంది మరణించినట్లు జాబితాలో చూపించారు. టీడీపీ బూత్ కన్వీనర్ గంగాధర సంతకం తీసుకుని 38మందిని, సీపీఐ నాయకుడు చెన్నరాయుడు సంతకం తీసుకుని 33మందిని జాబితా నుంచి తొలగించేందుకు సిద్ధమయ్యారు. తాము ఇద్దరు ముగ్గురు మరణించినట్లు సంతకాలు చేశామని, ఏకంగా 71మంది పేర్లను తమపేరిట తొలగించే ప్రయత్నం చేయడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, విడపనకల్లులో బీసీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ మద్దతుదారులైన బోయ ఈశ్వరమ్మ, కట్ల లింగమ్మ, కట్ల రవి, కట్ల నారాయణ, రామాంజినేయులు, తిప్పమ్మ.. స్థానికంగానే బస్టాండు వద్ద వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరందరూ ఒకే కుటుంబానికి చెందినవారు. టీడీపీ మద్దతుదారులు కావడంతో గుట్టుచప్పుడు కాకుండా వీరందరినీ తొలగింపు జాబితాలో చేర్చారు.

జగన్ కేసుల్లో ఎందుకీ జాప్యం?

(మొదటి పేజీ తరువాయి)

జగన్ తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి చేసిన అభ్యర్థనను శుక్రవారం కోర్టు తోసిపుచ్చింది. సీబీఐ, జగన్ కుమ్మక్కై కేసును జాప్యం చేస్తున్నారని రఘురామరాజు తరఫు న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ తెలిపారు. అసలు జగన్ కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. జాప్యానికి తాము బాధ్యులం కాదని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు. అలాంటప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. అలాగే... కింది కోర్టుల్లో జరుగుతున్న వాయిదాలతో తమకు సంబంధంలేదని సీబీఐ తరఫు న్యాయవాది జవాబిచ్చారు. సీబీఐ వంటి దర్యాప్తు సంస్థకే సంబంధంలేకపోతే ఎవరికి ఉంటుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు.

పిటిషన్ రద్దు చేయాలని ఆ ఇద్దరూ...

జగన్ బెయిల్ రద్దు కోరుతూ రఘురామ దాఖలుచేసిన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పే సరిపోతుందని తుషార్ మెహతా వాదించారు. రఘురామ పిటిషన్‌ను రద్దు చేయాలన్న జగన్ తరఫు న్యాయవాది రోహత్గీకి మద్దతు పలికారు. కాగా, ప్రజాప్రతినిధులపై దాఖలైన పిటిషన్లను త్వరితగతిన విచారించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని, దానిపై తెలంగాణ హైకోర్టు తగిన చర్యలుతీసుకుంటోందని జగన్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీం కోర్టుకు తెలిపారు. హైకోర్టు సుమోటోగా ఆదేశాలు జారీ చేసినందువల్ల మూడు నెలల గడువు ఇవ్వాలని, తర్వాత పరిశీలన జరపాలని జగన్ తరఫు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. ఎంత సమయం ఇచ్చినా ఫలితంఎక్కడా కనపడడం లేదని వ్యాఖ్యానించింది.

జాప్యంపైనే మా దృష్టి: ధర్మాసనం

కేవలం రాజకీయ దృక్పథంతోనే రఘురామరాజు ఈ పిటిషన్ దాఖలు చేశారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆయనపై పార్టీ చర్యలు తీసుకున్నందున మూడేళ్లుగా పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రఘురామరాజుపై అనర్హత పిటిషన్ దాఖలు చేసినందువల్లే ఆయన సుప్రీంలో ఈ పిటిషన్లు దాఖలు చేశారని నిరంజన్ రెడ్డి అన్నారు. అయితే... తాము రాజకీయ వ్యవహారాలను పరిశీలించడంలేదని, న్యాయపరమైన అంశాలను మాత్రమే పరిశీలిస్తున్నామని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. విచారణ ఎందుకు ఆలస్యమవుతోందన్నదే ఇక్కడ ప్రధానాంశం అని ఆయన అన్నారు. ఇంత కాలం నుంచీ ఒక్క డిశ్చార్జి పిటిషన్ అన్నా పరిష్కరించారా? అని ఆయన ప్రశ్నించారు. పలుకుబడి గల వ్యక్తుల కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టు గత ఏడాది డిసెంబరు 15న ఆదేశాలు జారీ చేసిందని ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. ఈ ఆదేశాలతో ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించిన ధర్మాసనం రెండు కేసుల విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది.

'రామానాయుడు' భూములను ఇతర అవసరాలకు వాడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులు జారీ చేసింది. మాస్టర్‌ప్లాన్‌లో విశాఖ మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) మార్పులు చేయడం, లేఅవుట్‌కు మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఆమోదం తెలపడంపై టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వివరాలన్నీ పరిశీలించి భూమి వినియోగంపై స్టే ఆర్డర్ ఇచ్చింది.

చంద్రబాబు హయాంలో కేటాయింపు

విశాఖపట్నానికి సినీపరిశ్రమ విస్తరించాలనే ఉద్దేశంతో 2003లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో భీమిలి బీచ్‌రోడ్‌కు ఆనుకుని కొండపై 34.44 ఎకరాలను నిర్మాత డి.రామానాయుడుకు కేటాయించారు. మధురవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 387, 393లలో సురేశ్ ప్రొడక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు కేటాయించారు. ఆ భూమిని స్టూడియో నిర్మాణానికి, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని సూచించింది. కొండపై భూమి కేటాయింపు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిలో ఉందని అప్పట్లో మత్స్యకారులు కొందరు కోర్టును ఆశ్రయించడంతో తరువాత కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి తీసుకున్నారు. రెవెన్యూ చట్టాలకు సంబంధించి బీఎస్‌వో-24 ప్రకారం ఏ అవసరానికైతే భూమి కేటాయించారో అందుకు తప్ప ఇతరత్రా పనులకు వినియోగించకూడదు. ఒకవేళ తప్పనిసరైతే భూ వినియోగ స్వరూపాన్ని మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలి. కానీ అవేమీ లేకుండా రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూమి వినియోగానికి సంబంధించి వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో 'మిక్స్‌డ్ యూజ్' అని మార్పులు చేసి, లేఅవుట్ వేశారని గత ఏడాది వెలగపూడి రామకృష్ణబాబు ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆ కేసును హైకోర్టు కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. శుక్రవారం పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు స్టే విధించి, మార్చి 11వ తేదీలోగా కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

వైఎస్ ప్రారంభోత్సవం

2004లో సీఎంగా రాజశేఖరరెడ్డి బాధ్యతలు స్వీకరించాక స్టూడియోకు భూమి కేటాయింపుపై విచారణకు ఆదేశించారు. తరువాత ఏమైందో గానీ ఆ స్టూడియోకు రాజశేఖరరెడ్డి చేతులు మీదుగానే ప్రారంభోత్సవం జరిగింది. స్టూడియోకు కేటాయించిన 34.44 ఎకరాలను తమకు రిజిస్టర్ చేయాలని రామానాయుడు కోరడంతో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ ప్రక్రియ పూర్తయింది. బీఎస్‌వో-24 ప్రకారం కేటాయించిన భూమికి రిజిస్ట్రేషన్ అవసరం లేదు. కానీ ముఖ్యమంత్రి స్థాయిలో ఆదేశాలు ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ చేశారు. ఆ భూములు తాకట్టు పెట్టి రుణాలు తీసుకునేందుకు వెసులుబాటు కలిగింది. అయితే భూ వినియోగ మార్పిడి వ్యవహారంలో బీఎస్‌వో-24 నిబంధనలు అమలులోనే ఉంటాయి.

జగన్ సర్కారు వచ్చాక..

2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక విశాఖలో విలువైన భూములపై పాలక పెద్దల కన్నుపడింది. బీచ్‌రోడ్డులో ప్రాజెక్టులు, భీమిలి ప్రాంతంలో భూములు బలవంతంగా దక్కించుకున్న పెద్దలు తరువాత రామానాయుడు స్టూడియోపై కన్నేశారు. స్టూడియోకు కేటాయించిన మొత్తం భూమి వినియోగించలేనందున దానిని స్వాధీనం చేసుకుంటామని స్టూడియో అధినేతపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య అనధికార ఒప్పందాలు జరిగాయనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో స్టూడియోకు ఇచ్చిన 34.44 ఎకరాలను లేఅవుట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. వీఎంఆర్‌డీఏ పాత మాస్టర్ ప్లాన్‌లో ఈ భూములు రిక్రియేషన్ జోన్‌లో ఉండగా, ఈ డీల్ కోసం అధికార పార్టీ నేతల సూచనల మేరకు వీఎంఆర్‌డీఏ అధికారులు కొత్త మాస్టర్ ప్లాన్‌లో 'మిక్స్‌డ్ జోన్'గా మార్చేశారు. ఆ ప్రకారం జీవీఎంసీ లేఅవుట్‌కు అనుమతి ఇచ్చింది. అందులో కొన్ని ఎకరాలను అధికార పార్టీ పెద్దలకు ఇచ్చినట్టు సమాచారం. అయితే వాటిని ఎవరి పేరు మీదా రిజిస్టర్ చేయలేదు. బినామీగా ఎవరి పేరున రిజిస్టర్ చేయించాలనే దానిపై 'పెద్దలు' నిర్ణయం తీసుకోకపోవడంతో ఆ ప్రక్రియ ఆగినట్టు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని
అలిపిరి నుంచి మహా పాదయాత్ర చేస్తా

» దోబీ మహా సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

గుంటూరు, జనవరి 19: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఈ నెల 21న తిరుపతిలోని అలిపిరి నుంచి తాను మహాపాదయాత్ర తలపెడుతున్నట్లు జాతీయ దోబీ మహా సంఘం అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. గుంటూరులో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలుగా కొనసాగుతున్న రజకులను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎస్సీ జాబితాలో చేర్చాలని అలిపిరి నుంచి విజయవాడ వరకు మహా పాదయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో దివంగత ఎన్‌టీఆర్ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీలుగా చేర్చాలని తీర్మానం చేశారని గుర్తుచేశారు. 2018 ఏలూరు బీసీ గర్జన సభలో బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసి ఆయా జాబితాల్లో చేర్చుతామని జగన్ హామీ ఇచ్చారని, నేటి వరకు ఆ ఊసే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఇతర నాయకులతో కలిసి అన్నవరపు నాగమల్లేశ్వరరావు పోస్టర్లు విడుదల చేశారు.

పోక్సో కేసులో పీఈటీకి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, జనవరి 19: ఒక పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినట్టు నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి ఎస్.ఉమాసునంద శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2014లో ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని ఓ జడ్పీ హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడిగా కుంజా సోమరాజు పనిచేసేవాడు. పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినికి కొత్త పుస్తకాలు ఇస్తానని చెప్పి తన గదికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటినుంచి తరచుగా ఆ బాలికపై అనేక సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

టైరు పేలి కారు బోల్తా

» ముగ్గురు మృతి, మృతుల్లో ఇద్దరు తోడికోడళ్లు


అభిరామ్


సూర్యకుమారి


సత్యవతి

కొత్తూరు (అనకాపల్లి జిల్లా), జనవరి 19: దైవ దర్శనం చేసుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలిగొంది. జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం అనకాపల్లి మండలం శంకరం వద్ద కారు బోల్తాపడడంతో ముగ్గురు మృతిచెందారు. మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు ప్రాంతానికి చెందిన 12 మంది (ఒకే కుటుంబం) గురువారం రాత్రి రెండు వాహనాల్లో శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున అరసవిల్లి సూర్యనారాయణమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీకూర్మం, విశాఖపట్నం జిల్లా సింహాచలం క్షేత్రాలను దర్శించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అనకాపల్లి మండలం శంకరం వద్దకు వచ్చేసరికి ఓ వాహనం కుడివైపు టైరు పేలడంతో అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న తోడికోడళ్లు పోలిరెడ్డి సత్యవతి (48), పోలిరెడ్డి సూర్యకుమారి (35), పోలిరెడ్డి అభిరామ్ (3) అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సుబ్బరాజు, రూరల్ సీఐ ఎ.రవికుమార్, ఎస్ఐ సీహెచ్.నరసింగరావు పరిశీలించారు. అనకాపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోల్డ్‌స్టోరేజీలో భారీ అగ్నిప్రమాదం.. సుమారు 50 కోట్ల నష్టం

దుగ్గిరాల, జనవరి 19: రైతులు నిల్వ చేసుకున్న వేలాది బస్తాల పసుపు బుగ్గిపాలైంది. గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంగళగిరి, తెనాలి, గుంటూరు నుంచి నాలుగు అగ్నిమాపక శకటాలతో, 30 మంది అగ్నిమాపక సిబ్బంది శ్రమించినప్పటికీ పూర్తిస్థాయిలో మంటలు అదుపులోకి రాలేదు. డెల్టా ప్రాంతంలోని రైతులు తాము పండించిన సుమారు 80 వేల బస్తాల పసుపు ఈ కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసుకున్నట్టు సమాచారం. రాత్రి 9 గంటల సమయంలో కోల్డ్‌స్టోరేజి సమీపంలోని చెన్నకేశవనగర్ కాలనీ మొత్తం పొగలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియనప్పటికీ షార్ట్‌సర్క్యూట్ కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం పసుపు క్వింటాల్ రూ.10 వేల వరకూ పలుకుతుండటంతో అనధికారిక లెక్కల ప్రకారం రూ.50 కోట్ల ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఆర్‌జీవీ కేసులో సీఐడీ విచారణ

» హాజరైన తెలుగు యువత నేతలు

గుంటూరు, జనవరి 19: దర్శకుడు రామ్ గోపాల్ వర్మ(ఆర్‌జీవీ) పెట్టిన కేసులో సీఐడీ విచారణకు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి శివ కేశవ హాజరయ్యారు. విచారణ నిమిత్తం గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులు ఇవ్వడంతో శుక్రవారం వారు ఈ మేరకు హాజరయ్యారు. అనంతరం, ఫిరోజ్ విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీ వర్గానికి చెందిన తనను పవిత్ర శుక్రవారం నమాజ్ కూడా చదువుకోనీయకుండా సీఐడీ విచారణ పేరుతో మానసిక వేధింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము విచారణకు ఉదయం 10.30 గంటలకు హాజరైతే సాయంత్రం 5 గంటల వరకు సుదీర్ఘ విచారణ అనంతరం 30 నుంచి 40 ప్రశ్నలు వేసి తమ మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు జప్తు చేశారని ఫిరోజ్ వాపోయారు. తమను ఈ నెల 30న రావాలని మరో నోటీసు ఇచ్చారని తెలిపారు. ఇరువురితో పాటు న్యాయవాదులు మాజీ పీపీ శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, హైకోర్ట్ న్యాయవాది పొన్నం రవీంద్ర బాబు విచారణకు హాజరయ్యారు.

కారులో రూ.2.25 కోట్ల నగదు

» బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.2.25కోట్ల నగదును చూపుతున్న ప్రొద్దుటూరు డీఎస్పీ పి.వెంకటేశన్

మార్టూరు, జనవరి 19: బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి.. బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు శుక్రవారం సాయంత్రం ఓ కారును తనిఖీ చేసి భారీగా నగదును పట్టుకున్నారు. రూ.2.25కోట్ల నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బాపట్ల డీఎస్పీ పి.వెంకటేశన్ రాత్రి మార్టూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వారంరోజుల నుంచి పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా.. బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం విజయవాడ వైపు వెళుతున్న కారును మార్టూరు, యద్దనపూడి పోలీసులు తనిఖీ చేశారు. కారులో మూడు నల్లటి బ్యాగ్‌లలో భారీగా నగదు ఉండటంతో అనుమానించి కారును స్టేషన్‌కు తరలించారు కారులో ఉన్న బీరం శ్రీనివాసరెడ్డిని ఈ నగదు విషయమై ప్రశ్నించగా తాను ప్రొద్దుటూరు నుంచి మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేయడానికి విజయవాడకు నగదు కారులో తీసుకు వెళుతున్నానని, తాను గుమస్తాగా పనిచేస్తున్నానని చెప్పినట్లు డీఎస్పీ తెలిపారు. నగదుకు సంబంధించిన ఆధారాలను అతను చూపించకపోవడంతో సీజ్ చేశామని, ఇన్‌కంటాక్స్ కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. శ్రీనివాసరెడ్డితోపాటు కారుడ్రైవర్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు సంతమగులూరు సీఐ కె.నరసింహారావు, యద్దనపూడి ఎస్ఐ నాగశ్రీను తెలిపారు.

నగదు రవాణాలో పాత్రధారులెవరు?

ప్రొద్దుటూరు నుంచి విజయవాడకు రూ.2.25కోట్ల నగదు దర్జాగా కారులో డ్రైవరుతోపాటు కేవలం ఒక వ్యక్తి తీసుకు వెళుతుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వాస్తవానికి.. ప్రొద్దుటూరు బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి. అందుకు సంబంధించి ఎవరైనా వ్యాపారులు నగదును విజయవాడకు రవాణా చేస్తున్నారా.. లేదా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా రాజకీయనాయకులు నగదును రవాణా చేస్తున్నారా? అని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. ఈ నగదు రవాణాలో సూత్రధారులెవరు అనే విషయమై పోలీసులు నిగ్గుతేల్చాల్సి ఉంది.

ఉద్యోగుల నిరసనలపై ఆంక్షలు సరికాదు: విజయ్ భాస్కర్

అనంతపురం విద్య, జనవరి 19: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ భాస్కర్ అన్నారు. వెలగపూడిలో ఉన్న రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో ఉద్యోగులు ర్యాలీలు, నినాదాలు, ధర్నాలు చేయకూడదని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడాన్ని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల హక్కులు కాలరాసేలా ఆంక్షలు విధించడం అణచివేతకు దర్పణమని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తే నిరసనలకు, పోరాటాలకు వెళ్లరని, ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకుండా ఇలా సర్క్యులర్ జారీ చేయడం తగదని, వెంటనే వెనక్కు తీసుకోవాలని విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు.


గంగిరెద్దులదిబ్బ కొండ దిగువనుంచి బిందెతో నీళ్లు తెచ్చుకుంటున్న మహిళ

నీళ్లొచ్చి.. మూడురోజులైంది!

- గంగిరెద్దుల దిబ్బ ప్రాంతంలో మొరాయించిన కుళాయిలు
- చుక్కనీరైనా రాక స్థానికుల అవస్థలు

గుణదల, జనవరి 19: వేసవిలో తాగునీటి ఇబ్బందులు సహజం కానీ, తమ ప్రాంతానికి ఏ కాలంలోనూ నీటి సరఫరా సరిగా ఉండటంలేదని గుణదల గంగిరెద్దులదిబ్బ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడురోజుల నుంచి మున్సిపల్ కుళాయిలు మొరాయించడంతో చుక్కనీరు రాక ఇబ్బంది పడుతున్నామని, తమను పట్టించుకున్న వారేలేరని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడిగితే ట్యాంకులకు నీరు అందించే మోటారు రిపేరు వచ్చిందని మరమ్మతులకు సమయం పడుతుందని వాట్సాప్ మెసేజ్‌లు పెడుతున్నారని చెబుతున్నారు. కుళాయిలు మొరాయిస్తే ట్యాంకులతోనైనా తాగునీరు అందించలేదని, దీంతో తాగునీటి కోసం నెత్తిన బిందెపెట్టుకుని ఇతర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న దుస్థితి తమకు దాపురించిందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వ్యానులకు కిరాయి ఇచ్చి డ్రమ్ముల్లో నీరు తెచ్చుకుని వాడుకుంటున్నారు.


ఇతర ప్రాంతాల నుంచి డ్రమ్ముల్లో నీరు తెచ్చుకుని కొండపైకి మోసుకుంటున్న స్థానికులు

పదిరోజుల నుంచి రంగుమారిన నీరు

కుళాయిలు మొరాయించి గంగిరెద్దుల దిబ్బవాసులు బాధపడుతుంటే మాచవరం, గుణదల, వెటర్నరీకాలని, నాగార్జుననగర్, ఎన్టీఆర్ కాలనీల్లో కుళాయిల్లో 10 రోజుల నుంచి రంగు మారిన నీరు సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులను అడుగుతుంటే తమకు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బాధ్యతలున్నాయంటున్నారని కాలనీ వాసులు పేర్కొన్నారు.



స్నానాలు చేసి మూడు రోజులైంది

గంగిరెద్దుల దిబ్బ గంగానమ్మ గుడి రోడ్డులో ఉంటున్నాం. ఓట్ల కోసం మా ఇళ్లకు వస్తారు. కుళాయిలు రాకపోతే పట్టించుకున్న నాథుడేలేడు. తాగేందుకు గుక్కెడు నీళ్లులేవు. స్నానాలు చేసి మూడురోజులవుతోంది.

- దుర్గ, స్థానికురాలు



ఆవులు తాగేందుకూ నీరు లేదు

మాకు ఆవులు ఉన్నాయి. మూగ జీవులైన ఆవులు తాగేందుకూ నీరు లేక అవస్థలు పడుతున్నాం. కుళాయిలు ఈరోజొస్తాయి, రేపొస్తాయి, మాపొస్తాయంటూ మోటార్లు రిపేర్లు చేయకుండా తాత్సారం చేస్తున్నారు.

-దుర్గయ్య, స్థానికుడు



మోటార్లకు మరమ్మతులు చేయించాలి

మూడు రోజుల క్రితం వరకు కుళాయిల నుంచి రంగు మారిన నీరు వచ్చేది. ఇప్పుడవీ రావడంలేదు. అధికారులను అడుగుతుంటే మోటార్లకు రిపేర్లువచ్చాయి. చేస్తామని మాట దాటేసి వెళ్లిపోతున్నారు. మోటార్లు వీలైనంత త్వరగా మరమ్మతులు చేయించి మాకు తాగునీరు అందించాలి

-గంగయ్య, స్థానికుడు



కొండ దిగువన వస్తున్నాయి

కొండదిగువన నివాసాలకు కొంతమేర సన్నధారగా గంటసేపు వస్తున్నాయి మాకు అసలు రావడంలేదు. దిగువ ప్రాంతాలకు పూర్తిగా వచ్చినా వెళ్లి తెచ్చుకునే వాళ్లం. వారికీ తక్కువగా రావడంతో ఇబ్బంది పడుతున్నాం.

-శ్యామ్, స్థానికుడు


రామవరప్పాడు రైవస్ కాల్వలో అమ్మవార్ల తెప్పోత్సవం

వైభవంగా ముగిసిన వెంకమ్మ పేరంటాలమ్మ జాతర

- హుండీల ఆదాయం రూ.11.38 లక్షలు

గుణదల, జనవరి 19: రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ సంక్రాంతి జాతర శుక్రవారం తెల్లవారుజామున వైభవంగా ముగిసింది. గురువారం అర్ధరాత్రి వరకు అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున రైవస్ కాల్వలో హంసవాహనంపై అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం ఊయల సేవలతో ఉత్సవం ముగిసింది. జాతర సమయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. తాత్కాలిక హుండీల ద్వారా రూ.5.25లక్షలు రాగా అమ్మవార్లకు వేసిన నగదు దండల ద్వారా రూ.6.12 లక్షలు మొత్తం రూ.11.38లక్షలు నగదు వచ్చిందని ఆలయ ఈవో పి.లోకేశ్వరి తెలిపారు. శనివారం మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.


సిటీ సివిల్ కోర్టుల వద్ద నిరసన దీక్ష చేస్తున్న న్యాయవాదులు

దీక్షలు కొనసాగిస్తాం

- భూ హక్కు చట్టాన్ని రద్దు చేసేంతవరకు ఆపం
- బార్ మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు

విజయవాడ లీగల్, జనవరి 19: ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022ను రద్దు చేసేంతవరకు బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలు కొనసాగుతాయని బెజ వాడ బార్ మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు తెలి పారు. భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారానికి 30వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షలో బార్ మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు, న్యాయవాదులు దేవరం శ్రీహరి, కేకేఎస్ సాయికిరణ్, గుర్రంకొండ రాజేష్‌బాబు, వెన్నం శ్రీకాంత్ పాల్గొన్నారు. విజయవాడలోని అన్ని కోర్టులకు వెళ్లి తాము చేస్తున్న ఉద్యమానికి సహకరించాల్సిందిగా న్యాయమూర్తులను కోరామని తెలిపారు. న్యాయమూర్తులందరూ సానుకూలంగా స్పందించారని తెలిపారు. పుప్పాల శ్రీనివాస్, జన్ను శ్రీధర్, సోము కృష్ణమూర్తి, అల్లం పద్మనాభం, అల్లు కృష్ణకిషోర్, నామాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి తదితరులు

జ్యూయలరీ ఎక్స్‌పో ప్రారంభం

లబ్బీపేట, జనవరి 19: నగరంలో కళ్లు మిరిమిట్లు గొలిపే జ్యూయలరీ ఎక్స్‌పోను నిర్వహించడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి అన్నారు. బెంజిసర్కిల్ మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ లోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో మూడు రోజులపాటు నిర్వహించే జ్యూయలరీ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ జ్యూయలరీ ఎక్స్‌పోను శుక్రవారం ఆమె ప్రారంభిం చారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు యునైటెడ్ ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.కె. మనోజ్ మాట్లాడారు. ఈ ఎక్స్‌పోలో 100కి పైగా జ్యూయలరీ బూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో ముంబయి, న్యూఢిల్లీ, బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై, జైపూర్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖ పట్నంల నుంచి విచ్చేసిన బంగారు నగల వర్తకులు అత్యాధునిక డిజైన్లతో కూడిన వివిధ రకాల మోడళ్ల నగలను ప్రదర్శి స్తున్నట్లు తెలిపారు. బం గారు గాజులు, ఉంగరాలు, నెక్లెస్లు, ఇయర్ రింగ్స్, పెండెంట్స్, బ్రైడల్, మెన్స్ కలెక్షన్స్, చైన్స్ ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిడ్‌టౌన్ ఇన్నరవీల్ క్లబ్ ప్రెసిడెంట్ హరితాచౌదరి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ప్రెసిడెంట్ వి .సరోజ, వాణీమనోహరి పాల్గొన్నారు.

వైపరీత్యాలకు లొంగనిది ప్రకృతి వ్యవసాయం

హనుమాన్‌జంక్షన్, జనవరి 19: ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి ప్రకృతి వ్యవసాయానికి ఉందని బంగ్లాదేశ్ పల్లి కర్మ సహాయక ఫౌండేషన్ సీనియర్ అధికారుల బృందానికి రైతు సాధికార సంస్థ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ వివరించారు. రైతు సాధికార సంస్థ ద్వారా కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు 15 మందితో కూడిన బంగ్లాదేశ్ బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం బాపులపాడులోని నందిగం రవికుమార్ ఫాంహౌస్‌లో ద్రవ జీవామృతం, బీజామృతం ద్వారా సాగు చేస్తున్న పండ్ల మొక్కలు, కూరగాయల పెంపకాన్ని బృందం పరిశీలించింది. రైతు సాధికార సంస్థ అధికారులు జీవ ఎరువులు తయారీపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ చక్రాన్ని, కూరగాయలు సాగును బృందం పరిశీలించింది. రామ్మోహన్‌రావు అనే రైతు అంతర పంటలతో సాగు చేస్తున్న పప్పు ధాన్యాలు, ఏ గ్రేడ్, ఏటీఎం మోడళ్లను బృందం పరిశీలించింది. కానుమోలు, కాకులపాడులో బృందం పర్యటించింది. బృందంలో బంగ్లాదేశ్ పల్లి కర్మ సహాయక ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆకోండో మొహమ్మద్ రఫీకుల్ ఇస్లాం, జనరల్ మేనేజర్ తాఫిక్ హసన్‌షా చౌదరి, మేనేజర్లు ఉన్నారు.


ప్రకృతి వ్యవసాయ చక్రాన్ని పరిశీలిస్తున్న బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం

నగరాన్ని అభివృద్ధి చేసింది టీడీపీనే

- కేశినేని నాని మాటలు నమ్మే స్థితిలో జనంలేరు
- జగన్ మనసున్న మనిషని నాని చెప్పడం విడ్డూరం
- చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శించే స్థాయా.. కేశినేని నానీది?: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 19: "నగరాన్ని అభివృద్ధి చేసింది టీడీపీనే. ఎంపీ కేశినేని నాని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సమర్థత, అసమర్థత అంటే ఏంటో ఆయన స్పష్టత ఇవ్వాలి. విజయవాడ అభివృద్ధికి చంద్రబాబు వందకోట్లు కూడా ఇవ్వలేదన్న వ్యాఖ్యల్లో నిజంలేదు. సీఎం జగన్ మనసున్న మనిషి అని కేశినేని నాని చెప్పడం విడ్డూరంగా ఉంది. నాని మాటలను నమ్మే పరిస్థితిలో నగర ప్రజలు లేరు." అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "చంద్రబాబు హయాంలోనే పంటకాలువ రోడ్డు, మహానాడు, టవర్ రోడ్డు, కరెన్సీనగర్ రోడ్లతో పాటు రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగింది. కార్పొరేషన్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు ఇచ్చారు. 2014 ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో ఎంపీగా గెలిచిన కేశినేని నాని, 2019లో ఎనిమిది వేల మెజార్టీతో గెలిచారు. మెజార్టీ ఎందుకు తగ్గిందో నాని చెప్పాలి. రెండుసార్లు ఎంపీగా పోటీ చేసే అవకాశాన్ని కేశినేనికి చంద్రబాబు ఇచ్చారు. లోకేశ్‌కు పాద యాత్ర చేయడానికి ఏం అర్హత ఉందని నాని ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శించేస్థాయి కేశినేని నానీకి ఉందా?" అని గద్దె రామ్మోహన్ ప్రశ్నించారు.

కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా చేస్తున్నారు

- సీఎం జగన్‌పై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శ

పటమట: కోడికత్తి కేసులో జనుపల్లి శ్రీనివాసురావు(కోడికత్తి శ్రీను)కు బెయిల్ రాకుండా చేసి, తల్లిదండ్రులకు అతనిని దూరం చేసి దళిత కుటుంబాన్ని ముఖ్యమంత్రి జగన్ క్షోభ పెడుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. "విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో తన అభిమాని శ్రీను కోడి కత్తితో చిన్న గాయం చేస్తే తనపై ఏకంగా హత్యాయత్నం చేశారని, విష ప్రయోగం జరిగిందని, తనకు ఆంధ్రా పోలీసులపై నమ్మకం లేదని, తనను చంపడానికి చంద్రబాబే కుట్రలు పన్నారని జగన్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఆ కేసును పట్టించుకోలేదు. బాధితుడిగా ఉన్న జగన్ కోర్టుకు వచ్చి డిక్లరేషన్ ఇస్తే శ్రీనుకు బెయిల్ వస్తుందని కోర్టు చెప్పింది. శ్రీను తల్లిదండ్రులు వేడుకున్నారు. అయినా దళిత యువకుడికి బెయిల్ రాకుండా చేస్తున్నారు. ఇదే నా దళితులపై జగన్‌కు ఉన్న ప్రేమ" అని ఎమ్మెల్యే గద్దె ప్రశ్నించారు.

కోడికత్తి కేసులో సీఎం జగన్ సాక్ష్యం చెప్పాలి

- డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్

ధర్నాచౌక్, జనవరి 19: కోడికత్తి కేసులో ఎన్ఐఏ కోర్టుకు వచ్చి సీఎం జగన్ సాక్ష్యం చెప్పాలని దళిత బహుజన పార్టీ(డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. కోడికత్తి కేసులో నిందితుడిగా ఉన్న దళిత యువకుడు శ్రీనివాస్‌కు బెయిల్ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటూ మానవ హక్కులను కాలరాస్తోందని కృష్ణస్వరూప్ ఆరోపించారు. శ్రీనివాస్ జైల్లోనే ఉండేలా జగన్ కుట్ర చేశారన్నారు. జగన్ సాక్ష్యం చెబితే కేసు ముందుకు కదులుతుందన్నారు. ఎన్ఐఏ ఈ ఘటనలో ఎటువంటి కుట్ర కోణం లేదని తేల్చిందన్నారు. శ్రీనివాస్ తల్లి, సోదరుడు చేసే పోరాటానికి తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- జై భారత్ పార్టీ వ్యవస్థాపకుడు వీవీ లక్ష్మీనారాయణ


లంకా కరుణాకర్‌దాస్‌ను అభినందిస్తున్న వీవీ లక్ష్మీనారాయణ

వన్‌టౌన్, జనవరి 19: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే జై భారత్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ వ్యవస్థాపకుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం బీఎస్పీ నాయకుడు లంకా కరుణాకర్‌దాస్‌ను ఆయన జై భారత్ పార్టీలో చేర్చుకున్నారు. దేహీ అని ప్రభుత్వాన్ని కోరకుండా ప్రజలే ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని లక్ష్మీనారాయణ సూచించారు. అవినీతి, విధ్వంసం, డ్రగ్స్, రౌడీయిజం రాష్ట్రంలో అంతం కావాలన్నారు. పార్టీలో చేరిన లంకా కరుణాకర్‌దాస్‌కు ఉపాధ్యక్ష పదవి ఇచ్చామని తెలిపారు. ఇతర పార్టీల నుంచి తనకు ఆహ్వానం ఉన్నా ఆర్థిక బానిసత్వం నుంచి విముక్తి కోసం జై భారత్ పార్టీని బలపరచేందుకు చేరానని, తన క్రైస్తవ సంస్థ ద్వారా 676 మండలాల్లో ఉపాధి కల్పన, మహిళల ఉన్నతి కార్యక్రమాలను చేపడాతనని కరుణాకర్‌దాస్ తెలిపారు. పోతిన వెంకట రామారావు, లక్కెపోగు భాస్కర్, చాట్ల రాజశేఖర్, కిషోర్, గురివిందపల్లి చిట్టిబాబు పాల్గొన్నారు. ఏలేజర్, అశోక్‌బాబు, నిర్మలకుమారి పార్టీలో చేరారు. గురువారం పార్టీలో చేరిన భవానీపురానికి చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొప్పోలు విజయకుమార్‌ను నగర కో-ఆర్డినేటర్‌గా లక్ష్మీనారాయణ నియమించారు.

గంజాయి నియంత్రణలో
వైసీపీ ప్రభుత్వ విఫలం: ఏఐవైఎఫ్

ధర్నాచౌక్, జనవరి 19: రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. శుక్రవారం దాసరిభవన్‌లో సంఘం నగర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతను ప్రభుత్వం గంజాయి మత్తులో ముంచుతోందని ఆరోపించారు. సీఎం ఇంటికి కూతవేటు దూరంలో రూ.వంద కోసం బ్లేడ్ బ్యాచ్ సృష్టించిన రగడలో మత్తు వ్యవహారం ఉందన్నారు. విజయవాడ కంట్రోల్ రూమ్ సమీపంలో గంజాయి బాక్స్‌లు దర్శనమివ్వడం సిగ్గుచేటన్నారు. లంకా గోవిందరాజులు, గుంజ క్రాంతికుమార్, సింగంశెట్టి మోహన్‌కుమార్, లంకే సాయి పాల్గొన్నారు.

ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా చెరుకూరు సత్యనారాయణ

వన్‌టౌన్, జనవరి 19: ఆర్చరీ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా చెరుకూరు సత్యనారాయణ ఎన్నికయ్యారు. నగరానికి చెందిన ఆయన ప్రస్తుతం ఏపీ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన అసోసి యేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన ఆయన అత్యధిక మెజారిటీతో గెలిచారు. ఓల్గా ఆర్చరీ అకాడమీని స్థాపించి ఆర్చరీ అభివృద్ధికి కృషి చేశారు. అకాడమీలో శిక్షణ పొందిన పలువురు క్రీడకారులు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సత్యనా రాయణను ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు, అమరావతి నెట్ బాల్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

27న మత్స్య వర్సిటీల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ మత్స్య విశ్వ విద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈ నెల 27న విజయవాడ తాడిగడపలోని క్యాంప్ కార్యాలయంలో వాక్-ఇన్- ఇంటర్వ్యూలు జరుగుతాయని వర్సిటీ ఓఎస్‌డీ సుధాకర్ తెలిపారు. ఫిషరీస్ రీసోర్స్ మేనేజ్‌మెంట్-1, ఇన్‌స్ట్రక్షనల్ ఫ్రెష్ వాటర్ ఫిష్ ఫామ్-2, ఇన్‌స్ట్రక్షనల్ బ్రాకిష్ వాటర్ ఫిష్ ఫామ్-1, ఇతర ఖాళీలను వాక్-ఇన్ ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేయనున్నట్టు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టులకు ఐసీఏఆర్ గుర్తింపు పొందిన మత్స్య, పశు వైద్య, వ్యవసాయ వర్సిటీల్లో నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై, సంబంధిత సబ్జెక్ట్‌లో ఐసీఏఆర్ నెట్ లేదా పీహెచ్‌డీ అర్హత పొంది, ఫామ్ పోస్టులకు ఆక్వా రంగంలో కనీసం ఏడాది అనుభవం ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 0866-3500560ను సంప్రదించాలని సూచించారు.

అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలి బహిష్కరణ

ధర్నాచౌక్, జనవరి 19: సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉండి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కె.గంగావతిని సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి ప్రకటించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెను విచ్ఛిన్నానికి పాల్పడటం ఉద్యమ ద్రోహమని, ఈ చర్యలకు పాల్పడిన గంగావతిని యూనియన్ బాధ్యతలతో పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్క రిస్తూ రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు.



నరకం చూశారు!

నగరంలోని స్వరాజ్యమైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జనాన్ని తరలించడానికి ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం వినియోగించుకుంది. దీంతో నగరవాసులు తమ ప్రయాణాలకు బస్సులు లేక బస్టాపుల్లో పడిగాపులు పడలేక నరకం చూశారు. నడిచిన అరకొర బస్సుల్లోనే వేలాడుతూ ప్రమాదభరిత ప్రయాణాలు చేశారు.

- విజయవాడ







విమాన ప్రయాణికులు @ 30 కోట్లు

హుస్సేన్ సాగర్ సమీపంలో సారంగ్ ఏరోబాటిక్ బృందం విన్యాసాలు

- 2030 నాటికి ఈ సంఖ్యను చేరుకుంటాం
- ఎయిర్‌పోర్టుల సంఖ్యను 200కు పెంచుతాం
- త్వరలోనే రెండు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు
- భవిష్యత్తులో ప్రతి జిల్లాకు ఒక విమానాశ్రయం
- డ్రోన్ల వాడకంపై 10వేల మంది మహిళలకు శిక్షణ
- పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య
- హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా వెళ్లే
- విమాన సర్వీసులు నడపాలి: మంత్రి కోమటిరెడ్డి
- బేగంపేటలో వింగ్స్ ఇండియా-2024 ప్రారంభం
- సారంగ్ ఏరోబాటిక్ బృందం విన్యాసాలు.. అదుర్స్

హైదరాబాద్/అల్వాల్/శంషాబాద్‌రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య అనుసంధానానికి, దేశ సామాజిక, ఆర్థిక ప్రగతికి పౌరవిమానయాన రంగం దోహదపడుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. గత కొన్నేళ్లలో దేశీయ విమానయాన ట్రాఫిక్ 57% పెరిగిందని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని చెప్పారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, కొత్త విమానాశ్రయాలతో యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని అన్నారు. పౌర విమానయాన శాఖ, ఫిక్కీ సంయుక్తంగా వింగ్స్ ఇండియా-2024 పేరిట నిర్వహిస్తున్న సివిల్ ఏవియేషన్ ఎయిర్ షోను బేగంపేట విమానాశ్రయంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 15.2 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని, 2030 నాటికి విమాన ప్రయాణికుల రద్దీ 30 కోట్లకు చేరువ చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. దేశంలో ప్రస్తుతం 149 విమానాశ్రయాల సేవలు అందిస్తుండగా.. వచ్చే ఆరేళ్లలో వాటి సంఖ్యను 200కు పెంచబోతున్నామని చెప్పారు. త్వరలో రెండు కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు రానున్నాయని చెప్పారు. భవిష్యత్‌లో దేశంలోని ప్రతి జిల్లాకు విమానాశ్రయం లేదా ఎయిర్‌స్ట్రిప్ ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విమానాలను భారత్ కొనుగోలు చేస్తోందని, మన వద్ద 57 ఫ్లయింగ్ ట్రేడ్ ఆర్గనైజేషన్లు ఉన్నాయని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో 10 వేల మంది మహిళలకు డ్రోన్ల వాడకంపై శిక్షణ ఇస్తామని, డ్రోన్ల కొనుగోలుపై 80% రాయితీ ఇస్తామని చెప్పారు. పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ మాట్లాడుతూ భారత్‌తోపాటు ప్రపంచ జీడీపీకి పౌర విమానయాన రంగ వృద్ధి దోహదపడుతుందన్నారు. రానున్న రోజుల్లో డ్రోన్లు ఈ రంగంలోకి ప్రవేశిస్తాయని చెప్పారు. ఫిక్కీ ఛైర్మన్ రెమీ మెయిలార్డ్ మాట్లాడుతూ ప్రపంచ పౌర విమానయాన రంగానికి భారత్ గ్రోత్ ఇంజిన్ అని అభివర్ణించారు. సాంకేతికత అభివృద్ధి, ఆవిష్కరణల్లో భారత్ ముందంజలో నిలవడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా విమాన సర్వీసులను నడపాలని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్యను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. కనీసం వారానికి ఒక సర్వీస్‌ను నడిపిస్తామంటూ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా-2024 కార్యక్రమం నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఫిక్కీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏవియేషన్, ఏరోస్పేస్ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 3 గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు, 3 బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో హెలీ టూరిజంను విస్తరిస్తున్నామని, పలు చోట్ల జాయ్ రైడ్లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో మెడిసిన్ ఫ్రమ్ స్కై ప్రాజెక్టును ప్రారంభించామని గుర్తు చేశారు. కాగా, 'అమృత్ కాలంలో భారత్‌ను ప్రపంచంతో అనుసంధానించడం' అనే ఇతివృత్తంతో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వింగ్స్ ఇండియా, ఉడాన్ 5.3 నాలెడ్జ్ పేపర్‌ను జ్యోతిరాదిత్య విడుదల చేశారు. గురుగ్రామ్‌లో ఎయిర్‌బస్-ఎయిర్ ఇండియా సంయుక్తంగా విమాన శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు మంత్రి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ప్రారంభం

శంషాబాద్ రూరల్: జీఎంఆర్ ఏరోస్పేస్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌ను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి వర్చువల్‌గా ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ విద్యాసంస్థకు 2021లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి భూమి పూజ చేశారని తెలిపారు. ఈ విద్యా సంస్థలో టైప్ ట్రైనింగ్‌తో పాటు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ ఏఎంఈ ప్రోగ్రామ్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి డీజీసీఏ, ఈఏఎస్ఏ సర్టిఫికెట్లు లభించినట్లు తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఏవియేషన్ విద్యలో నాణ్యతను పెంచుతుందని జీఎంఆర్ ఏరోటెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ పేర్కొన్నారు. సమగ్రమైన, సమర్థవంతమైన విమానయాన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలనేది ఎయిర్‌బస్ ఆశయమని ఆ సంస్థ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ షైలార్డ్ తెలిపారు.

సారంగ్ ఏరోబాటిక్ విన్యాసాలు

అల్వాల్: వింగ్స్ ఇండియాలో భాగంగా భారత వైమానిక దళానికి చెందిన సారంగ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ ప్రదర్శనలో గ్రూప్ కెప్టెన్ ఎస్‌కె.మిశ్రా సారథ్యంలో వింగ్ కమాండర్ శ్రీధర్, స్క్వాడ్రన్ లీడర్ అవినాష్, వింగ్ కమాండర్ టీవీఆర్ సింగ్ పాల్గొన్నారు. ఇది పూర్తిగా స్వదేశీ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్. అనేక అంతర్జాతీయ వేదికల్లోనూ సారంగ్ ఏరోబాటిక్ బృందం అద్భుత ప్రదర్శనలు ఇచ్చింది. చెన్నై, కేరళలో వరదల సందర్భంగా సారంగ్ హెలికాప్టర్ల ద్వారానే సహాయక చర్యలు చేపట్టినట్లు భారత వైమానిక దళ అధికారులు వెల్లడించారు.

టాయ్‌లెట్ ముచ్చట్లు!

మీ కమోడ్ మీతో మాట్లాడుతుంది.. బోర్ కొట్టకుండా పాటలూ వినొచ్చు



కాలంతోపాటు పరుగులు తీస్తూ.. క్షణం తీరిక లేనివారు చాలా మంది టాయ్‌లెట్‌లో న్యూస్‌పేపర్ చదవడం తెలిసిందే..! కొందరు పుస్తకాల పురుగులైతే టాయ్‌లెట్‌లోనూ ఏదో ఒకటి చదువుతూనే ఉంటారు. మరికొందరు మేధావులు తమ ఆలోచనలకు టాయ్‌లెట్‌లోనే పదును పెడుతుంటారు. కానీ, ఇకపై ఎంచక్కా టాయ్‌లెట్‌తో మాట్లాడొచ్చు..! బోర్ కొడితే.. ఇష్టమైన పాటను వినిపించమని టాయ్‌లెట్‌ను అడగొచ్చు కూడా..! అంతేనా.. టాయ్‌లెట్‌లో పనైపోయాక.. ఫ్లష్ నొక్కమని మాటలతో ఆదేశిస్తే.. వెంటనే చేసిపెడుతుంది. మోషన్ సెన్సర్‌తో ఒక వ్యక్తి టాయ్‌లెట్‌లోకి వెళ్లగానే కమోడ్ కవర్ ఆటోమేటిక్‌గా తెరుచుకుంటుంది.. అక్కడి నుంచి వెళ్లగానే మూసుకుంటుంది. 2024లో కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీతో రూపుదిద్దుకున్న కొన్ని ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో మాట్లాడే టాయ్‌లెట్ అగ్రస్థానంలో నిలిచింది. లాస్‌వెగాస్‌లో జరుగుతున్న కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో(సీఈఎస్-2024)లో ఈ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

ప్లంబింగ్ పరికరాల తయారీ దిగ్గజం కోహ్లర్ 'ప్యూర్‌వాష్ ఈ930 బైడెట్ టాయ్‌లెట్ సీట్‌ను సీఈఎస్‌లో ప్రదర్శించింది. దీని ధర రూ.1.77లక్షలు (2,139డాలర్లు). దీన్ని చాలా మోడళ్ల వెస్టర్న్ కమోడ్‌లకు బిగించవచ్చు. దీన్ని బిగించాక టాయ్‌లెట్ స్మార్ట్‌గా మారుతుందని కోహ్లర్ చెబుతోంది. "దీని సెల్ఫ్ వాషింగ్ టెక్నాలజీలో అతినీల లోహిత(యూవీ) లైట్ ఉంటుంది. బ్యాక్టీరియా అంతు చూసేలా టాయ్‌లెట్‌ను శుభ్రపరుస్తుంది. అవసరమైతే హీటర్‌ను ఉపయోగించుకుని వేన్నీళ్లతో శుభ్రం చేస్తుంది. రూమ్‌ఫ్రెష్నర్‌లనూ స్ప్రేచేసి టాయ్‌లెట్‌ను శుభ్రంగా పెడుతుంది. సీటుపై తేమలేకుండా ఎయిర్ డ్రైయర్‌ను వాడుతుంది. గూగుల్ హోమ్, గూగుల్ అసిస్ట్, అమెజాన్ అలెక్సాలతో ప్యూర్‌వాష్ ఈ930ని అనుసంధానం చేయొచ్చు. వాయిస్ కమాండ్/రిమోట్‌తో ఆపరేట్ చేయవచ్చు.

- సెంట్రల్ డెస్క్

చాట్‌జీపీటీకి భౌతిక రూపం



ఏఐ లాంగ్వేజ్ మోడల్ చాట్‌జీపీటీ గురించి తెలియని వారు ఉండరు. సీఈఎస్-2024లో చాట్‌జీపీటీకి భౌతిక రూపాన్నిస్తూ ఓపెన్ ఏఐ సంస్థ 'వీహెడ్' పరికరాన్ని ప్రదర్శించింది. ఈ పరికరాన్ని చాట్‌జీపీటీ తలగా అభివర్ణించింది. అలెక్సా మాదిరిగానే ఆదేశాలకు అనుగుణంగా అత్యంత వేగంగా సమాధానాలను ఇస్తుంది.

మీరు చూస్తున్న పక్షి పేరు చెప్పేస్తుంది



స్వరోవ్‌స్కీ సంస్థ రూపొందించిన బైనాక్యులర్లు.. మనం చూస్తున్న పక్షుల పేర్లను చెప్పేస్తాయి. 'మెర్లిన్ బర్డ్ ఐడీ' డేటాబేస్ ద్వారా 9 వేల రకాల పక్షులను ఈ బైనాక్యులర్లలో నిక్షిప్తం చేశారు. ఎవరైనా ఈ బైనాక్యులర్ ద్వారా ఒక పక్షిని చూస్తే.. ఏఐ ద్వారా దాని పేరు, శాస్త్రీయ నామం మొదలు.. వివరాలన్నింటినీ చకచకా చెప్పేస్తుంది.



ఇవే కాకుండా.. సీఈఎస్‌లో ఎన్నెన్నో వింతలు, విశేషాలున్నాయి. మాంసాన్ని ఏఐ సాయంతో గ్రిల్ చేసే పరికరం, ఏఐ ద్వారా ఫోన్లలోని యాప్‌లను నియంత్రించే టూల్, తెరపైన ప్రత్యక్షమై ఏఐ ద్వారా కోరిన వివరాలు అందించే 'ర్యాబిట్'.. ఇలా ఎన్నో కొంగొత్త ఆవిష్కరణలున్నాయి.

నువ్వు పళ్లను సరిగ్గా తోమట్లేదు!



సీఈఎస్-2024లో ఏఐ ఆధారిత మరో ఆవిష్కరణ ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అదే మాట్లాడే ఎలక్ట్రానిక్ టూత్‌బ్రష్-ఓక్లీన్ ఎక్స్ అల్ట్రా..! ఈ బ్రెష్‌ను వాడేవారు తమ నోట్లోకి కంప్యూటర్‌ను పంపి స్కాన్ చేసుకున్నట్లే. పళ్ల పటుత్వం, బలహీనతలను ఈ టూత్ బ్రష్ ఇట్టే కనిపెడుతుంది. ఏఐ వాయిస్ కమాండ్స్ ద్వారా పళ్లను మరింత శుభ్రం చేసుకోవచ్చు. ఈ బ్రష్‌కు కస్టమ్ మోడ్స్, ఇంటరాక్టివ్ స్క్రీన్ మోడ్ ఉంటాయి. ఇది నిమిషానికి 84వేల కదలికలతో పళ్లను శుభ్రం చేస్తుంది. ఇందులో 5 రకాల బ్రషింగ్ మోడ్స్ ఉంటాయి. దీని ధర సుమారు రూ.10 వేలు.

గురకను తగ్గించే దిండు



నిద్రలో గురక చాలా మందికి సమస్యే! సర్కేడియన్ రిథమ్ సిండ్రోమ్‌తోపాటు పలు కారణాలు గురకకు దారితీస్తాయి. సీపాప్ లాంటి పరికరాలెన్నో దీనికి విరుగుడుగా మార్కెట్లో ఉన్నాయి. సీఈఎస్ ప్రదర్శనలో పరిశోధకులు ఓ స్మార్ట్ దిండు ను పరిచయం చేశారు. ఏఐ పరిజ్ఞానంతో పనిచేసే ఈ దిండు (ద డెరుస్సీ యాంటీ-స్నోర్ స్మార్ట్ పిల్లో) నిద్రించే వ్యక్తి గురక కొట్టినట్లు గుర్తించగానే.. శ్వాస ఇబ్బంది లు తొలగేలా దిండు స్థాయిలో మార్పులు చేస్తుంది. దీంతో89% దాకా గురక తగ్గుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

పారదర్శక టీవీ



ఎలక్ట్రానిక్స్ షోలో టీవీల ఉత్పత్తి దిగ్గజం ఎల్‌జీ 'ట్రాన్స్‌పరెంట్ టీవీ ఎల్‌జీ 77ఇంచ్ ఓఎల్‌ఈడీ టీ'ని ప్రదర్శించింది. ఈ టీవీ పూర్తి పారదర్శకంగా ఉంటుంది. అంటే.. టేబుల్‌పై టీవీని పెడితే.. టెలివిజన్ సెట్ వెనక ఉన్న వస్తువులను స్పష్టంగా చూడవచ్చు. టీవీ కార్యక్రమాలను వీక్షిస్తున్నప్పుడు కూడా అవసరమనుకుంటే.. బ్యాక్‌గ్రౌండ్‌ను చూసేలా ఈ టీవీలో ఫీచర్లున్నాయి.

మరొకరు బలికాక ముందే హామీలు నెరవేర్చాలి!

- అంగన్వాడీ కార్యకర్త మృతిపై చంద్రబాబు విచారం

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 'దయ లేని ప్రభుత్వంతో పోరాడి పోరాడి ఒక గుండె అలసి, ఆగిపోయింది. మరో ప్రాణం బలికాక ముందే అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను జగన్ సర్కార్ నెరవేర్చాలి' అని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం 38 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం న్యాయం చేయకపోగా, కక్ష సాధింపులకు దిగడం వారిని మనోవేదనకు గురి చేస్తోందని మండిపడ్డారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అంగన్వాడీ కార్యకర్త శాంతకుమారి మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు శుక్రవారం 'ఎక్స్' ద్వారా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వేమన గొప్ప సంఘ సంస్కర్త: చంద్రబాబు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి వేమన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికుడని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా శుక్రవారం 'ఎక్స్' వేదికగా చంద్రబాబు నివాళులర్పించారు. 600ఏళ్ల క్రితమే సమాజంలో కుల,మత భేదాలు, దురాచారాలను వేలెత్తి చూపి, సామాజిక చైతన్యం కలిగించిన మహానుభావుని స్ఫూర్తిగా, మనందరం వేమన ఆశించిన సమసమాజం కోసం కృషి చేద్దామ'ని పేర్కొన్నారు.

ఈసీ నిబంధనలు పాటిస్తున్నాం: ఎక్సైజ్

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తున్నామని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వసూళ్ల వ్యసనంలో ఎక్సైజ్' కథనంపై ఆ శాఖ కమిషనర్ వివేక్ యాదవ్ వివరణ ఇచ్చారు. బదిలీల కోసం ప్రభుత్వం ఓ కమిటీని నియమించిందని, పారదర్శక విధానంలో కమిటీ సిఫారసులు చేస్తుందని తెలిపారు. కమిటీని నియమించినప్పటికీ బదిలీలకు మార్గదర్శకాలు విడుదల కాలేదన్నారు. మార్గదర్శకాలు విడుదలయ్యాక బదిలీల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. బదిలీల్లో అక్రమాలు జరగలేదని ఎక్సైజ్ ఉద్యోగుల జేఏసీ నేతలు బాబ్జీరావు, నరసింహులు, కోటయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వీలైనంత త్వరగా బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అయోధ్య హనుమాన్ గఢీ ఆలయంలో సీఎం యోగి పూజలు

అయోధ్య, జనవరి 19: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్థానిక హనుమాన్ గఢీ ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. రామాలయాన్ని కూడా సందర్శించిన ఆయన యూపీ సంక్షేమాన్ని కాంక్షిస్తూ పూజలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 22వ తేదీ జరగనున్న ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. స్థానిక అధికారులకు, పోలీస్ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతిష్ఠాత్మక అయోధ్య రామాలయాన్ని పూర్తిగా పరిశీలించిన ఆయన అక్కడ జరుగుతున్న ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోలార్ బోట్ సర్వీసును సీఎం ప్రారంభించారు. గత 11 రోజుల్లో యోగి, అయోధ్యను సందర్శించడం ఇది మూడవ సారి. కాగా, ప్రధాన ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న 1008 కుండియా హనుమాన్ మహా యజ్ఞంలో ఆదిత్యనాథ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

ఆస్ట్రేలియాలో 721 అడుగుల రామాలయం

- సన్నాహాలు చేస్తున్న 'ఇస్వాకు' సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 19: ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన రామాలయం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 150 ఎకరాల స్థలంలో 721 అడుగుల ఎత్తు ఉన్న మందిరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందుకు సుమారు రూ.600 కోట్లు వ్యయం కానున్నట్టు అంచనా వేశారు. ద ఇంటర్నేషనల్ శ్రీరాం వేదిక్ అండ్ కల్చరల్ యూనియన్ (ఐఎస్‌వీఏసీయూ-ఇస్వాకు) సంస్థ ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరగనుంది. సంప్రదాయ మందిరంతో పాటు, అంతకుమించి పలు సౌకర్యాలను కల్పించనున్నట్టు ఆ సంస్థ ఉప అధిపతి డాక్టర్ హరేంద్ర రాణా తెలిపారు.దీప ద్వారం, చిత్రకూట్ వాటిక, పంచవటి వాటిక పేరుతో ఉద్యానవనాలు, రామ్ నివాస్ హోటల్, సీతా రసోయి రెస్టారెంట్, రామాయణ సదన్ గ్రంథాలయం, తులసీదాస్ హాల్ వంటి సౌకర్యాలు ఉంటాయి. యోగా కేంద్రం, ధ్యాన మందిరం, వేద అధ్యయనం, పరిశోధన కేంద్రం, మ్యూజియం కూడా ఉంటాయి. పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ సోలార్ ప్లాంటుతో పాటు కర్బన రహిత వాతావరణాన్ని నెలకొల్పనున్నారు.

'మద్య' నాటకం!

- చెరో దారిలో వెళ్తున్న ఎక్సైజ్, సెబ్
- ఇన్నాళ్లూ బెల్టు షాపులను వదిలేసిన సెబ్
- ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో హడావుడి
- బెల్టులపై దాడులకు మౌఖిక ఆదేశాలు!
- ప్రతి స్టేషన్‌కూ రోజుకో కేసు టార్గెట్
- షాపులపై నిఘా పెట్టిన సిబ్బంది
- మరోవైపు అమ్మకాలు తగ్గకూడదంటున్న ఎక్సైజ్
- బెల్టులన్నీ అధికార పార్టీ వారి కనుసన్నల్లోనే..
- కేసులు పెడితే అమ్మకాలపై ప్రభావం
- ఆదాయం తగ్గిపోతుందనే ఆందోళన
- ఎన్నికల నేపథ్యంలో సర్కారు

రెండు నాల్కల ధోరణి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సంపూర్ణ మద్య నిషేధం అని ఎన్నికల ముందు డప్పాలు కొట్టి అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ తర్వాత దానికి పూర్తిగా నీళ్లొదిలేశారు!. ఆదాయం పెంచుకోవడానికి మద్యం విక్రయాలను విచ్చలవిడిగా పెంచేసి.. వచ్చే ఆ సొమ్ముతోనే ప్రభుత్వ పథకాలను నడిపే స్థితికి దిగజారిపోయారు!.. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో మద్యం అమ్మకాలు, బెల్టులు, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై దృష్టి సారించడంతో.. జగన్ సర్కారు కాసింత ఇరకాటంలో పడింది. ఎక్కడా బెల్టు షాపులు ఉండకూడదని కమిషన్ ఆదేశించడంతో ఇప్పటివరకూ అడపాదడపా కేసులు పెట్టిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్).. ప్రతి స్టేషన్‌లో బెల్టు షాపులపై రోజుకో కేసు నమోదు కావాల్సిందేనని హడావుడి చేస్తోంది. మరోవైపు.. ఎక్కడా మద్యం అమ్మకాలు తగ్గడానికి వీల్లేదని ఎక్సైజ్ శాఖ అంటోంది. అయితే.. ఇలా అటు బెల్టులు లేకుండా, ఇటు మద్యం అమ్మకాలు తగ్గకూడదని నాటకాలాడితే ఎలా అంటూ మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ మద్యం షాపులే కావడంతో ఇంతవరకూ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్మే బెల్టు షాపులను పట్టించుకోని సెబ్ అధికారులు, సిబ్బంది ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు జడిసి హడావుడి చేస్తున్నారు. రాష్ట్రంలో 208 స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్లు ఉండగా, సెబ్ కానిస్టేబుళ్లు షాపుల వద్ద నిఘా పెట్టి మూడు కంటే ఎక్కువ సీసాలు ఎవరు తీసుకెళ్తున్నారో వారిని అనుసరించి కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని కనిపెట్టిన షాపుల్లోని సిబ్బంది.. కానిస్టేబుళ్ల కంటపడకుండా బెల్టులకు మద్యం అమ్ముతున్నారు. క్షేత్రస్థాయిలో ఇపుడు ఇదొక అంతర్గత పోటీగా మారింది. మద్యం అమ్మకాలు తగ్గకుండా చూసేందుకు బెల్టులకు మద్యం అమ్ముతుంటే, వాటిని పట్టుకుని కేసులు పెట్టాలని సెబ్ ప్రయత్నిస్తుండం కొత్త వివాదంగా మారుతోంది. తాజాగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇదే విషయంలో సెబ్ అధికారులతో గొడవకు దిగారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమ్ముతున్న మద్యమే తీసుకెళ్తున్నా కేసులు పెడుతున్నారంటూ వారిపై మండిపడ్డారు. రోజూ ఇలాగే తీసుకెళ్తామని కేసులు పెడితే ఊరుకోనంటూ వారిని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలే రాష్ట్రంలో పలు చోట్ల వెలుగుచూస్తున్నాయి. కారణం.. బెల్టుషాపులన్నీ అధికార పార్టీకి చెందిన వారి కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ మద్యం షాపుల నుంచి మద్యాన్ని వారికే అడిగిన మేరకు విక్రయిస్తున్నారు. ఎక్కడైనా ప్రతిపక్షాలకు చెందిన వారు, తటస్థులు అదనపు సీసాలు అడిగినా ఇవ్వడం లేదు. ఇదంతా తెలిసినా సెబ్ ఇప్పటివరకూ పట్టించుకోలేదు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం ఎన్‌డీపీఎల్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టింది. ఈ క్రమంలో బెల్టులపై కేసులు తగ్గిపోయి ఈసీకి చూపించే స్థాయి గణాంకాలు లేకుండా పోయాయి. దీంతో హడావుడిగా రంగంలోకి దిగిన సెబ్.. సిబ్బందిని పరుగులు పెట్టిస్తూ కేసులు కట్టాలని ఒత్తిడి చేస్తోంది. దీంతో సెబ్ సిబ్బంది గ్రామాలపై పడుతున్నారు.

అమ్మకాలు తగ్గలేదు!

అయితే, ప్రస్తుతానికి మద్యం అమ్మకాలు తగ్గలేదని ఎక్సైజ్ వర్గాలు అంటున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా రూ.85కోట్ల మేర మద్యాన్ని విక్రయించారు. సంక్రాంతి పండగ వల్ల ముందుగానే అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ వర్గాలు భావిస్తున్నాయి. బెల్టులపై కేసుల ప్రభావం పండగ తర్వాత కనిపించొచ్చని అంటున్నాయి.

ఇన్నాళ్లూ విచ్చలవిడిగా

గతంలో ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో మద్యం షాపులున్నప్పుడు ఎక్సైజ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ తరచూ కేసులు పెట్టేది. వైసీపీ జమానాలో ప్రభుత్వమే అమ్మకాలు చేపట్టడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంగా పనిచేస్తున్న సెబ్ షాపులను వదిలేసింది. వైసీపీ వచ్చాక.. గతంలో ఒకసారి ఏకంగా చీఫ్ సెక్రటరీ స్థాయిలోనే మద్యం అమ్మకాలు పెంచాలంటూ ప్రభుత్వం సమీక్షలు నిర్వహించడం గమనార్హం. ఖజానాకు వచ్చే ఆదాయం తగ్గిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని రకాల విధానాలు అవలంబించింది. ఒకసారి భారీగా మద్యం ధరలు పెంచి, అమ్మకాలు పడిపోవడంతో ఆదాయం కోసం తగ్గించింది. ఏదొక రూపంలో ఆదాయం పెంచుకునే ప్రయత్నం చేసింది.

ఆదాయం తగ్గితే కష్టమే!

మద్యంపై ఆదాయాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం ఏమాత్రం ఇష్టపడటం లేదు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.2వేల కోట్ల మేర మద్యం నుంచి ఆదాయం వస్తోంది. ప్రభుత్వం బటన్ నొక్కే సంక్షేమ పథకాలు, ఇతరత్రా అవసరాలకు ఈ ఆదాయం కీలకంగా మారింది. మరోవైపు ఈ ఆదాయాన్ని చూపించి బేవరేజెస్ కార్పొరేషన్ ఇప్పటికే వేల కోట్ల అప్పులు చేసింది. ప్రతి నెలా ఆ అప్పులు చెల్లించాలి. ఇటు తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించడం, అటు ప్రభుత్వానికి ఆర్థిక అండగా ఉండటంతో మద్యం ఆదాయం తగ్గకూడదని ప్రభుత్వం ఆలోచిస్తోంది. మద్యం ఆదాయం పడిపోతే అది ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపుతుంది. అయితే, ఎన్నికల కమిషన్ హెచ్చరికల నేపథ్యంలో ఇలా బెల్టులను కట్టడి చేస్తున్నామనే డ్రామాలాడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవితాంతం కాంట్రాక్టులోనేనా?

- క్రమబద్ధీకరిస్తామన్న జగన్ హామీ ఏమయ్యింది?
- రైతుబజార్ల సిబ్బంది ఆవేదన
- అర్హతలున్నా పర్మినెంట్ చేయని సర్కార్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రోజుకు 18 గంటలపైగా పని చేస్తున్న రైతుబజార్ల సిబ్బంది సేవల్ని ప్రభుత్వం గుర్తించడం లేదు. తగిన విద్యార్హతలతో ఏళ్ల తరబడి ఎస్టేట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న వారి సేవల్ని క్రమబద్ధీకరించడం లేదు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్.. కాంట్రాక్ట్ పద్ధతిలో నియమితులైన రైతుబజార్ల సిబ్బందిని మాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 110 రైతుబజార్లలో ఎస్టేట్ ఆఫీసర్‌కు పీజీ, సూపర్‌వైజర్‌కు డిగ్రీ, సెక్యూరిటీ గార్డుకు పదో తరగతి అర్హతతో నియామకాలు పొంది, ఐదేళ్ల పైబడి, 25ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఎస్టేట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు కలిపి 300 మందిలోపే ఉన్నారు. కానీ కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్న వీరిని ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్‌లోనూ చేర్చలేదు. వీరి సేవల కాంట్రాక్ట్‌ను ఏటా పొడిగిస్తున్న ప్రభుత్వం.. ఇటీవల జారీ చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు రైతుబజార్ల సిబ్బందికి మాత్రం వర్తింప చేయలేదు. దీంతో మొత్తం సర్వీస్, విద్యార్హతను పరిగణలోకి తీసుకుని తమనూ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వ పెద్దల్ని కలిసినా, స్పందన లేకపోవడంతో రైతుబజార్ల సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. 1999లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబజార్ల ద్వారా వినియోగదారులు, కూరగాయ రైతులకు చాలా మేలు జరుగుతోంది. దీన్ని ఆసరా చేసుకుని, రైతుబజార్లలో స్టాల్స్ అద్దెలను ప్రభుత్వం గణనీయంగా పెంచేసింది. దీంతో ఏటా రూ.12కోట్ల దాకా ఆదాయం వస్తున్నా.. రైతుబజార్ల సిబ్బందికి మాత్రం అరకొర వేతనాలే ఇస్తున్నారు. తెల్లవారుజామున 4గంటల నుంచి రాత్రి 9గంటల దాకా విధులు నిర్వహించే తమ సేవలకు గుర్తింపు లేకుండా పోయిందని రైతుబజార్ల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంటగడితే ఆ పార్టీలోకి వెళ్తా!

- నాది ప్రజాపక్షం.. జనం గొంతుకనై ఉంటా: శివాజీ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 'ఫలానా పార్టీ వాడు అనో, చంద్రబాబు నాయుడు, జగన్, కేసీఆర్ మనిషి అనో ఏదో ఒక సంబంధం నాకు అంటగట్టాలని చూడొద్దు. కాదూ కూడదని ఒక పార్టీకి అంటగట్టే ప్రయత్నం చేస్తే మాత్రం నేను ఆ పార్టీలోకే వెళతాను. దూల తీర్చేస్తాను. కాబట్టి దయచేసి నా జోలికి రావొద్దు' అని నటుడు శివాజీ అన్నారు. ఆయన లీడ్ రోల్‌లో నటించిన '90స్' వెబ్‌సిరీస్ ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. శుక్రవారం యూనిట్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ 'నేను సమైక్యవాదిని కాదు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం మాత్రమే పోరాడాను. ప్రత్యేక రాష్ట్రం అనేది తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కల. ఇప్పుడు అందరం కలిసే ఉంటున్నాం. ఎన్నికలు వచ్చినా, రాకపోయినా నేను ఎప్పుడూ జనం గొంతుకనై ఉంటాను. నేనెప్పుడూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనలేదు. ప్రజలకు ఏదైనా సమస్య వస్తే మాత్రం వాళ్ల కోసం పోరాడతాను. చనిపోయేదాక నాది ప్రజాపక్షమే' అన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటి వాసుకీ, దర్శకుడు ఆదిత్య హాసన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విభజన హామీలపై నోరు విప్పరేం జగన్?: మాణిక్కం ఠాగూర్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విభజన హామీలపై నోరెందుకు పెగలడం లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కు, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేర్చాలంటూ కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదంటూ ఎక్స్ వేదికగా జగన్‌ను మాణిక్కం ఠాగూర్ ప్రశ్నించారు.

ఆలయ ప్రతిష్ఠకు సెలవు రాజ్యాంగ ఉల్లంఘన: సీపీఎం

న్యూఢిల్లీ, జనవరి 19: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలకు హాఫ్ డే సెలవు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో తప్పు పట్టింది. శుక్రవారం ఆమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. '22వ తేదీ ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకుని మధ్యాహ్నం 2.30 వరకూ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఇవ్వాలన్న కేంద్రం నిర్ణయాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చర్య, మతపరమైన కార్యక్రమంలో ప్రభుత్వం, రాజ్యం నేరుగా పాల్గొనడమే. రాజ్యం ఎలాంటి మతం రంగును కలిగి ఉండకూడదన్న రాజ్యాంగ స్ఫూర్తిని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించడమే అవుతుంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది.

రాముడు అయోధ్యకే పరిమితమా!

- ఫరూక్ అబ్దుల్లా

జమ్ము, జనవరి 19: 'రాముడు బీజేపీకి మాత్రమే చెందిన వాడా? ఆర్ఎస్ఎస్‌కు మాత్రమే పరిమితమైన వాడా? ఎవరినైనా ఆహ్వానించడానికి అసలు వాళ్లు ఎవరు? దేవాలయానికి వెళ్లాలంటే ఆహ్వానం కావాలా? ఆహ్వాన ప్రక్రియే తప్పు. రాముడికి ఎవరూ సంరక్షకులు కాదు' అని జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ముందు చర్చకు తెరతీశారు. 'అయోధ్య రామాలయంలోనే రాముడు ఉంటాడా? మరే దేవాలయంలోనూ ఉండడా? మిగిలిన రామాలయాలన్నీ పనికిరానివేనా? రాముడు సర్వాంతర్యామి. గుడి లేని చోట కూడా రాముడు ఉంటాడు. రాముడిని హిందువుగా మాత్రమే చిత్రీకరించడం సరికాదు' అని ఫరూక్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 20 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్‌లోని మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్)- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 204 టీఎంఆర్ పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలు; ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్ అలాగే 194 టీఎంఆర్ జూనియర్ కళాశాలలు(జనరల్ & ఒకేషనల్), 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) మైనారిటీ గురుకులాల్లో జూనియర్ ఇంటర్ అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. మైనారిటీ వర్గాలతోపాటు అన్ని కేటగిరీల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్‌కు మైనారిటీ అభ్యర్థులు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అడ్మిషన్ పొందినవారికి విద్య, భోజనం, వసతి ఉచితం. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్, షూస్, కాస్మొటిక్ కిట్, హెల్త్‌కేర్ కిట్ అందిస్తారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సైన్స్ ల్యాబొరేటరీలు, లైబ్రరీ, రోబోటిక్స్ & ఇంజనీరింగ్ ల్యాబొరేటరీలు, వెంటిలేటెడ్ డార్మిటరీలు ఉంటాయి. డ్రింకింగ్ వాటర్, హాట్ వాటర్ అందిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. అడ్వెంచర్ యాక్టివిటీస్, సమ్మర్ క్యాంప్‌లు, లిటరసీ యాక్టివిటీస్(డిబేట్, ఎస్సే రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, స్పీచ్), ఫీల్డ్ ట్రిప్స్, ఎడ్యుకేషనల్ టూర్స్, డిస్ట్రిక్ట్/స్టేట్ లెవెల్ స్పార్క్ ఫెస్ట్‌లు, పేరెంట్-టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తారు. క్రీడలకు ప్రాధాన్యం ఉంటుంది. సెల్ఫ్ అవేర్‌నెస్ & కాన్ఫిడెన్స్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు.

తెలంగాణ మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు



మైనారిటీ గురుకుల కళాశాలల వివరాలు

- టీఎంఆర్ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. సీఓఈ మైనారిటీ గురుకులాల్లో జేఈఈ/ఐఐటీ, నీట్, ఎన్‌డీఏ, క్లాట్, సీయూఈటీ, యూపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ బోర్డు, సీఏ/సీఎస్ ఫౌండేషన్‌లకు సంబంధించి సమగ్రమైన శిక్షణ అందిస్తారు. ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఇంగ్లీష్, సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగు/ఉర్దూ ఉంటాయి.
- మైనారిటీ ఒకేషనల్ కళాశాలల్లో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టీ), మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఎంపీహెచ్‌డబ్ల్యూ), కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ(సీజీటీ), ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఈటీ), కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ(సీటీ), కంప్యూటర్ సైన్స్(సీఎస్), అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్(ఏ&టీ), టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(టీ&హెచ్ఎం), అగ్రికల్చరల్ క్రాప్ ప్రొడక్షన్(ఏసీపీ), లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్ & డెయిరీ టెక్నాలజీ(ఎల్ఎం&డీటీ) కోర్సులు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన సబ్జెక్టులతో పాటు ఇంగ్లీష్, జనరల్ ఫౌండేషన్ కోర్సులను చదవాల్సి ఉంటుంది.

అర్హత

- విద్యార్థులు ప్రవేశం పొందాలనుకొన్న తరగతికి కింది స్థాయి తరగతి చదువుతూ ఉండాలి. అయిదోతరగతి చదువుతున్న విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఆరోతరగతి చదువుతున్న విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య, ఏడోతరగతి చదువుతున్న విద్యార్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య, ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థులు 2009 సెప్టెంబరు 1 నుంచి 2012 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.
- ఇంటర్లో చేరే అభ్యర్థులు ప్రస్తుతం పదోతరగతి చదువుతూ ఉండాలి. వీరికి 2024 మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే బోర్డు ఎగ్జామ్‌లో కనీసం 6 సీజీపీఏ రావాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 18 ఏళ్లు మించకూడదు.
- కుటుంబ వార్షికాదాయం గ్రామాల్లో రూ.1,50,000; నగరాల్లో రూ.2,00,000లు మించకూడదు.

ఎంపిక

- అయిదోతరగతిలో ప్రవేశానికి మైనారిటీ అభ్యర్థులను ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో; ఇతర కేటగిరీల అభ్యర్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేస్తారు.
- బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్‌కు ముందుగా దరఖాస్తు చేసుకున్న మైనారిటీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యమిస్తారు.
- జూనియర్ ఇంటర్(జనరల్/ఒకేషనల్)లో ప్రవేశానికి అభ్యర్థులను పదోతరగతిలో సాధించిన మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తారు.
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) మైనారిటీ గురుకులాల్లో ప్రవేశానికి స్ర్కీనింగ్ టెస్ట్, ఓరల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్ర్కీనింగ్ టెస్ట్‌ను పెన్-పేపర్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో పదోతరగతి సిలబస్‌ను అనుసరించి మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జేఈఈ/ఐఐటీ అభ్యర్థులకు మేథ్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 20, కెమిస్ట్రీ నుంచి 20, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; నీట్ అభ్యర్థులకు బయాలజీ నుంచి 30, ఫిజిక్స్ నుంచి 15, కెమిస్ట్రీ నుంచి 15, మేథ్స్ నుంచి 20, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; ఎన్‌డీఏ అభ్యర్థులకు జనరల్ మేథ్స్ నుంచి 40, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, జీకే& కరెంట్ అఫైర్స్ నుంచి 20, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; క్లాట్/సీఏ/సీఎస్ ఫౌండేషన్ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, సోషల్ నుంచి 20, జీకే&కరెంట్ అఫైర్స్ నుంచి 15, మేథ్స్ నుంచి 15, జనరల్ సైన్స్ నుంచి 10, లాజికల్ రీజనింగ్& లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 20 ప్రశ్నలు; యూపీఎస్సీ/టీఎస్‌పీఎస్సీ/ఎస్ఎస్‌సీ/బ్యాంకింగ్ సర్వీస్ రిక్రూట్‌మెంట్/ఆర్ఆర్‌బీ అభ్యర్థులకు సోషల్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 15, జనరల్ సైన్స్ నుంచి 15, జీకే & కరెంట్ అఫైర్స్ నుంచి 20, జనరల్ మేథ్స్ నుంచి 10, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో ఉంటాయి. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి సంబంధిత సబ్జెక్టుల్లో ఓరల్ ఇంటర్వ్యూ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- రిజిస్ట్రేషన్ ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 6
- **అయిదు నుంచి ఎనిమిదోతరగతి వరకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ:** ఏప్రిల్ 24 నుంచి 30 వరకు
- **జూనియర్ ఇంటర్ విద్యార్థుల ఎంపిక ప్రక్రియ:** మే 1 నుంచి 10 వరకు
- **సీఓఈ గురుకులాల్లో ప్రవేశానికి స్ర్కీనింగ్ టెస్ట్:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** tmreistelangana.cgg.gov.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ) - 2023-24 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(ఎంఎఫ్ఎస్సీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ ర్యాంక్, అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్సెస్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. స్థానిక అభ్యర్థులకు ఫెలోషిప్ సౌకర్యం ఉంది. ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో చేరినవారికి నెలకు రూ.9,000; పీహెచ్‌డీలో చేరిన వారికి నెలకు రూ.10,000 ఇస్తారు.

సీట్ల వివరాలు: ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 3, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ 2, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 4, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ 3, ఫిషరీస్ ఇంజనీరింగ్ 2 సీట్లు చొప్పున మొత్తం 16 సీట్లు ఉన్నాయి.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంఎఫ్ఎస్సీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు నాటికి అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఎఫ్ఎస్సీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 50 ఏళ్లు మించకూడదు. రెండు ప్రోగ్రామ్‌లకు జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 20
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, అయిదో అంతస్తు, విశాల్ రెసిడెన్సీ, పద్మజ నగర్, తాడిగడప, విజయవాడ-521134
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమా



హరియాణాలోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా 2024 వింటర్ సెషన్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ అనే స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పలు మాడ్యూల్స్, ఇండస్ట్రియల్/ఫీల్డ్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివర్లో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. మొత్తం 360 సీట్లు ఉన్నాయి. వీటిలో 25 శాతం సీట్లను పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు.

పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: ఈ స్పెషలైజేషన్‌లో గ్యాస్, సోలార్, విండ్, బయోమాస్ తదితర పవర్ ప్లాంట్‌లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అంశాలు వివరిస్తారు. పవర్ సెక్టార్ విభాగాల నిర్వహణకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, శివపురి క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయి.

రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: ఈ స్పెషలైజేషన్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్‌కు సంబంధించిన టెక్నాలజీ, ఎకనామిక్స్, పాలసీ, ఎనర్జీ సిస్టమ్స్, సప్లయ్ తదితర అంశాలు ఉంటాయి. సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, ఫొటోవోల్టాయిక్ సిస్టమ్స్, థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్, విండ్ ఎనర్జీ, బయోమాస్, జియోథర్మల్, టైడల్ అండ్ వేవ్ ఎనర్జీ, హైడ్రోజన్ అండ్ ఫ్యూయెల్ సెల్స్, గ్రిడ్ ఇంటిగ్రేషన్, ఇంటర్ఫేసింగ్ టెక్నాలజీస్ అంశాలు వివరిస్తారు. న్యూఢిల్లీ, బెంగళూరు క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ) అభ్యర్థులు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, టెలిఫోన్/ఆన్‌లైన్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అకడమిక్ ప్రతిభకు 90 శాతం, ఇంటర్వ్యూకి 10 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **కోర్సు ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,30,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.3,60,000. అదనంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** ఫిబ్రవరి 26
- **కౌన్సెలింగ్ తేదీ:** ఫిబ్రవరి 29
- **కోర్సు ప్రారంభం:** మార్చి 4 నుంచి
- **సీట్లు మిగిలిన పక్షంలో స్పాట్ అడ్మిషన్స్:** మార్చి 11
- **వెబ్‌సైట్:** npti.gov.in

సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 169

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)... స్పోర్ట్స్ కోటాలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)(నాన్-గెజిటెడ్ నాన్ మినిస్టీరియల్)

క్రీడా విభాగాలు: జిమ్నాస్టిక్, జూడో, వుషు, షూటింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్ ఫ్రీస్టయిల్, గ్రీకో రోమన్, తైక్వాండో, వాటర్ స్పోర్ట్స్ కయాక్, కానో, రోయింగ్, బాడీబిల్డింగ్, వెయిట్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, ట్రయథ్లాన్, డైవింగ్, డైవింగ్ ఈక్వెస్ట్రియన్, యాచింగ్, ఐస్ హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కీయింగ్.

జీతభత్యాలు: రూ.21,700 - రూ.69,100

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత, నిర్దిష్ట శారీరక దారుఢ్యంతో పాటు సంబంధిత క్రీడాంశాల్లో అర్హత సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 ఫిబ్రవరి 15 నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: క్రీడా ప్రదర్శన, స్పోర్ట్స్ ట్రయల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://crpf.gov.in/

డీఆర్‌డీఎల్‌లో ఐటీఐ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

పోస్టు: ఐటీఐ అప్రెంటిస్

ట్రేడులు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, మెషినిస్ట్(గ్రైండర్), కార్పెంటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్, పెయింటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫౌండ్రీమ్యాన్.

అర్హతలు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, డీఆర్‌డీఎల్, కంచన్‌బాగ్, హైదరాబాద్ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29

వెబ్‌సైట్: www.drdo.gov.in/

ఏపీ జ్యుడీషియల్ సర్వీస్‌లో జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అమరావతిలోని ఏపీ స్టేట్ హైకోర్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టు: సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)

ఖాళీలు: 39(32 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్; 7 ట్రాన్స్‌ఫర్ ద్వారా భర్తీ చేస్తారు)

అర్హత: లా లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు అయిదేళ్లు; దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, రాత పరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750

స్ర్కీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 31

చివరి తేదీ: మార్చి 1

స్ర్కీనింగ్ టెస్ట్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: మార్చి 15

స్ర్కీనింగ్ పరీక్ష తేదీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష): ఏప్రిల్ 13

ప్రాథమిక కీ విడుదల/అభ్యంతరాల స్వీకరణ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: https://aphc.gov.in/

డా.వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీలో జూనియర్ అసిస్టెంట్స్

ఖాళీలు 20

విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

జీతభత్యాలు: నెలకు రూ.25,220 - రూ.80,910

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, దివ్యాంగులకు రూ.750. ఇతరులకు రూ.1500.

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: జనవరి 31

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1

వెబ్‌సైట్: drysruhs.edu.in/



లిటిల్స్




మీకు తెలుసా?

- ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, సెమీ ఎడారుల్లో కనపడే ఈ అడవి పిల్లి పేరు 'కారాకల్'. ఈ పదం టర్కీ భాష నుంచి వచ్చింది. దీని అర్థం నల్ల చెవులుండే పిల్లి అని! చూడటానికి పొట్టి చిరుతలా కనిపించే దీని చెవులు మాత్రం పొడవైనవి. చెవుల మీద జుట్టు ఉంటుంది.
- పురాతన చరిత్రలో వీటి ఆనవాళ్లు ఉన్నాయి. విచిత్రమేంటంటే.. ఇవి నీళ్లు తాగకుండా చాలా రోజులు బతుకుతాయి.
- ఇవి కేవలం తెల్లారుజామున మాత్రమే వేటకు బయలుదేరుతారు. పెద్ద ఎలుకలు, పెద్ద పక్షులను సైతం వేటాడతాయి. వీటి చెవుల్లో కేవలం ఆరు కండరాలే ఉంటాయి. దూరంగా అలికిడి కలిగినా కనుక్కుంటాయి. ముఖ్యంగా వేగంగా చెట్లు ఎక్కగలవు కాబట్టే పక్షులను వేటాడగలవు. 40 కేజీలలోపు ఉండే చిన్న జీవులను వేటాడే సామర్థ్యం వీటికి ఉంది.
- రాళ్లమధ్య, వ్యవసాయ భూముల్లో కూడా నివసించటానికి చాలా ఇష్టపడతాయి. ఏడు కేజీల నుంచి 20 కేజీల వరకు బరువుంటాయి.




- గంటకు 75 కిలోమీటర్ల వేగంతో పరిగితే ఈ పిల్లులను సింహాలు, హైనాల చేత చిక్కి చనిపోతుంటాయి.
- వీటిని చిరుత పులుల్లో ఉండే బిహేవియర్ ఉంటుంది. అలానే నడుస్తుంది. చిరుతలానే దాని చెంపలను రాళ్లకు రుద్దుకుంటుంది. అంటే రెండూ ఒకే జాతికి చెందినవి అనమాట. ఇక ఇవి పక్షులను బాగా వేటాడగలదు కాబట్టి అక్కడి లోకల్స్ వీటిని పెంచుకుంటారు. శిక్షణ ఇస్తారు.
- 42 ఇంచుల పొడవు ఉంటుంది. వీటి తోక 13 ఇంచులు ఉంటుంది. ఇవి రెండు పిల్లలను ఏడాదికి ఒకసారి మాత్రమే కంటాయి.
- 12 మిలియన్ల సంవత్సరాల కితం వీటి ఆనవాళ్లు ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు.
- వీటి జీవనకాలం 12 ఏళ్లు.


దారి కనుక్కోండి



రంగులు వేయండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 208

3	6	7	8	9	5	1	2	4
2	1	5	6	4	3	8	9	7
4	8	9	2	1	7	5	6	3
7	3	6	1	5	2	9	4	8
8	9	1	4	3	6	2	7	5
5	2	4	9	7	8	3	1	6
9	7	2	3	8	4	6	5	1
1	5	3	7	6	9	4	8	2
6	4	8	5	2	1	7	3	9

సుడోకు - 207 సమాధానం

5	1	9	4	7	3	8	2	6
3	6	7	1	8	2	9	5	4
2	8	4	9	5	6	7	1	3
6	5	8	3	4	1	2	7	9
1	7	2	6	9	8	4	3	5
4	9	3	5	2	7	1	6	8
8	2	6	7	3	9	5	4	1
7	3	5	8	1	4	6	9	2
9	4	1	2	6	5	3	8	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



గూగుల్ సెర్చ్‌కు హంగులు





గూగుల్ - సెర్చ్‌కు సంబంధించి మేజర్ అప్డేట్ 'సర్కిల్ టు సెర్చ్'ని ప్రకటించింది. యాప్‌ల నుంచి స్విచ్ కాకుండానే యూజర్లు తమ డివైజుల్లో దేనికోసమైనా దీంతో సెర్చ్ చేసుకోవచ్చు. కాంటెక్స్ట్‌పరంగా సెర్చ్ సులువుగా ఉంటుంది. వాస్తవానికి ఒక్కోసారి సెర్చ్ ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే ఈ కొత్త ఫీచర్ ఆ సమస్యలను పరిష్కరించనుంది. సర్కిల్ సెర్చ్‌ని ఒకసారి లోడ్ చేసుకుంటే చాలు - సర్కిలింగ్, హైలైటింగ్, స్క్రిబ్లింగ్, టాపింగ్‌కు వీలు ఉంటుంది. యూజర్ ఆసక్తిని అనుసరించి సమాచారాన్ని పొందవచ్చు. చేస్తున్న పనికి ఎలాంటి ఆటంకం కలుగకుండా, కావాల్సిన సమాచారాన్ని పొందడం ఇందులోని ప్రత్యేకత. ఈ నెలాఖరు నుంచి సర్కిల్ టు సెర్చ్ అందుబాటులోకి వస్తుంది. ప్రీమియం ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు అంటే పిక్సెల్ 8, పిక్సెల్ 8 ప్రొ, న్యూ గెలాక్సీ ఎస్24 సిరీస్‌ల్లో లభ్యమవుతుంది. అలాగే అన్ని ప్రాంతాల్లో, అన్ని భాషల్లో సెర్చ్‌కు వీలు ఉంటుంది. వీడియోల్లోనూ లభ్యమవుతుంది. యూట్యూబ్‌లో ఒక షార్ట్‌ను వీక్షిస్తున్నప్పుడు ఫేవరేట్ యాక్టర్ కోసం పాజ్ చేసుకోవచ్చు. అదైన తరవాత మళ్ళీ పాత వీడియో దగ్గరకు రెజ్యూమ్ కావచ్చు. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లో సర్కిల్ టు సెర్చ్ కోసం హోమ్ బటన్ లేదా నేవిగేషన్ బార్‌ని లాంగ్ ప్రెస్ చేయాలి. ఒకసారి యాక్టివేట్ అయితే చాలు, యూజర్లు ఏ ఐటమ్‌ను సెలక్ట్ చేసుకున్న మరింత సమాచారాన్ని సర్కిలింగ్‌తో పొందవచ్చు.

మల్టీసెర్చ్, జనరేటివ్ ఏఐ

సర్కిల్ టు సెర్చ్‌కు తోడు ఏఐ పవర్డ్ మల్టీసెర్చ్ ఎక్స్‌పీరియెన్స్‌ని కూడా గూగుల్ ప్రకటించింది. దీంతో సెర్చ్ టెక్స్ట్‌కు పరిమితం కాదు. ఇమేజెస్ లేదా స్క్రీన్‌షాట్స్‌కు తోడు ఏఐ పవర్డ్ ఇన్‌సైట్స్ కూడా లభ్యమవుతాయి. ఉదాహరణకు ఒక పిక్చర్ కనిపించినప్పుడు తెలియకుంటే అడగవచ్చు. ఏఐ పవర్డ్ ఓవర్‌వ్యూతో సంబంధిత సమాచారం లభిస్తుంది. అమెరికాలో ఈ వారమే ఇది అందుబాటులోకి వస్తోంది. దీనికోసం ప్రత్యేకించి సెర్చ్‌ల్యాబ్స్‌లో నమోదు కానవసరం లేదు. గూగుల్ యాప్, ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లలో లాంచ్ లెన్స్‌తో ఈ మల్టీసెర్చ్ ఎక్స్‌పీరియెన్స్‌ని పొందవచ్చు. అమెరికాలో కాకుండా మరెక్కడైనా అయితే సెర్చ్ ల్యాబ్స్‌లో సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్(ఎస్‌జీఈ)ని ఎంచుకోవాలి. తద్వారా గూగుల్ యాప్‌లో ఈ ఫీచర్‌ని పొందవచ్చు.

రియల్ టైమ్ ఇంట్రప్రెటర్ ఫీచర్

ఇవాల్టి స్మార్ట్ ఫోన్లు పలు హిడెన్ జెమ్స్‌కు అడ్డాలు. పలు ఫీచర్ల సమాహారాలు. అలాంటి వాటిలో రియల్-టైమ్ వాయిస్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్ ఒకటి. ఇది ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెంటిలోనూ అందుబాటులో ఉంది. తాజా ఫీచర్‌తో టెక్స్ట్ టైపింగ్, రెస్పాన్స్‌కు వేచిఉండటం అన్న ప్రక్రియ ఉండదు. తెలియని భాష నుంచి అనువాదం దానంతట అదే జరుగుతుంది. అందుకోసం



- మొదట గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ముఖ్యంగా విదేశాల్లో ఉంటే దీని కోసం డేటా కన్జూమ్ అవుతుంది. అలాగే ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలి కూడా. ట్రాన్స్‌క్రైబ్ ఫీచర్‌గా దీనికి పేరు. ఇంగ్లీష్ సహా ఎనిమిది భాషలను ఇది సపోర్ట్ చేస్తుంది.
- లాంగ్వేజ్‌ని ఎంపిక చేసుకున్న తరవాత కాన్వర్సేషన్ బటన్‌ని టాప్ చేసి మాట్లాడాలి. వాయిస్‌ని వినిపించే ఇందులో మాన్యువల్, ఆటోమేటిక్ విభాగాలు ఉంటాయి.
- మాట్లాడుతుంటే, టెక్స్ట్ ట్రాన్స్‌క్రిప్షన్స్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. యాక్యురసీని వెరిఫై చేసేందుకు అవకాశం కూడా ఉంటుంది. టెక్స్ట్‌ను టాపింగ్ చేయడం ద్వారా ఇన్‌పుట్‌ని ఎడిట్ చేసుకోవచ్చు. స్పోకెన్ ఔట్‌పుట్ కూడా డిస్‌ప్లే అవుతుంది. రీప్లే ఆప్షన్ కూడా ఉంది.
- ట్రాన్స్‌క్రైబ్ ఫీచర్‌కు పలు ఎక్స్‌టెన్సివ్ సెట్టింగ్స్ ఉన్నాయి. హ్యాండ్ వేవింగ్ ఐకాన్ ఉపయోగించి అనువదించిన భాషలో సమాచారాన్ని ఇన్ఫర్మేషన్ కార్డుని డిస్‌ప్లే చేసుకోవచ్చు. ట్రాన్స్‌లేషన్ ప్రక్రియను మరో స్పీకర్‌కు తెలియజేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.
- ఇందులో రీజినల్ యాక్సెంట్, వాయిస్ స్పీడ్, ట్రాన్స్‌లేషన్ హిస్టరీ క్లియర్ చేసుకునే వీలు కూడా ఉంటాయి. దాదాపుగా అన్ని పరిస్థితుల్లో ఇది ఉపయోగపడుతుంది. మొత్తానికి లాంగ్వేజ్‌పరంగా ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకునేందుకు ఉపయోగపడుతుంది.

టైమ్లీ యాప్‌తో ట్రబుల్స్‌కు చెక్

టైమ్లీ యాప్... సమయపరంగా వచ్చే సమస్యలకు అసలు సిసలు చెక్‌గా దీన్ని భావించవచ్చు. ఇది ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పవర్డ్ యాప్, ఆటోమేటెడ్ టైమ్ ట్రాకర్. టైమ్‌పరంగా ఎదురయ్యే సమస్యలను దీంతో సులువుగా అధిగమించవచ్చు. దీంతో పనిచేయడం ద్వారా షెడ్యూల్‌కు తగ్గట్టు టీమ్స్ పనిచేసుకోవచ్చు, నిర్దేశిత సమయంలోగా టాస్కలను పూర్తి చేసుకోవడానికి కూడా వీలు ఉంటుంది. పైపెచ్చు దీనికి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఫీచర్స్ కూడా ఉన్నాయి. మీటింగ్, టాస్క్స్, బ్రేక్స్ తదితరాలన్నింటినీ ఇది షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసే వీలును కల్పిస్తుంది. ప్రధానంగా...

- ఏఐ కారణంగా టైమ్ మేనేజ్‌మెంట్ యావత్తు ఆటోమేటిక్‌గా పూర్తి చేసే వీలు ఉంటుంది. వెబ్ ట్యాబ్, డెస్క్‌టాప్ యాప్‌పై ఎంత సమయం వినియోగించారు అన్నది తెలుస్తుంది. టైమ్‌ను ఎలా వినియోగించుకుంటున్నారు అన్నది లోతుగా అర్థం చేసుకోవచ్చు.
- డాక్యుమెంట్స్, మీటింగ్స్, ఈమెయిల్స్, వెబ్‌సైట్స్, వీడియో కాల్స్, బ్రేక్స్ వారీగా సమయం ఎలా గడుపుతున్నామన్నది తెలుస్తుంది.
- ప్రాజెక్ట్ ట్రాకింగ్ అంటే రియల్ టైమ్ పరిధిలో బడ్జెట్ మానిటరింగ్, గంటలు, యాక్టివిటీస్ తదితరాలను మానిటర్ చేస్తుంది. ఫలితంగా క్లయింట్లు, భాగస్వాములు ప్రాజెక్టు పనితీరును తెలుసుకోగలుగుతారు. అవసరమైన కరెక్షన్స్ చేసుకోగలుగుతారు.
- కొలాబిరేషన్, సులువుగా యాక్సెసిబిలిటీకి అవకాశం ఉంటుంది. మూడో పార్టీ యాప్స్ అంటే గూగుల్ క్యాలెండర్, జీమెయిల్, మండే.కామ్, టొడేయిస్ట్ తదితరాలతో ఇంటిగ్రేట్ కావచ్చు.

అయితే టైమ్లీ అనేది చందా ఆధారిత టూల్. ఉచిత ట్రయిల్ అవకాశం ఉంది. నెలకు తొమ్మిది డాలర్లతో అయిదుగురు ఉపయోగించు కోవచ్చు. దీని హై ఎండ్ వెర్షన్ రేటు నెలకు 22 డాలర్లు.

షావోమీ 14 ఫీచర్స్ లీక్!



షావోమీ 14 స్మార్ట్‌ఫోన్‌కు సంబంధించిన అల్ట్రా కెమెరా కిట్ - 3సీ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైంది. షావోమీ 13కి సక్సెసర్‌గా దీన్ని చెబుతున్నారు. చైనా కంపల్సరీ సర్టిఫికేషన్(3సీ) వెబ్‌సైట్‌లో ఇది కనిపించింది. వాస్తవానికి క్వాడ్ రేర్ కెమెరా యూనిట్‌తో వస్తుందని భావిస్తున్నారు. 2402CPS69C నెంబర్‌తో వస్తున్న దీని గరిష్ఠ ఔట్‌పుట్ 1500ఎంఏహెచ్ అట్ 5వి. కిట్ ఎక్స్‌టర్నల్ బ్యాటరీగా పనిచేస్తుంది. మోడల్ నంబర్‌ను పరిశీలిస్తే వచ్చే ఫిబ్రవరి నెలలో దీన్ని విడుదల చేస్తారని సూచిస్తోంది. షావోమీ 14 అల్ట్రా 2కె రిజల్యూషన్‌తో 6.7 ఇంచీల అమోల్డ్ స్క్రీన్. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు కలిగి ఉంటాయని అనుకొంటున్నారు. 50 మెగాపిక్సెల్‌తో నాలుగు కెమెరాలు ఉన్న క్వాడ్ కెమెరా సెట్ ఉందని చెబుతున్నారు. సోనీ ఎల్‌వైటి900 ప్రైమరీ సెన్సర్‌కు తోడు ఎఫ్/1.63 యాపరేచర్ ఉండనున్నాయి. 5,180 ఎంఏహెచ్ బ్యాటరీ, 90వాట్స్ వైర్డ్ చార్జింగ్ సపోర్ట్, 50 వాట్స్ వైర్‌లెస్ చార్జింగ్ సపోర్ట్ ఉండనున్నాయి.

ఈ-సిమ్‌కు అనువుగా ఆండ్రాయిడ్ 14!



ఆల్ఫాబెట్‌కు చెందిన ఆండ్రాయిడ్ 14క్యూపీఆర్ నిజానికి గేమ్ చేంజర్ కాగలదని భావిస్తున్నారు. ఈసిమ్స్ దిశగా ఇది ముందుకెళుతోంది. అంటే ఫిజికల్ సిమ్ నుంచి ఈ సిమ్ కన్వర్టింగ్‌పై ఫోకస్ కనబరుస్తోంది. ఫీచర్ల పనితీరు పెంపునకు దోహదపడనుంది. 'కన్వర్ట్ టు ఈసిమ్' ఫీచర్‌తో ఫిజికల్ సిమ్ కార్డులను ఈ సిమ్‌గా మార్చుకోవచ్చు. నెట్‌వర్క్ పరిధిలో, ఆండ్రాయిడ్ 14 డివైజుల్లో సిమ్స్ మెనూలో ఇది సాధ్యమవుతుంది. మెజారిటీ ఆండ్రాయిడ్ డివైజులు ఇప్పటికీ ఫిజికల్ సిమ్స్‌తోనే పనిచేస్తున్నందున ఇప్పటికిప్పుడు కన్వర్షన్ సాధ్యం కాదనే చెప్పాలి. అమలులోకి వస్తే సిమ్ కన్వర్టింగ్ కోసం ప్రొవైడర్‌ని సంప్రదించాల్సిన అవసరం ఉండదు.

సోనీ ఇన్‌జోన్ బడ్స్



సోనీ ఇన్‌జోన్ బడ్స్ ఇండియన్ మార్కెట్లోకి వచ్చేశాయి. కంపెనీకి సంబంధించి ఇవి లేటెస్ట్ ఎడిషన్. యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్‌కు తోడు ఇది ఎక్స్‌టెర్నల్ నాయిస్‌ని కూడా తగ్గిస్తుంది. 8.4ఎంఎం డ్రైవర్స్ ఉన్నాయి. యూఎస్‌బీ టైప్-సి డోంగెల్ కనెక్షన్ ఉంది. లెటెన్సీ రేటు ముప్పయ్ మిల్లీ సెకండ్లకు లోపే. సింగిల్ చార్జ్‌తో 12 గంటల ప్లేబ్యాక్ సమయం లభిస్తుంది. సోనీ లేటెస్ట్ ఇయర్ ఫోన్లు - మైక్రోఫోన్ అదీ ఏఐ ఆధారిత నాయిస్ రిడక్షన్‌తో వస్తున్నాయి. అలాగే బ్లూటూత్‌తో పది మీటర్ల పరిధిలో ఉండే డివైజ్‌లతో కలవగలదు. కాల్ తీసుకోవడం లేదా రిజెక్ట్ చేసేందుకు వీలుగా ఈ బడ్స్‌లో టచ్ ఎనేబుల్డ్ కంట్రోల్స్ ఉన్నాయి. వాల్యూమ్ పెంపు లేదా స్కిప్ చేసేందుకు వీలుగా కంట్రోల్ కూడా ఉంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లు రెంటికీ సోనీ హెడ్‌ఫోన్స్ కనెక్ట్ యాప్ ద్వారా జోడించుకోవచ్చు. ఇండియాలో దీని ధర రూ.17,990 కాగా బ్లాక్, వైట్ కలర్ ఆప్షన్స్‌లో లభ్యమవుతోంది. సోనీ సెంటర్, సోనీ ఎక్స్‌క్లూజివ్- రిటైల్ స్టోర్స్‌లో ఈ నెల 22 నుంచి లభ్యమవుతుంది.

యాపిల్ విజన్ ప్రొ హెడ్‌సెట్‌లో నెట్‌ఫ్లిక్స్ నో

యాపిల్‌కు చెందిన విజన్ ప్రొ హెడ్ సెట్‌లో డెడికేటెడ్ నెట్‌ఫ్లిక్ యాప్ సౌకర్యం లేదు. బ్లూమ్‌బర్గ్ ఈ విషయాన్ని రిపోర్ట్ చేసింది. యాపిల్ ఐపాడ్‌లో సైతం నెట్‌ఫ్లిక్స్‌కు సానుకూలత లేదు. అసలు ఆ యాప్ ఉండేందుకు వీలుగా ఆ రెంటినీ మలచలేదని సమాచారం. అయితే యాపిల్ హెడ్‌సెట్‌కు డిస్నీ ప్లస్, మేక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో సపోర్ట్ ఉంది. వీటికి బదులు వెబ్ బ్రౌజర్‌తో నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను వాచ్ చేయవచ్చు. ఆఫ్‌లైన్‌లో సైతం నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను వీక్షించడాన్ని కూడా నిరోధించింది. మేక్స్‌పై నెట్‌ఫ్లిక్స్ మాదిరిగానే విజన్ ప్రొ వెబ్ బ్రౌజర్‌పై నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను ఎంజాయ్ చేయవచ్చని యాపిల్ స్పోక్స్‌పర్సన్ ఈ సందర్భంలో 'ద వెర్జ్' అధికార ప్రతినిధి తెలిపారు.



యాపిల్ డివైజ్‌లకు చోరీ నుంచి రక్షణ



యాపిల్ కొత్తగా విడుదల చేస్తున్న అప్డేట్ ఐఓఎస్ 17.3తో డివైజ్‌లను ఎవరైనా తస్కరించినా వాటికి తగు ప్రొటెక్షన్ లభిస్తుంది. 'స్టోలెన్ డివైజ్ ప్రొటెక్షన్'గా ఈ అప్డేట్‌ను ప్రస్తుతం బేటా టెస్టర్లకు అందుబాటులో ఉంచింది. అంటే కొద్ది వారాల్లోనే వినియోగదారుల చేతికి అందుతుంది. బాధితుడి పాస్‌కోడ్‌ను దొంగ తెలుసుకున్నప్పటికీ రక్షణగా ఉంటుంది. డివైజ్ ప్రొటెక్షన్‌కు సంబంధించి ఇదో అదనపు అంచె(లేయర్). యాపిల్ వాచీ కోసం బ్లాక్ యూనిటీ స్పోర్ట్ బ్యాండ్‌ను విడుదల చేస్తున్న సమయంలోనే ఈ అప్డేట్‌ను కూడా సూచనప్రాయంగా తెలియజేసింది. యూజర్ పాస్‌కోడ్‌ని తస్కరించిన వ్యక్తి తెలుసుకున్నప్పటికీ ఈ అప్డేట్ కౌంటర్‌గా పనిచేస్తుంది. ఐఫోన్ పొందగానే దొంగ చేసే మొదటి పని పాస్‌కోడ్‌ను తెలుసుకోవడం. సరిగ్గా అదే సమయంలో ఈ ఫీచర్ కారణంగా సెట్టింగ్ ఆప్షన్స్‌ను లాక్ చేస్తుంది. బయోమెట్రిక్ అథెంటికేషన్స్ అంటే ఫేస్ ఐడీ, టచ్‌ఐడీ కూడా లాక్ అవుతాయి. వాటన్నింటిని తొలగించుకోవాలంటే ఒక గంటకు పైగా సమయం పట్టేస్తుంది. ఈలోపు బాధితుడు తను పోగొట్టుకున్న డివైజ్‌పై పట్టు సాధించవచ్చు. ఇదేకాకుండా ఈ అప్డేట్‌తో కొలాబిరేటివ్ మ్యూజిక్ ప్లేలిస్ట్ (యాపిల్ మ్యూజిక్ ఫీచర్)ను తీసుకు వచ్చింది.

ఆ జీమెయిల్స్ వద్దనుకుంటే కట్

జీమెయిల్ బాక్స్ తెరవగానే అసలు వద్దు అనుకునే న్యూస్‌లెటర్స్ కనిపిస్తే మహా చిరాకుగా అనిపిస్తుంది. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు తొలగించుకోవడం ఒక పనే కాదు, విసుగు అనిపిస్తుంది కూడా. జీమెయిల్ ఆండ్రాయిడ్ యాప్‌లో అందుకు పరిష్కారంగా అన్‌సబ్‌స్క్రయిబ్ బటన్‌ను కలుపుతోంది. దీంతో ఆండ్రాయిడ్ యాప్ యూజర్లు తమకు వద్దనుకునే న్యూస్‌లెటర్స్‌కు యాక్సెస్ అస్సలు లేకుండా చేయవచ్చు. ఫలితంగా స్మార్ట్ ఫోన్లలో ముఖ్యమైన మెయిల్స్‌ను మాత్రమే చూసుకోవచ్చు.

'ఆండ్రాయిడ్ పోలీస్' రిపోర్ట్ ప్రకారం ఆండ్రాయిడ్ యాప్ యూజర్లు ఈ అన్‌సబ్‌స్క్రయిబ్ బటన్‌ని మెయిల్ టాప్‌కార్నర్‌లో చూడవచ్చు. దానిపై క్లిక్ చేస్తే చాలు అన్‌సబ్‌స్క్రయిబ్ అనే పాపప్ మెసేజ్ వస్తుంది. ఈ బటన్ అన్ని స్మార్ట్ ఫోన్లలో అందుబాటులో లేదు. పిక్సెల్ 8 ప్రొ వెర్షన్‌లో ఈ సౌలభ్యం ఉంది. డిసెంబర్ నెలలో దీని రీడిజైనింగ్ జరుగుతున్న సమాచారం తెలిసింది. అంటే



సదరు ఫీచర్ రాబోయే రోజుల్లో జీమెయిల్ ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులోకి వస్తుందని భావించవచ్చు.

గూగుల్ వైఫై, నెస్ట్ వైఫై ఔట్!



సరికొత్త మోడల్‌ని తీసుకువస్తున్న నేపథ్యంలో గూగుల్ వైఫై అలాగే నెస్ట్ వైఫై రౌటర్లకు గూగుల్ స్టోర్ స్వస్తి పలికింది. పిక్సెల్ 7 సిరీస్‌ను 2002లో తీసుకువస్తున్న



సమయంలో నెస్ట్ వైఫై ప్రొని కూడా రిలీజ్ చేసింది. కంపెనీ దీన్నిప్పుడు మరింత స్మార్ట్‌గా మలిచింది. కొత్తగా వస్తున్న రెంటికి సంబంధించిన 'ప్రొ' మోడల్ వైఫై 6ఇ కనెక్టివిటీ అదీ వేగంలో పెరుగుదల, మేటర్ సపోర్ట్‌కు ఉపయోగపడుతుంది. రాబోయే నెలల్లో నెస్ట్ వైఫై మోడల్ వస్తుండటమే ఈ చర్యకు కారణమన్న వివరణ ఒకటి వినిపిస్తోంది. ఇదిలా ఉండగా కొత్త రౌటర్‌ని అభివృద్ధి చేస్తున్నారని, 'బ్రెజ్జా' అనే కోడ్ నేమ్‌తో రూపొందిస్తున్నారని '9టు5గూగుల్' గత ఏడాది తెలిపింది. గూగుల్ వైఫై 2016 ప్యాటర్న్‌ని ఇది ఫాలో అవుతోందని పేర్కొంది.

గూగుల్ స్టోర్ నుంచి తొలగించిన రెండూ ఇతర రిటైలర్స్ వద్ద లభిస్తున్నాయి. రాబోయే కొద్ది వారాల్లో ఈ స్టాక్ కూడా తగ్గుతుంది. ఇదే సందర్భంలో వీటిని ఏడీటీ ద్వారా పొందవచ్చని గూగుల్ స్టోర్ తెలిపింది.

నెస్ట్ వైఫైని అమెజాన్, న్యూఎగ్, టార్గెట్; గూగుల్ వైఫైని అమెజాన్, బెస్ట్ బయ్, న్యూఎగ్, టార్గెట్ నుంచి పొందవచ్చు.

క్రోమ్ సైడ్ ప్యానల్‌కు రీడిజైన్



గూగుల్ - డెస్క్‌టాప్ క్రోమ్‌ని రీడిజైన్ చేసింది. బుక్‌మార్క్స్‌కు, యాక్సెస్‌కు తోడు సైడ్ ప్యానెల్ యూఐతో కొత్తగా మార్చింది. స్క్వేర్-ఇష్ ఐకాన్‌తో సైడ్ ప్యానల్‌ని ఓపెన్ చేసేవారు. బుక్ మార్క్స్ రైట్ హ్యాండ్ కాలమ్‌లో ఉండేవి. ఇప్పుడు ఇక సౌకర్యంగా ఉండేలా వీటిని ఆర్డర్‌లో పెట్టుకోవచ్చు.

ఇందుకోసం త్రీడాట్ మెనూ ఉపయోగించి సైడ్ ప్యానల్‌ను ఓపెన్ చేయవచ్చు. ఉదాహరణకు ఓవర్‌ఫ్లో - బుక్‌మార్క్స్ అండ్ లిస్ట్- షో ఆల్ బుక్ మార్క్స్ అన్న విధంగా ఉంటుంది. దాని టాప్ రైట్ కార్నర్‌లో పిన్ ఐకాన్ ఉంటుంది. బటన్ లేకుండా సైడ్ ప్యానల్‌ని ఎలా ఓపెన్ చేస్తారన్న చింత ఈ అప్‌డేట్‌తో తీరనుంది. ఆన్‌బోర్డింగ్ యూఐ ఉండొచ్చు. డ్రాప్‌డౌన్ మెనూ ఎప్పటిలానే ఉంటుంది. ఇప్పటికిప్పుడు క్రోమ్ 121 బేటా వివరాలతో కూడిన ఫ్లాగ్‌తో మేక్, విండోస్, లినక్స్, క్రోమ్ ఓఎస్, ఫచ్చియా, లాక్రోస్‌లో లభ్యమౌతుంది. chrome://flags/#side-panelpinning లో పొందవచ్చు. కొత్త విధానంతో వద్దనుకుంటే సైడ్ ప్యానల్‌ని ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. కొత్త మార్పుల ఫలితంగా పని వేగంగా జరుగుతుంది.